03-07Pg1exHMNWJQE_03-07Pg1exHMNWJQE.qxd 02/Jul/26 11:33 PM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM గుంటూరు : fb.com/vaartha Digital
Published from Guntur, Ongole, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
3-7-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 153 పేజీలు: 12 వెల: 6.50

బండరాళ్లు పడి 8 మంది కూలీలు మృతి 9లో

శరద్ పవార్ ఎన్సీపి కాంగ్రెస్‌లో విలీనం?

# 'జీ రామ్ జీ'తో అభివృద్ధి వెల్లువ

## దేశ వ్యాప్తంగా ప్రతిష్టాత్మక కార్యక్రమం ఎపిలో శ్రీకారం

## స్వర్ణగిరితో స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చుతాం: సిఎం చంద్రబాబు

## కేంద్రం నుంచి రూ. 7,700 కోట్లు, రాష్ట్రం నుంచి మరో రూ. 4వేల కోట్లు వ్యయం

## ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, డిసిఎం పవన్


గురువారం మొక్కవారిపల్లిలో జరిగిన విబి జీ రామ్ జీ కార్యక్రమానికి హాజరైన కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ తదితరులు

**ఓబులవారిపల్లి (తిరుపతిజిల్లా),జులై 2 ప్రభాత వార్త:** దేశవ్యాప్తంగా అమలయ్యే ఓ ప్రతిష్టాత్మక కార్యక్రమం విబి జీ రామ్ జీ పథకం తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి నుండి ప్రారంభమైంది. విబి జీ రామ్ జీ పథకం రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం మొక్క వారి పల్లి మంగంపేట ప్రాంతం నుంచే ఆవిష్కృతం కావడం శుభపరిణామమని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. గురువారం విబి జీ కార్యక్రమానికి కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, సిఎం చంద్రబాబునాయుడు, డిసిఎం పవన్‌కల్యాణ్ >>2

## అమరావతిని కాదంటే జగన్నాథ రథచక్రాల్లో నలిగిపోతారు..

### - సిఎం చంద్రబాబు

**ఓబులవారిపల్లి(తిరుపతికలెక్టరేట్),జులై 02 ప్రభాతవార్త:** ఆరు నూరైనా ఆంధ్రప్రదేశ్‌కు అమరావతియే రాజధాని అని ,ఎవరైనా కాదంటే వారు జగన్నాథ రథచక్రాల్లో నలిగిపోవాల్సిందేనని సిఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం ముక్క వారి పల్లి గ్రామంలో జరిగిన బహిరంగ సభలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అజీవీక మిషన్ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌కు దేవతల రాజధాని అమరావతి నేనని ఘంటపదంగా నొక్కి చెప్పారు. >>2


గురువారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన జపాన్ ప్రధాని సనాయ్ తకైచి

## ఎఐ, రక్షణలో ద్వైపాక్షిక బంధం

### జపాన్‌తో పలు కీలక ఒప్పందాలు

### ఇద్దరు పిఎంలు మోడీ, తకైచి సమక్షంలో సంతకాలు

### వచ్చే పదేళ్లలో 10 ట్రిలియన్ యెన్‌ల జపాన్ పెట్టుబడులు

**న్యూఢిల్లీ, జులై 2:** కృత్రిమ మేధస్సు (ఎఐ), రక్షణ, ఆర్థిక భద్రత, ఔషధ రంగం, స్వచ్ఛ ఇంధనం వంటి రంగాలలో భారత్- జపాన్ అనేక కీలక ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఈ మేరకు రాబోయే పదేళ్లలో ఇరు దేశాల మధ్య 10 ట్రిలియన్ యెన్ల (దాదాపు 6 లక్షల కోట్ల రూపాయలు) పెట్టుబడులు లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు భారత ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. దీంతో ఇండియా-జపాన్ మధ్య వ్యాపార, వాణిజ్య సంబంధాలు మెరుగుపడనున్నాయి. గురువారం న్యూఢిల్లీలోని హైదరాబాద్ భవన్‌లో ప్రధాని జపాన్ ప్రధాని >>2

# గ్రామీణాభివృద్ధిలో ఎపి టాప్

## రెండేళ్లలో 24 నుంచి మొదటి స్థానానికి వచ్చాం

## గ్రామాలకు ఆర్థిక ఊతం కొత్త పథకం: డి.సిఎం పవన్



**ఓబులవారిపల్లి (తిరుపతిజిల్లా), జులై 02 ప్రభాతవార్త :** గ్రామీణాభివృద్ధిలో దేశానికి ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలుస్తుందని, గత వైసిపి ప్రభుత్వంలో 24 స్థానంలో ఉన్న అభివృద్ధి, గత రెండేళ్ల కూటమీ పాలనలో మొదటి స్థానానికి చేరుకుందని డిసిఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం ముక్క వారి పల్లి గ్రామంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్రసహాయ మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కమలేష్ పాశ్వాన్ సమక్షంలో కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "జాతీయస్థాయి కార్యక్రమానికి రైల్వే కోడూరు నియోజకవర్గం వేదిక కావడం ఆనందంగా ఉందన్నారు.. ఇటీవల ఢిల్లీ పర్యటనలో శివరాజ్ సింగ్ చౌహాన్‌ని కలసి పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించాలని కోరిన వెంటనే ఒప్పుకున్నారన్నారు. రాజకీయంగా ఎంతో అనుభవం ఉన్న శివరాజ్ సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో గ్రామీణ భారతం కొత్తదశలోకి ప్రయాణించాలని, 2047 వికసిత్ భారత్ లో భారత దేశ గ్రామాలు అభివృద్ధితో కళకళలాడాలని కోరుకుంటున్నాను. గ్రామీణ భారత భవిష్యత్తుకు మిషన్‌గా విబి జీ రామ్ జీ పథకం ఉపయోగపడుతుందన్నారు. గతంలో ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కొత్తగా తెచ్చిన మార్పులు గ్రామాలకు ఆర్థిక ఊతం ఇస్తాయని, శ్రామికుల పని దినాలను వందరోజుల నుంచి 125 రోజులకు పెంచడం ద్వారా అదనంగా 25 రోజులు ఉపాధి భరోసా లభించిందన్నారు.. విబి జీ రామ్ జీ పథకంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం 7,700 కోట్లను కేటాయించిందని, రాష్ట్రం వాటాతో కలుపుకొంటే 12,845 కోట్లను పథకానికి ఖర్చుచేయనున్నామని తెలిపారు. ఇది భారతదేశంలోనే మూడవ అతిపెద్ద కేటాయింపు అని చెప్పొచ్చు. స్వచ్ఛ రథాల ద్వారా గ్రామీణ ఆంధ్రప్రదేశ్లో పారిశుధ్యం మెరుగుదలకు చైతన్యం కలిగించే కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. రైల్వే కోడూరు నియోజకవర్గం మైసూరవారిపల్లెలో గ్రామ సభ నిర్వహించినరోజే ఒకేసారి రాష్ట్రమంతటా 13,326 గ్రామ పంచాయతీలకు గ్రామసభలు నిర్వహించి గ్రామస్తులకు ఏం కావాలో వారిదగ్గరనుంచి తీర్మానాలు చేయించి పనులు చేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యక్రమంలో 24వ స్థానంలో అట్టడుగున ఉన్న రాష్ట్రాన్ని మొదటి స్థానానికి తీసుకువచ్చేలా పనిచేశామన్నారు. 2025లో జాతీయ పురస్కారాలను సాధించడంలో ఆంధ్రప్రదేశ్ రెండవ స్థానంలో నిలిచింది. అభివృద్ధి అంటే కేవలం పనులు చేయడమే కాదు ఆ పనులు చేసే శ్రామికుల జీవనానికి కూడా భరోసాఅందించే కార్యక్రమంకావాలి, అభివృద్ధిలో ఎపి ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు.

## ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ పెంపు జీవో జారీ

**విజయవాడ, జులై2, ప్రభాతవార్త ప్రతినిధి:** పిఎస్‌యూలు, కార్పొరేషన్లు, సొసైటీల ఉద్యోగులకు సంబంధించిన పదవీ విరమణ వయసుపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న 60 యేళ్ల పదవీ విరమణ వయసును 62 యేళ్లకు పెంచుతూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. గతంలో రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించిన తీర్మానానికి అనుగుణంగా సర్కార్ ఈరోజు (గురువారం) ఉత్తర్వులు ఇచ్చింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఈ నిర్ణయం 2022 జనవరి 1 నుంచి రెట్రోస్పెక్టివ్‌గా అమలు కానుంది.

అలాగే, 60 యేళ్ల వయసులో పదవీ విరమణ పొందిన అర్హులైన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకునే అవకాశం ఉంది. మళ్లీ జాబ్‌లో చేరే వరకు ఉన్న గ్యాప్ పీరియడ్‌కు జీతం ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. గ్యాప్ పీరియడ్‌ను సీనియారిటీ, ప్రమోషన్ల కోసం పరిగణనలోకి తీసుకోరని పేర్కొంది. కోర్టు ఆదేశాల మేరకు 62 యేళ్ల వరకు పనిచేసిన ఉద్యోగులకు పూర్తి స్థాయి సర్వీస్ బెనిఫిట్స్ అందజేయాలని >>2



## వరద ముంపులో ముంబయి

### మహారాష్ట్రను కుదిపేస్తున్న భారీ వర్షాలు

### మ్యాన్‌హోల్‌లో పడి ఒకరు మృతి

**ముంబయి,జులై 2:** మహారాష్ట్ర రాజధాని ముంబైని భారీ వర్షాలు వణికిస్తున్నాయి. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నగర ప్రజలు అతలాకుతలం అవుతున్నారు. గడిచిన 24 గంటల్లో కొన్ని చోట్ల 200 మి.మీ.వర్షపాతం నమోదైంది. అనేక చోట్ల నీళ్లు నిలిచిపోయాయి. ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు ముంబైనగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. దాదర్‌లోని హిందూ కాలనీ పరిసరాల్లో రోడ్లపై భారీగా వరద నీరు చేరి వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాలు, భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా రాష్ట్రంలోని పన్వెల్,ఉరాన్, పాల్ఘర్,రాయ్‌గఢ్ ప్రాంతాల్లో >>2


గురువారం శ్రీసిటీ ఇంటర్నేషనల్ వర్సిటీ క్యాంపస్‌ను పరిశీలిస్తున్న మంత్రి లోకేష్

## శ్రీసిటీ ఇంటర్నేషనల్ వర్సిటీ ప్రారంభం

### విద్య, పరిశ్రమల అనుసంధానంతో వర్క్‌స్టడీ డ్యూయల్ మోడల్: మంత్రి లోకేష్

**శ్రీసిటీ, జులై 2, ప్రభాతవార్త:** శ్రీసిటీ ఇంటర్నేషనల్ యూనివర్శిటీని శ్రీసిటీలోని తాత్కాలిక క్యాంపస్‌లో రాష్ట్ర మానవవనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, రియల్ టైం గవర్నెన్స్ మంత్రి నారాలోకేష్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐయు గ్లోబల్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యులు, పాలకమండలి ప్రతినిధులు, పరిశ్రమ భాగస్వాములు పాల్గొన్నారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మంత్రి, అతిథులకు సాదర స్వాగతం పలికారు. ఈ >>2

# వైకాపా అక్రమాలు సహించం

### సుప్రీం కోర్టు ఆదేశాలు సైతం బేఖాతరు

### చెరువులు తవ్వరాదనే నిబంధనకు పాతర

### అశోక్ గజపతి భూములు అన్యాయంగా ఆక్రమణ

### వైకాపాపై చట్టపరమైన చర్యలు: మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కిమిడి నాగార్జున


గురువారం మీడియాతో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విజయనగరం, జులై 2 ప్రభాతవార్త:** సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ చెరువులను తవ్వకూడదని నిబంధనలను తుంగలోకి తొక్కి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రైవేటు స్థలంలో పార్టీ కార్యాలయం నిర్మించడం పట్ల రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విస్మయం వ్యక్తం చేశారు. గురువారం నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో పలు విషయాలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. విజయనగరం ప్రజలు ఎర్ర చెరువుగా పిలుచుకునే అశోక్‌కి చెందిన భూమి పత్రాలను వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉండగా ఒక ఎమ్మార్వో చేత రికార్డులు తారుమారు చేయించి ఆర్డిఒ ద్వారా అప్రూవల్ చేయించి కలెక్టర్ నుండి ఆమోదం పొందారన్నారు.

రికార్డులు తారుమారు చేయటం, ఉద్యోగస్తులను భయ పెట్టటం, అక్రమాలకు పాల్పడటం, లిక్కర్ వ్యాపారాలు వంటివి చేయడం వైకాపా నాయకులకు వెన్నతో పెట్టిన విద్య వంటిది. సంబంధిత భూమికి ప్లాన్ అప్రూవల్ రాకుండానే నిర్మాణం చేపట్టినట్లు మంత్రి కొండపల్లి పేర్కొన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ప్రత్యేక నివేదిక అందజేస్తున్నామని చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమని తేల్చి చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో మెడికల్ కాలేజీ, మహారాజా కాలేజీలలో పేద విద్యార్థులకు తక్కువ ఫీజులకే విద్యను అందించడం, పిడబ్ల్యూడి మార్కెట్, రైతు బజారులలో అతి తక్కువ ధరలకు షాపులు అద్దెకి ఇచ్చిన ఘనత అశోక్‌కి దక్కుతుందన్నారు. ఎంతో చరిత్ర, మంచి వ్యక్తిత్వం కలిగిన ఉత్తరాంధ్ర ఐకాన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మంత్రిగా, ఎంపీగా, కేంద్ర రాష్ట్ర మంత్రులుగా పని చేసిన ప్రస్తుత గోవా గవర్నర్ అశోక్‌ని బాధపెట్టడం విచారకర >>2



## 3 రోజులు వర్షాలు

**విజయవాడ, జులై2,ప్రభాతవార్తప్రతినిధి:** వాయువ్య బంగాళాఖాతం, ఒడిశాపశ్చిమ బెంగాల్ తీరప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. రాబోయే రెండు, మూడు రోజుల్లో అల్పపీడనం మరింత బలపడే అవకాశం ఉందన్నారు దీని ప్రభావంతో రానున్న మూడు రోజులు ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంటుందన్నారు,పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగులు పడే అవకాశం తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు విచ్చే అవకాశం ఎక్కువ అన్నారు ఆ దృష్ట్యా ముందస్తు జాగ్రత్తగా మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్ళరాదు తెలిపారు. శుక్రవారం శ్రీకాకుళం, పోలవరం, కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గాలులకు విద్యుత్ వైర్లు తెగిపడే ప్రమాదం ఉంది.. జాగ్రత్తగా గమనిస్తూ దూరంగా ఉండాలిలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ హెచ్చరించారు.


గురువారం మేకవానిపాలెంలో విబి జీ రామ్ జీ కార్యక్రమంలో కూలీలతో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

## జనవరికి బందరు పోర్టు పూర్తి

### పోర్టు ఆధారిత పరిశ్రమలు కూడా ఏర్పాటు

### ఇప్పటిదాకా రూ. 65 వేల కోట్ల పెన్షన్లు ఇచ్చాం: మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,జులై2,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు పెంచడంతోనే అభివృద్ధి సాధ్యమనిమేకవానిపాలెంలో విబి జీ రామ్ జీ కార్యక్రమం ప్రారంభోత్సవంలో మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గత ఐదు సంవత్సరాలు ఉపాధి హామీ పథకాన్ని కూడా తాకట్టు పెట్టారన్నారు. ఉపాధి హామీలో 32 కార్యక్రమాలను చేర్చిన ఘనత చంద్రబాబు నాయుడు గారిదే అన్నారు. >>2

## కారు బోల్తా: ఇద్దరు మహిళల మృతి

**విశాఖపట్నం, జులై 2 ప్రభాతవార్త:** వివాహ వేడుక నుంచి తిరిగివస్తుండగా విషాదం చోటుచేసుకుంది. అప్పటివరకు బంధువులతో సరదాగా గడిపిన కుటుంబంలో ఊహించని సంఘటన చోటుచేసుకుంది. వివాహ వేడుకకు హాజరైకుటుంబం అనకాపల్లినుంచి విశాఖకు వస్తుండగా కూర్మన్నపాలెం సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కనవున్న గోతిలోపడిపోయింది. ఈ ప్రమాదంలో మంగ (18) అక్కడికక్కడే మృతిచెందగా, కుసుమ (46) ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. విజయలక్ష్మి ్మ (56),తాన్వీ (7), డ్రైవర్ బాల మురళీ కృష్ణకు గాయాలు కావడంతో సమీపఆస్పత్రికి తరలించారు.



గురువారం తిరుమల ఆలయంలో ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న డిసిఎం పవన్

## శ్రీవారిని దర్శించుకున్న డిసిఎం పవన్

**తిరుమల,జూలై 2ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అంతా శుభాలు కలగాలని, ఈ రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందాలని వేడుకున్నట్లు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. ఆలయంలోపల ఎస్వీ ఆపన్న హృదయ పథకానికి లక్ష రూపాయలు విరాళం అందజేశారు. ఇప్పటికే తదేక దీక్షలో ఉన్న పవన్ గురువారం మధ్యాహ్నం తిరుపతి జిల్లా రైల్వేకోడూరు ఓబులవారిపల్లిలో అధికారిక కార్యక్రమం ముగిసిన అనంతరం నేరుగా తిరుమలకు వచ్చారు. సాయంత్రం ఆయన ప్రత్యేక సమయంలో ఆలయంలోనికి చేరుకున్నారు. తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలోనికి చేరుకుని ఏడుకొండల స్వామిని దర్శించుకున్నారు.కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేసి స్వామి వారి చిత్రపటంతోపాటు తీర్థప్రసాదాలు అందజేశారు.

## బందరు పోర్టు పూర్తి

>> జనవరి నాటికి బందరు పోర్టును పూర్తి చేయబోతున్నాం. పోర్టు ఆధారిత పరిశ్రమలు కూడా ఏర్పాటవుతున్నాయి. పోర్టు, మంగినపూడి బీచ్ అభివృద్ధికి ఎలాంటి విఘ్నాలు కలగకూడదనే ఉద్దేశ్యంతో 63 అడుగుల మహాగణపతిని బందరు బీచ్‌లో ఏర్పాటు చేయబోతున్నాం. రేపు ఉదయం 7.11కి భూమి పూజ చేస్తున్నాం. తద్వారా ఈ ప్రాంతం మొత్తం అభివృద్ధి చెందుతుందని బలంగా విశ్వసిస్తున్నాం. హామీ మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు మంజూరుచేస్తున్నాం. కూటమి అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు రూ.65 వేల కోట్లు పెన్షన్ల రూపంలో అందించాం. చదువుకునే ప్రతి బిడ్డకీ తల్లికి వందనం అమలు చేస్తున్నాం. ప్రభుత్వ స్కూళ్లలో మెరుగైన వసతులు కల్పిస్తున్నాం. అన్ని సదుపాయాలు ఉచితంగా అందిస్తున్నాం. జులై 15 నాటికి తల్లికివందనం నగదు జమచేయబోతున్నాం. అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నాం. ఉచిత గ్యాస్ పథకంలో ఇప్పటి వరకు సుమారు నాలుగున్నర కోట్లకు పైగా గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించాం. ఉచిత బస్సు పథకాన్ని పక్కాగా అమలు చేశాం. మన పిల్లలకు మన ప్రాంతంలోనే ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోంది. ప్రజలకు మంచి చేయాలి, మంచి పాలన అందించేందుకు కష్టబడి పని చేస్తున్నాం. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా కులం,మతం, ప్రాంతం పేరుతో కుట్రలు చేస్తున్నాడు. 2019 ఎన్నికలకు ముందు అమరావతే రాజధాని అన్న వ్యక్తి.. గెలిచాక మూడు రాజధానుల పేరుతో రైతుల్ని ముప్పుతిప్పలు పెట్టాడు. ఇప్పుడు మావిగన్ అంటూ సరికొత్త డ్రామాకు తెరలేపాడు. అమరావతి వెళ్లి రైతులతో రాజకీయం చేయాలని ప్రయత్నిస్తే.. ప్రజలు తరిమి తరిమి కొట్టారు. బందరు నుండి కూడా ఒక సైకో వెళ్లాడు. ప్రజలు తరిమితే తేలుకుట్టిన దొంగలా పారిపోయి వచ్చాడు. జగన్ రెడ్డి లాంటి సైకో రాష్ట్రానికి అవసరమా? జగన్ రెడ్డి వైఖరితో రాష్ట్ర అభివృద్ధి పాతికేళ్లు వెనక్కి వెళ్లిపోయింది. ఒక్క పరిశ్రమ రాలేదు. ఒక్క ఉద్యోగం కల్పించలేదు. తప్పుల్ని ప్రశ్నిస్తే దాడులు, తప్పుడుకేసులు, అరాచకాలతో వేధించాడు. నన్నుకూడా తప్పుడు కేసులో అరెస్టుచేసి జైల్లో పెట్టాడు. ఇప్పుడుకూడా అదే వైఖరి అవలంబిస్తున్నాడు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మూడు నాలుగు దఫాలు అధికారంలో ఉంటే దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తుంది అన్నారు.

## వరద ముంపులో ముంబయి

>> పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. పన్వెల్, ఉరాన్, పాల్ఘర్, రాయ్‌గఢ్ ప్రాంతాల్లో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేయడంతో జిల్లా కలెక్టర్ అన్ని పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. పరిస్థితులను బట్టి స్థానిక అధికారులు మరిన్ని విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించాలని ప్రభుత్వం సూచించింది. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు సూచించారు. ముంబైలో వచ్చే 24 గంటలపాటు భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. తాజాగా ముంబైలో భారీ వర్షం కారణంగా ఒక వ్యక్తి మ్యాన్‌హోల్‌లో పడి కొట్టుకుపోయాడు.

ఈ ఘటన గురువారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ముంబైలోని చండివలి ఏరియాలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చండివలి, సన్మాన్ హోటల్ సమీపంలోని ఖైరాని రోడ్డులో మెయింటెనెన్స్ వర్క్ జరుగు తోంది. ఈ క్రమంలో అక్కడ అస్లాం ఇసాక్ షేక్ (60) అనే వృద్ధుడు ఫోన్‌లో నడుచుకుంటూ వెళ్తుండగా, ప్రమాదవశాత్తు మ్యాన్‌హోల్‌లో పడిపోయాడు. దీంతో అతడు ఆ మ్యాన్‌హోల్‌లో పడి కొట్టుకుపోయాడు.

## తిరుమలేశుని తిరుప్పావడసేవలో మంత్రి లోకేష్

**తిరుమల,జూలై 2ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లోనూ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రార్థించినట్లు టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్,రాష్ట్ర ఐటి,విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ తెలిపారు. ఇందుకు ఇష్టదైవమ్ శ్రీవారి ఆశీస్సులు కోరినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. రెండురోజుల తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా గురువారం ఉదయం వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్ మార్గంలో ఆలయంలోనికి చేరుకున్నారు. వైకుంఠమ్ 1 వద్ద టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, డిప్యూటీ ఇఒ భాస్కర్ స్వాగతం పలికారు. ఆలయంలోపల తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలో దేవదేవునికి నిర్వహించిన తిరుప్పావడసేవలో మంత్రి లోకేశ్, టిడిపి ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. దేవుని ఆశీస్సులందుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు.

## వైకాపా అక్రమాలు సహించం

>> మన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మావిగన్ వర్సెస్ అమరావతి అనే నినాదంతో ఎన్నికలకు వెళతానని అంటున్నారు దానిపై మీ సమాధానమేమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ని అడగగా మావిగన్ అంటే 2014లో ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో మచిలీపట్నం, గుంటూరు, విజయవాడ ప్రాంతాలను కలుపుతూనే అమరావతిని రాజధానిగా ప్రకటించడం జరిగిందని, ప్రస్తుతం అభివృద్ధి పథంలో దూసుకుపోవటంతో మనసు మార్చుకున్న జగన్ మూడు రాజులదానుల మాటను వదిలి మరల ఈ నినాదాన్ని తీసుకువచ్చి ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అమరావతి ఎన్నికలకు వెళ్ళబట్టే వైసీపీకి 11 సీట్లు పరిమితమయ్యాయని, కూటమి ప్రభుత్వం క్లీన్ స్వీప్ చేయడం జరుగుతుందన్నారు. అధికారం ఉంటే ఒకలా అధికారం పోతే ఒకలా నిలకడ లేని మనస్తత్వంతో జగన్ మతిభ్రమించి మాట్లాడతారన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షులు డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర మంత్రివర్యులుగా చేసిన అశోక్ గజపతి రాజు వంటి హోదా కలిగిన వ్యక్తి భూమినే మార్చేసారంటే, రాష్ట్రంలో పాలనను ఏ విధంగా పక్కదోవ పట్టించారో అర్థమవుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయం నిర్మాణం కోసం నాలుగు స్థలాలను చూయించి ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నామని, ప్రభుత్వం నగరానికి దూరమైన స్థలాన్ని మంజూరు చేసినప్పటికీ, కార్యకర్తలకు దూరమైనప్పటికీ, అధికారంలో ఉన్ననూ ప్రభుత్వ అనుమతులు ప్రకారమే అక్కడే నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు.

# పలుగు పట్టి పారెత్తి.. కరవు పనిలో చంద్రబాబు, పవన్

**ఓబులవారిపల్లి(తిరుపతి),జులై 2ప్రభాతవార్తప్రతినిధి:** దేశ గ్రామీణ అభివృద్ధి చరిత్రలో ఆంధ్రప్రదేశ్ వేదికగా ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన, జీవనోపాధిని మెరుగుపరిచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా డిజైన్ చేసిన "వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అజీవికా మిషన్" దేశవ్యాప్తంగా నేటి నుంచి అధికారికంగా ప్రారంభమైంది. తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం ముక్కావారిపల్లి గ్రామంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ కలిసి ఈ మహత్తర కార్యక్రమానికి శీకారం చుట్టారు. ఈ సందర్భంగా అక్కడ సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్ కళ్యాణ్ స్వయంగా క్షేత్రస్థాయిలోకి వెళ్లి, పలుగు పట్టి పారెత్తి కరువు పనిలో పాల్గొని ఉపాధి కూలీల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి నిల్వలను పెంచేందుకు ఉద్దేశించిన మ్యాజిక్ డ్రైన్ల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామీణ స్వచ్ఛతను పెంపొందించేందుకు సిద్ధం చేసిన స్వచ్ఛరథాలను సిఎం చంద్రబాబు, కేంద్రమంత్రి, డిప్యూటీ సిఎం నిశితంగా పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.జాబ్ కార్డులు, బుక్‌లెట్ల ఆవిష్కరణ కార్యక్రమంలో లబ్ధిదారులకు కొత్తగా రూపొందించిన విబిజి రామ్ జీ జాబ్ కార్డులను పంపిణీ చేశారు. ఈ పథకానికి సంబంధించిన ప్రత్యేక ప్రోత్సాహక గీతాన్ని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్ ఆవిష్కరించారు.

## రిటైర్మెంట్ పెంపు జీవో జారీ

>> ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే 60 యేళ్లకు పదవీ విరమణ పొంది తిరిగి విధుల్లో చేరేందుకు ఆసక్తి లేని ఉద్యోగులకు పాత నిబంధనల ప్రకారమే రిటైర్మెంట్ వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిర్ణయాన్ని అమలు చేసేందుకు సర్వీస్ రూల్స్‌లో అవసరమైన సవరణలు చేయాలని సంస్థలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే ప్రతి సంస్థ తమ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని సూచించింది. అన్ని శాఖలు తమ పరిధిలోని పిఎస్‌యూలు, కార్పొరేషన్లు, సొసైటీలకు వెంటనే ఉత్తర్వులను పంపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.



గురువారం తిరుమల ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న మంత్రి లోకేష్

## ఎఐ, రక్షణలో ద్వైపాక్షిక బంధం

>> సనయే తకైచి మధ్య జరిగిన వార్షిక శిఖరాగ్ర స్థాయి చర్చల సందర్భంగా పలు ఒప్పందాలు కుదిరాయి. చర్చల అనంతరం జరిగిన సంయుక్త విలేకరుల సమావేశంలో ప్రధాని మోడీ మాట్లాడుతూ, ఈ భాగస్వామ్యానికి పరస్పర విశ్వాసమే అతిపెద్ద ఆస్తి అని పేర్కొన్న ప్రధాని మోడీ, స్వేచ్ఛాయుత, ఇండో పసిఫిక్ ప్రాంతం ఉమ్మడి ప్రాధాన్యతగా కొనసాగుతుందని ఉద్ఘాటించారు. అలాగే, ఎఐపై కొత్త ఉమ్మడి ప్రకటన, చారిత్రాత్మక సైనిక సహఅభివృద్ధి ప్రాజెక్ట్ భవిష్యత్తు ద్వైపాక్షిక సహకారానికి కీలక స్తంభాలుగా నిలుస్తాయని ఆయన తెలిపారు. ప్రస్తుత కాలంలో పరస్పర విశ్వాసం అత్యంత విలువైన ఆస్తి అని, భారత్– జపాన్ ద్వైపాక్షిక భాగస్వామ్యం కాల పరీక్షకు నిలిచిందని అన్నారు. నేడు భారత్ – జపాన్ ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఉన్నాయని, స్వేచ్ఛాయుత, బహిరంగ ఇండోపసిఫిక్ ప్రాంతం రెండు దేశాలకు ఉమ్మడి ప్రాధాన్యత అని ఆయన పేర్కొన్నారు. ఆర్థిక భద్రత, ఇంధన భద్రత ప్రాముఖ్యతను రెండు దేశాలు అర్థం చేసుకున్నాయని ఆయన నొక్కి చెప్పారు. భారత్– జపాన్ సహకారంలో సాంకేతిక భాగస్వామ్యం అత్యంత ముఖ్యమైన స్తంభంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాకారం చేసేందుకు, భారత్ – జపాన్ ఎఐ రంగంలో ఒక ఉమ్మడి ప్రకటనను విడుదల చేశాయని మోడీ చెప్పారు. జపాన్ ఖచ్చితమైన సాంకేతికత, భారతదేశ సాఫ్ట్‌వేర్ సామర్థ్యాల కలయిక ప్రపంచ ఎఐ అభివృద్ధికి కొత్త ఊపును. బలాన్ని ఇస్తుందని ప్రధాని పేర్కొన్నారు. రక్షణ రంగంలో భారత్– జపాన్ మధ్య మొదటి సహఅభివృద్ధి ప్రాజెక్టుకు సంబంధించిన ఒప్పందంపై రెండు దేశాలు సంతకాలు చేశాయని ఆయన తెలిపారు.

**'అన్నాచెల్లెళ్లుగా' సంబంధాలను మరింత బలోపేతం: తకైచి**

పెరుగుతున్న ప్రపంచ అనిశ్చితి నేపథ్యంలో లోతైన ద్వైపాక్షిక సహకారం అవసరాన్ని ఎంతైనా ఉంది. ఉమ్మడి శ్రేయస్సును సాధించడానికి జపాన్, భారత్ తమ తమ బలాలను ఉపయోగించుకోవాలని జపాన్ ప్రధాని సనాయ్ తకైచి అన్నారు. సంయుక్త విలేకరుల సమావేశంలో జపాన్ ప్రధాని మాట్లాడుతూ, లభించిన ఆత్మీయ ఆతిథ్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, ప్రధాని మోడీ తనను "అందమైన చెల్లెలు" అని ఆప్యాయంగా సంబోధించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. రెండుదేశాల దృక్పథాలు ఒకేలా ఉన్నాయని, "అన్నాచెల్లెళ్లుగా" సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి కట్టుబడి ఉన్నాయని ఆమె అన్నారు. "జపాన్, భారత్ కలిసికట్టుగా మరింతబలంగా, సుసంపన్నంగా మారడానికి మన బలాలను ఉపయోగించుకోవాలి. అంతర్జాతీయ వ్యవహారాలు అస్తవ్యస్తంగా ఉన్న ఈ తరుణంలో, ఇటువంటి పరస్పర పూరక సహకార సంబంధాన్ని నెలకొల్పడం మరింత ముఖ్యమైంది" అని తకైచి పేర్కొన్నారు. భారత్–జపాన్ ప్రత్యేక వ్యూహాత్మక ప్రపంచ భాగస్వామ్యం కింద, వ్యూహాత్మక దిశను పంచుకునే విశ్వసనీయ భాగస్వాములుగా, నా పెద్దన్నయ్య అయిన ప్రధాని మోడీతో కలిసి, భారత్–జపాన్ సంబంధాలు ఒక కొత్త దశలోకి ముందుకు సాగుతున్నాయని నమ్ముతున్నాను. వచ్చేసారి జపాన్‌లో ప్రధాని మోడీకి స్వాగతం పలకడానికి నేను ఎదురు చూస్తున్నా" అని తకైచి చెప్పారు. అంతకుముందు, రాష్ట్రపతి భవన్ ప్రాంగణంలో ప్రధాని తకైచికి ఘన స్వాగతం లభించింది. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ కూడా పాల్గొన్నారు. జపాన్ ప్రధానమంత్రి మూడురోజుల భారత పర్యటన నిమిత్తం బుధవారం సాయంత్రం న్యూఢిల్లీకి చేరుకున్నారు. ప్రధానమంత్రి తకైచి భారతదేశంలో చేస్తున్న మొదటి అధికారిక పర్యటన ఇది. భారత్, జపాన్‌ల మధ్య ఉన్న ప్రత్యేక వ్యూహాత్మక, ప్రపంచ భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఈ పర్యటన ఒక ముఖ్యమైన ముందడుగు

## శ్రీసిటీ ఇంటర్నేషనల్ వర్సిటీ ప్రారంభం

>> సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ మన యువతకు అపారమైన సామర్థం, ఆశయాలు ఉన్నాయని, వారికి అవసరమైనదల్లా ఉపాధి అవకాశాలతో నేరుగా అనుసంధానమైన విద్యావిధానం అన్నారు. ఈ కీలక సవాలుకు పరిష్కారం చూపే ప్రయత్నంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉండటం గర్వకారణంగా ఉందన్నారు. ఎస్ఐయూ అమలు చేస్తున్న వర్క్‌స్టడీ డ్యూయల్ మోడల్‌కు శ్రీసిటీలోని బలమైన పారిశ్రామిక ఎకోసిస్టమ్ కీలకంగా నిలుస్తోందన్నారు. 31 దేశాలకు చెందిన 250కుపైగా కంపెనీలు వివిధ రంగాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నాయి. పరిశ్రమ, విద్యావ్యవస్థలను ఇంత సమగ్రంగా అనుసంధానించిన కేంద్రాలు దేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగాకూడా చాలా అరుదు అని వ్యాఖ్యానించారు. ఎస్ఐయూలో విద్యార్థులు తాము విద్యను అభ్యసించే క్యాంపస్‌కు సమీపంలోనే ప్రముఖ అంతర్జాతీయ కంపెనీలతో కలిసి నేర్చుకునే, పనిచేసే అవకాశాన్ని పొందనున్నారని పేర్కొన్నారు. నాలుగేళ్ల డిగ్రీ చదివిన విద్యార్థి, మొదటి సంవత్సరం నుండే వేతనంతో కూడిన ఇంటర్న్‌షిప్‌ల ద్వారా సంపాదించిన 2 సంవత్సరాలకు పైగా నిజమైన పరిశ్రమ అనుభవాన్ని సంపాదించిందన్నారు.

## జగన్నాథ రథచక్రాల్లో నలిగిపోతారు..

>> రైల్వే కోడూరు నియోజకవర్గ ప్రజలకు తీపి కబుర్లు చెప్పారు. 156 కోట్లతో ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు, అండర్ డ్రైనేజీ కాలువల నిర్మాణానికి రూ. 8 కోట్లు, పిల్లలకు పాఠశాల భవన నిర్మాణాలకు రూ. 10 కోట్లు విడుదల చేసినట్లు, అలాగే కోడూరు వెంకటగిరి రోడ్డు 22 కిలోమీటర్లు ఫారెస్ట్ క్లియరెన్స్ ఇచ్చి త్వరితగతిన పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

విబి జీ రామ్ జీ పథకం రైల్వే కోడూరు నియోజకవర్గం నుంచి ప్రారంభమై దేశవ్యాప్తంగా అమల్లోకి రావటం చారిత్రాత్మకం. గతంలో నరేగా రాయలసీమ ప్రాంతం నుంచే ప్రారంభమైంది. ఇప్పుడు కూడా విబి జీ రామ్ జీ పథకం ఇక్కడి నుంచే ఆవిష్కృతం అయ్యింది. 13,226 గ్రామాల్లో ఒకే మారు గ్రామసభలు పెట్టి గిన్నిస్ రికార్డు సృష్టించిన ఘనత డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ కే దక్కింది. 7వేల కిలోమీటర్ల మేర సిసి రోడ్లు, 40 వేల గోకులాలు, 15,500 నీటి తొట్టెలు, 1.07 లక్షల ఫార్మ్ పాండ్లు, 1,373 కిలోమీటర్ల మేర గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, 1.66 లక్షల ఎకరాల్లో పండ్ల తోటల సాగు జరిగింది. ఉపాధి హామీ పనుల నిమిత్తం 55.44 కోట్ల పని దినాలు కల్పించి,16,695 కోట్లు ఖర్చు చేశామన్నారు. లక్ష ఎకరాల్లో పండ్ల తోటలు అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పోలవరం ప్రాజెక్టును గోదావరి పుష్కరాల కంటే ముందే పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నిలబెట్టటంతో పాటు రైల్వే జోన్ సాధించామన్నారు. రాయలసీమను అన్ని రంగాల్లోనూ అగ్రస్థానంలో నిలుపుతామన్నారు.. మదనపల్లిలో హార్టికల్చర్ హబ్‌కు త్వరలోనే శంకుస్థాపన చేస్తామన్నారు. తిరుపతిలో బుల్లెట్ మోటార్ సైకిల్ తయారీ ప్లాంట్ వస్తోంది. ప్రజల మనిషి కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అడిగిన వెంటనే సమస్యల్ని పరిష్కరించారు. బంగారం గనులు ఉన్న జొన్నగిరి పేరును చారిత్రక పేరు స్వర్ణగిరిగా మార్చాం. నిస్వార్థంగా పనిచేసే కూటమి నేతలకు ప్రజలు సహకరించాలని కోరుతున్నాను అన్నారు.

# 'జీ రామ్‌జీ'తో అభివృద్ధి వెల్లువ

>> హాజరయ్యారు ఈ సందర్భంగా కేంద్రమంత్రి చౌహాన్ మాట్లాడుతూ విబి జీ రామ్ జీ పథకం ముక్కవారి పల్లి నుంచి దేశంలోనే ప్ర ప్రథమంగా తిరుపతి జిల్లా ముక్కావారిపల్లి నుండి లాంచనంగా ప్రారంభించడం ఎంతో శుభ పరిణామం అన్నారు . రాయలసీమను రతనాలసీమగా అభివృద్ధి చేస్తామని స్వర్ణగిరి ద్వారా స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. కేంద్రం నుంచి 7,700 కోట్ల రూపాయలు రాష్ట్రంలో మరో 4 వేల కోట్లరూపాయలు వ్యయంతో విబి జీ రామ్ జీ పథకం కింద పనులు చేపడతామన్నారు. ఈ పథకంతో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సారథ్యంలో గ్రామాల రూపు రేఖలు మారుతాయని, 125రోజులు పని దినాలతో గ్రామీణ అభివృద్ధికి కావాల్సిన ఏ పనైనా చేపట్టేందుకు విబి జీ రామ్ జీ పథకం కింద అవకాశం ఉంటుందన్నారు. రహదారులు, డ్రైనేజి, ఇంకుడు గుంతలు పంట పొలాల వద్దకు డొంక రోడ్లు వేర్వేరు ఆస్తుల కల్పనకు ఆస్కారం ఉండేలా ఈ పథకం ముఖ్య ఉద్దేశం అన్నారు .జియో టాకింగ్. బయోమెట్రిక్ లాంటి సాంకేతికతతో పూర్తి పారదర్శకంగా ఈ పథకం నిర్వహిస్తామన్నారు గతంలో ప్రభుత్వం లాగా జరగకుండా దొంగ బిల్లులకు ఆస్కారం లేకుండా పనులు జరుగుతాయని తెలిపారు. గాలేరు నగరి నుండి కోడూరుకు నీళ్లు తీసుకొచ్చేందుకు 2,500 కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నామన్నారు. జల ద్వారా భూగర్భ జలాలకు ప్రాధాన్యమిస్తామని రాష్ట్రాలు కూడా వ్యయం చేసేలా ఈ కార్యక్రమం చేపట్టడం భారం కాదని మాకు బాధ్యతని, 13,226 కిలోమీటర్లు మేరా సిసి రోడ్లు 40 వేల గోకులాలు 15500 నీటి తొట్టెలు.1.07 కిలోమీటర్ల మేర గిరిజన ప్రాంతాలలో రోడ్లు 1.66 లక్షల ఎకరాల్లో పండ్ల తోటలు అభివృద్ధి పనులు ఉపాధి హామీ పనులు నిమిత్తం 55.44 కోట్లు పని దినాలు కల్పించి రూ.16695 కోట్లు ఖర్చు శేషం ఈ ఏడాది పదివేల కిలోమీటర్లు గ్రావెల్ రోడ్లు 1500 కిలోమీటర్లు సిమెంట్ రోడ్లు 500 కిలోమీటర్లు ట్రైన్ డ్రైనేజీ లక్ష్ ఎకరాల్లో పండ్ల తోటలను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు ముఖ్యంగా పంట పొలాలకు వెళ్లే మెటల్ రోడ్డు కూడా విబి జీ రామ్ జీ పథకం కింద నిర్మిస్తామన్నారు. అంతేకాకుండా రైల్వే కోడూరు అంటే నాకు మరియు పవన్ కళ్యాణ్‌కు ఎంతో ఆప్యాయత ఉందని ప్రజలు మాపైన చూపిస్తున్న ప్రేమ అభిమానానికి రైల్వే కోడూరు అభివృద్ధి పథంలో నడిపిస్తామని రైల్వే కోడూరు బస్టాండుకు ఐదు కోట్లు డ్రైనేజీ కాలువలకు 10 కోట్ల రూపాయలు మంజూరు చేస్తామన్నారు. అనంతరం ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని భారత ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో దేశం అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతుందని విబి జీ రామ్ జీ పథకాన్ని మన మొక్క వారి పల్లి నుంచి ప్రారంభించడం దేశంలోనే ఎంతో గర్వించదగ్గ విషయమని అన్ని విధాల ప్రజా సంక్షేమానికి రైతులు సంక్షేమానికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ అవకాశాన్ని ప్రజలు అర్హులైన వారు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ ద్వారా ఎంతో అభివృద్ధి సాధించవచ్చునని మన ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు పల్లెలు పచ్చగా ఉండి అభివృద్ధి చెందితే రాష్ట్రం బాగుంటుందన్నారు ప్రత్యేకంగా రైల్వే కోడూరు అంటే మాకు ఎంతో అభిమానం అని రైల్వే కోడూరు అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తామన్నారు అనంతరం కూడా చైర్మన్ టిడిపి ఇన్చార్జి ముక్కారూపానంద రెడ్డి మాట్లాడుతూ అన్ని విధాల కోడూరు అభివృద్ధి చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు గత 20 సంవత్సరాలుగా లేని అభివృద్ధి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండు సంవత్సరాలలో రైల్వే కోడూరు రూపురేఖలు మారాయి అన్నారు మాకు రైల్వే కోడూరులో కొన్ని సమస్యలు ఉన్నాయని బస్టాండ్ మరియు డ్రైనేజ్ పండ్ల తోటలు రైతులకు ఉద్యానవనరైల్వే కోడూరు హబ్బుగా తీర్చిదిద్దాలని ఆయన కృతజ్ఞతలు తెలిపారు అనంతరం రైల్వే కోడూరు శాసనసభ్యులు మాట్లాడుతూ ఎపిఎమ్‌డిసి ద్వారా మా నియోజకవర్గానికి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని మంగంపేటలో ఇల్లు భూములు కోల్పోయిన వారికి ఆర్థిక భరోసా కల్పించి నియోజకవర్గ ప్రజలను అన్ని విధాల ఆర్థికంగా ఆదుకోవాలని అన్నారు మంత్రులు పెన్నసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ విబి జీ రామ్ జీ పథకం తిరుపతి నుంచి ప్రారంభించడం ఎంతో సంతోషకరమని దేశంలోనే ముక్క వారి పల్లి గ్రామాన్ని ఎంచుకోవడం ఎంతో శుభపరిణామన్నారు. ఈ పథకం ద్వారా అనేక పనులు చేపట్టి రైతు ఆర్థికంగా ఎదగవచ్చు అన్నారు మాజీ ప్రధానమంత్రి అటల్ బీహారీ వాజ్‌పేయి సేవల ప్రశంసనీయమన్నారు. కేంద్రం మరియు ఆంధ్ర సంయుక్తంగా అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుందన్నారు.

### వారం - వర్జ్యం

03-07-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆరుద్ర కార్తె
తదియ ఉ.11.18, శ్రవణ ఉ.11.44
వర్జ్యం : సా.4.04-సా.5.48
దు.ఉ.8.15-ఉ.9.07,
2) మ.12.37-మ.1.29
శుభసమయం : ఉ.10.00-11.00
రాహుకాలం – ఉ.10.30-12.00

### వార్తాఫలం

**మేషం:** మీ ప్రమేయంలేకపోయినా తగాదాలలోనికి లాగటానికి మీ ఓర్పును రెచ్చగొట్టేవారు అధికమవుతారు.

**వృషభం:** సంతానంపట్ల సంతృప్తికలిగి వుంటారు, అనవసర విషయాలలో జోక్యం వద్దు. అన్నివిధాల శ్రేయస్కరం.

**మిథునం:** గృహసంబంధమైన ఖర్చులను తగ్గించే యత్నమును, ఆదాయమునకు అదనపు మార్గములను అన్వేషిస్తారు.

**కర్కాటకం:** బాధ్యతలు సక్రమంగా నిర్వ హించి పలువురి ప్రశంసలు పొందుతారు. ఇంటా బయటా అనుకూల వాతావరణం ఉంటుంది.

**సింహం:** అనుకోని అవకాశాలు లభిస్తాయి. దీర్ఘకాలిక సమస్యలుతీరి ఊరట చెందుతారు. ఇంటాబయటా అనుకూలం.

**కన్య :** క్రమశిక్షణకు ప్రాధాన్యతనిచ్చి, కష్టపడి, ప్రతిష్టాత్మకమైన మంచిఫలితాలను సాధిస్తారు. శుభవార్తలు వింటారు.

**తుల :** ముఖ్యమైన విషయాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. తండ్రి ద్వారా ఆస్తిలాభం పొందుతారు.

**వృశ్చికం:** ఉద్యోగస్తులకు కార్యాలయంలో అనుకూల వాతావరణం ఉంటుంది. తనఖా వస్తువులను విడిపిస్తారు.

**ధనుస్సు:** కీలక నిర్ణయాలలో జీవితభాగస్వామి సలహాలు తీసుకుంటారు. వ్యాపారాలు అభివృద్ధిచెందుతాయి.

**మకరం:** ఆర్థికవ్యవహారాలలో జీవిత భాగస్వామి తోడ్పాటు మీకు వెసులుబాటు కలిగిస్తుంది.ఆస్తి వివాదాలు తీరుతాయి.

**కుంభం:** స్థిరాస్తివివాదాలనుండి బయట పడతారు. అప్రయత్నంగా పనులు పూర్తి చేస్తారు. ఆభరణాలు కొనుగోలుచేస్తారు.

**మీనం:** నూతనవ్యక్తులతో పరిచయాలు పెంచుకొని మిత్రబృందాలను పెంచు కుంటారు. ఇంటిలో శుభకార్యాలు జరుగుతాయి.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## ఆర్థిక మేధస్సుతో స్వర్ణాంధ్రవైపు అడుగులు

### -సిఎం చంద్రబాబు నాయుడు

**తిరుపతి,జులై 2ప్రభాతవార్తప్రతినిధి:** పరిపాలనలో ఆర్థిక మేధస్సుతో స్వర్ణాంధ్ర 2047 దిశగా అడుగులు వేస్తున్నామని, ప్రభుత్వ నిర్ణయాలు సంక్షేమ పథకాలు మరింత పారదర్శకంగా పాలన అందించడం వంటివి ప్రధామని రాష్ట్రముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు తెలిపారు. వీటన్నిటినీ సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు కృత్రిమ మేధస్సు(ఎఐ) రియల్‌టైమ్ డేటాను ఉపయోగించడం ద్వారా అనుకున్న లక్ష్యాలను చేరుకోగలమన్నారు. స్వర్ణ ఆంధ్ర 2047 విజన్ సాధనలో ప్రభుత్వ యంత్రాంగాన్ని అన్ని రకాలుగా సిద్దం చేసేందుకు రెండురోజుల సదస్సు గురువారం సాయంత్రం తిరుపతిలోని ఓ హోటల్‌లో ప్రారంభమైంది. తొలిరోజు సదస్సుకు స్టాటస్టిక్స్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి సౌరభ్ గార్గ్, భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్, నీతి ఆయోగ్ సభ్యులు బాలసుబ్రహ్మణ్యం, ప్రొఫెసర్ కె.వి. రాజు, ప్రధాని ఆర్థిక సలహా మండలి సభ్యుడు ప్రొఫెసర్ ఎస్. మహేంద్ర దేవ్‌తో బాటు సిఎం చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. ప్రజల కోసం నిరంతరం పని చేసేందుకు సంతృప్తి పడి సరిపెట్టకుండా కొత్త విధానాలను అన్వేషిస్తూనే ఉండాలన్నారు. సాంకేతికతను వినియోగించుకోవాలని, ఈ రంగంలో సొంతంగా వ్యవస్థలను కూడా రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుని ఐక్యంగా పని చేస్తే అభివృద్ధి సాధించగలమని సిఎం ధీమా వ్యక్తం చేశారు. దేశం నాకేమిచ్చిందనే దానికంటే ఈ దేశానికి మనమేం చేశామనే రీతిలో ఆలోచించాలన్నారు. త్వరలోనే అమరావతిలో క్వాంటం కంప్యూటర్ అందుబాటులోకి వస్తుందని, క్వాంటం కంప్యూటర్లను తయారు చేసే సామర్థ్యాన్ని కూడా ఏపీ సాధించబోతోందని గర్వంగా తెలిపారు. స్వర్ణాంధ్ర 2047 ఎకనమిక్ ఇంటెలిజెన్స్ ఫర్ గవర్నెన్స్ పేరుతో కెపాసిటి బిల్డింగ్ పై నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సదస్సుకు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనేక అంశాలపై వివరించారు. ఏదేని సాధించాలని ఆశయం నిర్దేశించుకున్నపుడు తొలుతనే సంతృప్తి చెందితే స్టేటస్ కో ఇచ్చినట్టేనని, అందుకే తాను త్వరగా సంతృప్తి చెందనని అన్నారు.ఈ సందర్భంగా సదస్సులో సభికుల మధ్యనే కూర్చొని సిఎం చంద్రబాబు ప్యానల్ డిస్కషన్ ను ఆలకించారు. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న వివిధ కార్యక్రమాలను,అమలు చేస్తున్న అంశాలను ప్యానలిస్టులు ప్రస్తావించారు.

నియోజకవర్గాల వారీగా విజన్ ప్లాన్,పి4 గ్రామస్థాయి డేటా సేకరణ, పాలనలో ఎఐ అమలు వంటి అంశాలపై చంద్రబాబు చొరవను ప్రశంసించారు. నియోజకవర్గాల వారీ పి4 విజన్ ప్లాన్ వంటివి మిగిలిన ఏ రాష్ట్రాల్లోనూ లేవని,వీటిని జాతీయ స్థాయిలో అమలు చేయాల్సిన అవసరం ఉందని ప్యానల్ డిస్కషన్లో పాల్గొన్న ఆర్థిక నిపుణులు అభిప్రాయపడ్డారు.

ఒక నిర్దిష్ట అంశంపై ప్రముఖ రంగాల నిపుణుల సమక్షంలో నలుగురైదుగురు నిపుణులు కలసి చర్చించారు. పేదల స్థితిగతులు మార్చేందుకు ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు చేసే అంశాన్ని ఈ సదస్సులో సిఎం ప్రస్తావించారు. తాను స్వయంగా వెళ్లి పెన్షన్ పంపిణీ చేసిన తులశమ్మ, పద్మమ్మల జీవన స్థితిగుతులను సమావేశంలో చంద్రబాబు ప్రత్యేకంగా వివరించారు. ప్రభుత్వ పథకాలు, డ్వాక్రా రుణాల ద్వారా సదరు కుటుంబానికి జరిగిన మేలుపై వెల్లడించారు. తానూ ఆర్థికశాస్త్రం చదివానని.. దానికంటే సమాజం నుండి, ప్రజల నుండి ఎక్కువగా నేర్చుకున్నానని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ కీలక సదస్సుకు ఆర్థిక, పరిపాలన వ్యవహారాల్లో ప్రముఖ స్థానంలో ఉన్న నిపుణులు హాజరుకావడం సంతోషకరమన్నారు. దేశంలోనే తొలిసారి 2020 విజన్ రూపొందిస్తే నాడు నన్ను విమర్శించారని, దేశానికి కూడా విజన్ డాక్యుమెంట్ తయారు చేయాలని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం భావించారని గుర్తుచేశారు. ఐటీతో ప్రపంచం కుగ్రామంగా మారిందని, ఐటీతో అభివృద్ధి సాధించగలమని బలంగా నమ్మానన్నారు. సర్వీస్ సెక్టార్ రివ ల్యూషన్ ను అందిపుచ్చుకుంటే అభివృద్ధి జరుగుతుందని విశ్వసించిదానికి అనుగుణంగా పనిచేశామని తెలిపారు. డేటానే సంపదగా మారిన రోజుల్లోకి వచ్చామని,. డేటా ఆధారిత నిర్ణయాలకే భవిష్యత్ ఉంటుందని మరోసారి అనుభవాన్ని వెల్లడించారు. ప్రజలకు ప్రభుత్వం సేవలు అందించడం ఎంత ముఖ్యమో సంపద సృష్టికి ప్రైవేట్ రంగం నుంచి పెట్టుబడులు సాధించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. స్వర్ణాంధ్ర 2047విజన్ లో ప్రైవేట్ పెట్టుబడులు అనే అంశాన్ని చేర్చామని, అన్ని రంగాలకు సంబంధించిన డేటాను సేకరించడమే కాకుండా డేటా అనుసంధానం కూడా ముఖ్యంగా తీసుకున్నామన్నారు..

3-7Pg3fG_3-7Pg3fG.qxd 02/Jul/26 10:49 PM Page 1



# తిరుమల సమాచారం

## ప్రపంచంలో అగ్రగామి దేశంగా భారత్



**తిరుమల, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచంలోనే భారతదేశం అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా ముందుకు వెళ్ళాలని, అందుకు ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు కోరినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. భారత ప్రధానిగా నరేంద్రమోదీ 13 సంవత్సరాలు సిఎంగా, 12సంవత్సరాలు ప్రధానిగా ధర్మం, సేవానిరతితో పాలనసాగిస్తున్నారన్నారు. ఆయన ఆశయాలు, ఆయన నిరంతర కృషితోనే భారత్ అగ్రగామిదేశంగా నిలుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా తక్కువ వర్షాలు కురుస్తాయని ఆందోళన వ్యక్తమవుతోందని, జూన్‌లో రావాల్సిన వర్షాలు 40 నుంచి 50 శాతం మాత్రమే నమోదయ్యాయని పేర్కొన్నారు. మన దేశ అవసరాలు తీరాలంటే మంచి వర్షాలు పడాలని, అందుకే లోకకల్యాణం కోసం స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే ప్రతి నీటిచుక్కను వృథా కాకుండా కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. జులై నెలలో మంచి వర్షాలు కురవాలని, ప్రకృతి సహకరించాలని ప్రార్థిస్తున్నానని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆయన ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## తెలుగురాష్ట్రాల్లో మంచి వర్షాలు కురవాలి



**తిరుమల, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశం,రాష్ట్రంఅన్ని రంగాల్లో ముందుండాలని తిరుమల శ్రీవారిని ప్రార్థించినట్లు బిజెపి నేతలు బండారు దత్తాత్రేయ, మాధవ్ తెలిపారు. ధర్మానికి భారత దేశం పెట్టినిల్లుఅని, టిటిడి అనేక ధార్మిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. టిటిడిలో అన్యమతస్థులు ఉండరాదని హిందూ ధర్మంపై నమ్మకంతోనే పనిచేయాలన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సకాలంలో మంచి వర్షాలు కురావాలని, తాగుసాగునీటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని వేంకటేశ్వర స్వామిని వేడుకున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి అనుగ్రహంతోనే పద్మశ్రీ అవార్డు



**తిరుమల, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశ అత్యున్నత పౌర పురస్కారాల్లో ఒకటైన పద్మశ్రీ అవార్డు తనకు లభించడం వెనుక శ్రీవారి అనుగ్రహం మెండుగా ఉందని సినీనటుడు పద్మశ్రీ రాజేంద్రప్రసాద్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఇదీ పూర్తిగా అభిమానులు, శ్రేయోభిలాషులకే అంకితమని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డు రావడం పట్ల తాను ఎంతో ఆనందంగా, కృతజ్ఞతతో ఉన్నానని సవినయంగా తెలిపారు. ప్రతిసారి తిరుమల వచ్చినప్పుడు కలిగే ఆధ్యాత్మిక అనుభూతిని మాటల్లో వర్ణించలేనని, ఈసారి కూడా దర్శనం అత్యంత ప్రశాంతంగా జరిగిందని వివరించారు. ప్రస్తుతం తాను పలు విభిన్న చిత్రాల్లో బిజీగా నటిస్తున్నానని, త్వరలో ప్రేక్షకులను వినూత్నమైన కొత్త పాత్రల్లో అలరించడానికి సిద్ధంగా ఉన్నానని రాజేంద్రప్రసాద్ ఆనందంగా ప్రకటించారు. గురువారం ఉదయం తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్ విరామ సమయంలో స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదమంత్రోచ్ఛారణలతో వేదాశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు.

## త్వరలో రాజాధిరాజ చిత్రం విడుదల



**తిరుమల, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** తాను ఇప్పటికే అనేక చిత్రాలలో నటిస్తున్నానని, త్వరలోనే రాజాధిరాజ చిత్రం విడుదల కానుందని సినీనటుడు సాయికుమార్ తెలిపారు. రవితేజతో నటిస్తున్నానని, ఆగస్ట్‌లో ఇరుముడి చిత్రం విడుదల కానుందని చెప్పారు. యాభైసంవత్సరాల తెలుగుచిత్ర పరిశ్రమలో అనేక చిత్రాల్లో నటించానన్నారు. తన కుమారుడు ఆది చిత్రరంగానికి పరిచయమయ్యాడని, అతనిని కూడా ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. డైలాగ్ కింగ్ సాయికుమార్ గురువారం ఉదయం కుటుంబంతో కలిసి తిరుమల వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో ఆలయంలోనికి చేరుకున్నారు. తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. నిరంతరం సినిమా షూటింగులతో బిజీగా ఉండే సాయికుమార్ కాస్త సమయం తీసుకుని స్వామివారి ఆశీస్సులు అందుకోవడానికి తిరుమలకు విచ్చేశారు. ప్రేక్షకులను అలరించడానికి పలు చిత్రాలు రానున్నాయన్నారు.

## శ్రీవారిసేవలో పర్యవేక్షకుల పాత్ర కీలకం

**తిరుమల, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడి నిర్వహిస్తున్న శ్రీవారిసేవలో గ్రూప్ సూపర్వైజర్ల పాత్ర అత్యంత కీలకమని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 2000వ సంవత్సరంలో మొదటిసారిగా టిటిడి శ్రీవారిసేవ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ప్రస్తుతం శ్రీవారిసేవకులకు వారి ప్రాంతాల్లోనే శిక్షణ ఇచ్చేందుకు గ్రూప్ సూపర్వైజర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే తొలి బ్యాచ్‌లో 1,400 మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. రెండో విడుతలో 2,600 మందికి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రత్యేక శిక్షణకి ఐఐఎం అహ్మదాబాద్ వారి సహకారంతో శిక్షణ మెటీరియల్ రూపొందించడం జరిగింద న్నారు. ఇందులో ఆధ్యాత్మికతతో పాటు నిర్వహణ నైపుణ్యాలను నేర్చుకునేలా తీర్చిదిద్దినట్లు చెప్పారు. తిరుమలలోని సేవా సదన్2 లో గురువారం ఉదయం ప్రారంభమైన శ్రీవారిసేవ గ్రూప్ సూపర్వైజర్ల రెండో విడత శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు ఇఒ చౌదరి విచ్చేశారు. శ్రీవారి సేవకులు తమ పాత్రను అర్థం చేసుకుని బాధ్యత, సహనంతో భక్తులకు సేవలందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీవారిసేవా విభాగాధిపతి ,సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, శ్రీవారిసేవ శిక్షకులు డాక్టర్ ఎస్.ఎల్.ఎన్.టి శ్రీనివాస్, డాక్టర్ శరత్ కుమార్, పొలమడ రమేష్ బాబు, శ్రీవారిసేవ సిబ్బంది పాల్గొన్నారు.

# మీ ఆప్యాయత... అనుబంధం మరచిపోలేను

**● యువగళంలో వెంట నడిచిన వారిని మరిచిపోని మంత్రి లోకేష్**



**తిరుపతి, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో క్లిష్టసమయంలో గత ఎన్నికలకు ముందు చేపట్టిన యువగళం పాదయాత్రలో తనవెంట ఉండి నడచిన, చేదోడువాదోడుగా తనతో కలసి వచ్చిన యువకుల సేవలను మరచిపోలేనని రాష్ట్రమంత్రి నారా లోకేశ్ తన అనుభూతిని వ్యక్తం చేశారు. యువగళం పాదయాత్రలో ఆప్యాయంగా తన వెంట నడిచిన వారిని మర్చిపోని మంత్రి నారా లోకేష్ పాదయాత్ర బంధం శాశ్వతమని చాటిచెప్పారు. ఏ వేదికైనా, ఏ వేడుకైనా అక్కడ యువగళం పాదయాత్రలో పాల్గొన్నవారు కనిపిస్తే పేరు పెట్టి పలకరించి, ఆగి మాట్లాడి వెళ్లే లోకేష్ యువగళం బంధం.. తరగని అనుబంధం అని మరోసారి నిరూపించారు. గురువారం ఉదయం తిరుపతిలోని భూపాల్ హౌసింగ్‌లో జరిగిన కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి వివాహం సందర్భంగా కాబోయే నూతన దంపతులను ఆశీర్వదించేందుకు వధువు ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ యువగళం పాదయాత్రలో తనతోపాటు ఎండనక , వాననక నడిచిన టిడిపి సైనికులు కనిపించారు. మంత్రి అక్కడే ఆగి వారందరిని పేరుపేరునా పలకరించి వారితోపాటు సమానంగానే కూర్చున్నారు. దాదాపు 15 నిమిషాల పాటు వారితో మాట్లాడిన లోకేష్ యువగళం పాదయాత్ర నాటి సంగతులు గుర్తుకు తెచ్చుకున్నారు. నాటి వైసిపి ప్రభుత్వం అణచివేతను ఎదిరించి మరీ పాదయాత్రను ముందుకు తీసుకెళ్లడంలో ఒక సైన్యంలా పనిచేశారని ప్రశంసించారు. పాదయాత్రలో ఉద్యోగాల కల్పన అవసరాన్ని గుర్తించి ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల కల్పన హామీ నెరవేర్చేందుకు తీసుకువచ్చిన పెట్టుబడులు కల్పించిన ఉద్యోగాలను యువగళం దళానికి వివరించారు. జాబ్ క్యాలెండర్, టీచర్ పోస్టుల భర్తీ, కానిస్టేబుళ్ల నియామకాలు చేపట్టామని తెలిపారు. కార్యకర్తే అధినేత నినాదంతో టిడిపి కేడర్ సాధికారత సాధించేందుకు చేస్తున్న కృషిని తెలియజేశారు. సూర్య ప్రకాష్ ఎలా ఉన్నావు అంటూ యోగక్షేమాలు కనుక్కున్నారు. ఏమప్పా! వెంకటప్ప కుశలమేనా అని పలకరించారు. చంద్రా బాగున్నావా? అని ఆరా తీశారు. ఎల్లప్ప, లక్ష్మీ ‌ ‌ ‌మపతిలతో పాదయాత్ర జ్ఞాపకాలు పంచుకున్నారు. ఒక ఇంటి వాడు కాబోతున్న నాదెండ్ల బ్రహ్మం చౌదరికి శుభాకాంక్షలు తెలిపారు. కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. జస్వంత్, రవి నాయుడులతో మిగిలిన యువ బృందం గురించి అడిగి తెలుసుకున్నారు.

# పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సిఎండితో మంత్రి జనార్దన్ రెడ్డి భేటీ

**● మౌలిక సదుపాయాల అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి ● సానుకూలంగా స్పందించిన సిఎండి**



**విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** నంద్యాల జిల్లా బనగానపల్లె ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పనకు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద నిధులు విడుదల మంజూరు చేయాలని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సిఎండి వంశీరామమోహన్‌ను రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి కోరారు. హర్యానాలోని గురుగ్రామ్‌లో గల పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి, సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి)గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న తెలుగు వ్యక్తి బుర్రా వంశీ రామమోహన్‌తో ఆయన మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సిఎండిని శాలువాతో సత్కరించి, వినాయకుని ప్రతిమను ఆయనకు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సమావేశంలో బనగానపల్లె నియోజకవర్గ పరిధిలోని కొలిమిగుండ్ల మండలం నందిపాడు గ్రామంలో పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న హై ఓల్టేజ్ ట్రాన్స్‌మిషన్ లైన్స్ ప్రాజెక్టుపై చర్చించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం ప్రస్తుతం కొనసాగుతున్న నేపథ్యంలో బనగానపల్లె ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పనకు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద నిధులు విడుదల చేయాలని మంత్రి కోరారు. ముఖ్యంగా వర్షాకాలంలో జుర్రేరు వాగు వరద ప్రవాహం వల్ల స్థానిక నివాస ప్రాంతాలు, వ్యవసాయ పంట భూములు ముంపునకు గురవుతున్న విషయాన్ని మంత్రి సిఎండి దృష్టికి తీసుకెళ్లారు. జుర్రేరు వాగు సుందరీకరణ, వరద నివారణ కోసం రూ.4.95 కోట్లతో చేపట్టదలచిన రిటైనింగ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు రూ.2 కోట్ల విలువైన ఆధునిక వైద్య పరికరాలను సిఎస్ఆర్ నిధుల కింద సమకూర్చాలని కోరారు.

మంత్రి ప్రతిపాదనలపై పవర్ గ్రిడ్ సిఎండి బుర్రా వంశీరామమోహన్ సానుకూలంగా స్పందించారు. సిఎస్ఆర్ నిధుల ద్వారా బనగానపల్లె ప్రాంత అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కాగా, ఆంధ్రప్రదేశ్‌లో పవర్ గ్రిడ్ సంస్థ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం ఉంటుందని, కొత్త ప్రాజెక్టులతో ఏపిలో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఈ సందర్భంగా మంత్రి ఆహ్వానించారు.



## వైవాహిక జీవితం సుఖమయంగా సాగాలి

**● నూతన దంపతులను ఆశీర్వదించిన మంత్రి లోకేశ్**

**తిరుమల, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** వైవాహిక జీవితంలోకి అడుగుపెడుతున్న నూతన దంపతులు సుఖమయంగా ఉండాలని, అంతా మంచి జరగాలని రాష్ట్రమంత్రి నారాలోకేశ్ ఆశీర్వదించారు. తిరుమలలోని కర్నాటక భవన్‌లో గురువారం ఉదయం జరిగిన టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి కుమార్తె డాక్టర్ వైష్ణవి, డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డిల వివాహానికి మంతి హాజరయ్యారు. వివాహ మహోత్సవంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. నూతన దంపతులకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి వెంట భానుప్రకాశ్ రెడ్డి, కుమారుడు జి.పృధ్వీరెడ్డి ఉన్నారు. గురువారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్న అనంతరం లోకేశ్ కర్నాటక భవన్‌కు చేరుకున్నారు.



## నాదెండ్ల బ్రహ్మం చౌదరి దంపతులకు మంత్రి లోకేశ్ ఆశీస్సులు

తిరుమల,జులై 2ప్రభాతవార్తప్రతినిధి: తిరుపతి నగరంలోని భూపాల్ హౌసింగ్ లో గురువారం ఉదయం జరిగిన టిడిపి సామాజిక మాధ్యమం యాక్టివిస్ట్ కే.గౌతమి శ్వేత నివాసానికి రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ విచ్చేశారు.కాబోయే నూతన వధూవరులు రాష్ట్ర కమ్మ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి, గౌతమి శ్వేతలను మంత్రి లోకేష్ ఆశీర్వదించారు. ఇక్కడ మంత్రి లోకేష్ సమక్షంలో వధూవరులు ఉంగరాలు మార్చుకున్నారు. ఇదిలా ఉండగా గురువారం రాత్రి తిరుమలలోని శృంగేరీ శారద పీఠంలో నాదెండ్ల బ్రహ్మం చౌదరి, గౌతమి శ్వేతల వివాహం అత్యంత వేడుకగా జరిగింది. పలువురు ప్రముఖులు, టిడిపి ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

# ఎపికి మేనమామ నవుతా..!

**● మార్కెట్ ఇంటర్వెన్షన్ కింద తోతాపురి మామిడి కొనుగోళ్లకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ హామీ**



**ఓబులవారిపల్లి (తిరుపతి కలెక్టరేట్), జులై 2 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం ముక్కావారిపల్లి గ్రామంలో 4.55 లక్షల వ్యయంతో ప్రతిపాదించిన మూడు పనుల్ని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్‌కల్యాణ్ గరువారం ఉదయం లాంఛనంగా ప్రారంభించారు. సామాజిక వర్షపు నీటి సంరక్షణ కుంట, మ్యాజిక్ డ్రెయిన్, మొక్కల పెంపకం కార్యక్రమాలను వీబీ జీ రామ్ జీ మిషన్ కింద తొలుత చేపట్టారు. దేశంలోని గ్రామాలను అభివృద్ధి చేసేందుకే వీబీజీ రామ్ జీ కింద రూ.7.5 లక్షల కోట్లు వ్యయం చేయాలని నిర్ణయించామని అన్నారు. ఈ 9 నెలల కాలానికి ఈ పథకం కింద ఏపీకి కేంద్రం నుంచి రూ.7,700 కోట్లు విడుదల చేస్తామని అన్నారు. స్వయంగా గ్రామ సభలే పంచాయితీలో పనుల్ని నిర్దేశించుకుంటాయని తెలిపారు. తనను మధ్యప్రదేశ్ లో అంతా మామాజీ అని పిలుస్తారని.. ఇప్పుడు ఏపీకి కూడా తాను మేనమామ అయ్యానని మంత్రి వ్యాఖ్యానించారు. ఏ మేనమామ ఖాళీ చేతులతో రాడని, ఏపీకి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 74,212 పక్కా ఇళ్లు, గ్రామీణ ప్రాంతాలను అనుసంధానించే రోడ్ల నిర్మాణానికి రూ.422 కోట్ల నిధులు ఇవ్వనున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించిన పత్రాలను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎంలకు ఆయన అందజేశారు. అలాగే 2,16,250 మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడిని మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద కేంద్రం కొనుగోలు చేస్తుందని ఆయన ప్రకటించారు. దీనికి సంబంధించిన పత్రాలను కూడా సీఎం చంద్రబాబుకు ఆయన అందజేశారు. ఎపికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఎక్కడా చేయి విడిచి పెట్టేది లేదని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ తమ పుట్టిన రోజున కనీసం ఒక మొక్క నాటేలా సంకల్పం తీసుకోవాలని మంత్రి పిలుపు ఇచ్చారు.

# గ్రామీణ పేదలకు విబి జిరామ్‌జితో ఉపాధి భరోసా

**● కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వెల్లడి**




**కొడవలూరు (నెల్లూరు), జులై 2 ప్రభాతవార్త:** గ్రామీణ పేద కుటుంబాలకు స్థిరమైన ఉపాధి, ఆదాయ భద్రత కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్-గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆ జీవిక మిషన్-గ్రామీణ్ (వీబీ- జీ రామ్- జీ) పథకం గ్రామీణ జీవనోపాధికి వరంగా నిలుస్తుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. గురువారం కొడవలూరు మండలం రామన్నపాళెం పంచాయతీలో నిర్వహించిన పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వీబీ- జీ రామ్- జీ పథకంతో జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్లో ప్రారంభం కావడం రాష్ట్రానికి గౌరవకరమని తెలిపారు. గ్రామాల్లో ఉపాధి అవకాశాల పెంపు, పేద కుటుంబాలకు జీవనోపాధి భద్రత, మౌలిక సదుపాయాల అభివృద్ధి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని వివరించారు. వ్యవసాయ పనులకు అంతరాయం కలగకుండా పంట నాట్లు, కోతల సమయంలో 60 రోజుల పని విరామం కల్పిస్తూ, గ్రామీణ పేదలకు ఏడాదికి 125 రోజుల ఉపాధి కల్పించేలా పథకాన్ని రూపొందించినట్లు తెలిపారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత రెండేళ్లలో కేంద్రం నుంచి రూ.14 లక్షల కోట్ల విలువైన నిధులు లభించాయని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కొడవలూరు మండల అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, ఎంపీడీవో వెంకట సుబ్బారావు, ఏపీడీఓ మృదుల, ఈసీ సోఫియా సుల్తాన్, టెక్నికల్ అసిస్టెంట్ సుప్రజ, సొసైటీ చైర్మన్ బద్వేల్ వినీల్ రెడ్డి, దేగ దయాకర్ రెడ్డి, కాకి సీనయ్యతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శ్రీనివాస్ రాజీనామాకు ప్రభుత్వం ఆమోదం

**విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎజిఐసిఎల్) చైర్మన్ ఎస్‌విఆర్ శ్రీనివాస్ పదిరోజుల క్రితం రాజీనామా సమర్పించారు. ప్రభుత్వం ఈ రాజీనామాను ఆమోదించింది. బుధవారం నుంచే ఆయన ఉద్యోగ బాధ్యతల్లో లేరనే విషయాన్ని స్పష్టంచేస్తూ గురువారం నోట్‌లో తెలిపింది.. సిఆర్‌డిఏ ఏర్పాటైన తరువాత ఉన్నతస్థాయిలో ఉన్న వ్యక్తి రాజీనామా సమర్పించడం ఇదే తొలిసారి. తల్లి ఆరోగ్యం బాగోలేదని అందువల్లే తాను రాజీనామా సమర్పిస్తున్నానని లేఖలో పేర్కొన్నారు. కార్యాలయ నిర్వహణ, సిబ్బంది లేకపోవడం, నియామకానికి వీలుగా చర్యలు తీసుకోకపోవడంతో రాజీనామా సమర్పించినట్లు సమాచారం. రాజధానిలో కీలకమైన రివర్ ఫ్రంట్, ఎన్‌టిఆర్ విగ్రహం ఏర్పాటు, ఎయిర్‌పోర్టు, ఇన్నర్ రింగురోడ్డు, స్మార్ట్ ఇండస్ట్రీలు, రోప్‌వే, ఐకానిక్ బ్రిడ్జి వంటి పనులతో పాటు భవిష్యత్‌లో చేపట్టే పనులనూ ఎజిఐసిఎల్‌కు అప్పగించారు. అయితే పనుల పర్యవేక్షణ, నిర్వహణ అంశాల్లో తొలి నుండి ఉత్సాహంగానే వ్యవహరించిన శ్రీనివాస్ సమీక్షల సమయంలో అతని పట్ల వ్యవహరించిన తీరు, ప్రతి విషయానికి కమిషనర్‌ను సంప్రదించాలని చెప్పడం వంటి కారణాలతో కొంత అసహనానికి గురై రాజీనామా సమర్పించారని సమాచారం.

## టెట్ ఆన్‌లైన్ దరఖాస్తులో తప్పులు సవరించుకోవడానికి 5 వరకు అవకాశం

**విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ప్రయత్నం చేస్తున్న అభ్యర్థులకు రాష్ట్ర విద్యాశాఖ కీలక ఊరటనిచ్చింది. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో అభ్యర్థులు పొరపాటున నమోదు చేసిన తప్పులను సరిదిద్దుకునేందుకు ప్రభుత్వం ఒక అవకాశాన్ని కల్పించింది. దరఖాస్తు సమర్పించిన తర్వాత ఏవైనా పొరపాటులు గుర్తిస్తే వాటిని సవరించుకోడానికి గతంలో ఉన్న ఇబ్బందులను తొలగిస్తూ వన్‌టైమ్ డిలీట్ అనే సరికొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. టెట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ దరఖాస్తు ఫామలో పేరు, విద్యార్హతలు, లేదా ఇతర వ్యక్తిగత వివరాలను నమోదు చేసేటప్పుడు కొన్నిసార్లు తప్పులు చేస్తుంటారు. ఇటువంటి తప్పులు వల్ల భవిష్యత్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ సమయంలో ఇబ్బందులు ఎదురవుతాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని అభ్యర్థులు ఇప్పటికే సమర్పించిన దరఖాస్తును పూర్తిగా డిలీట్ చేసి, సరైన వివరాలతో మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు టెట్ కన్వీనర్ వెంకట్ కృష్ణారెడ్డి అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ సవరణ ప్రక్రియ నిరంతరం అందుబాటులో ఉండదు. కేవలం పరిమిత కాలం మాత్రమే ఈ అవకాశం ఉంటుంది. గురువారం (జులై 2) నుంచి ఐదో తేదీ వరకు మాత్రమే అభ్యర్థులు ఈ వన్ టైమ్ డిలీట్ ఆప్షన్ వినియోగించుకోవచ్చు. నిర్ణీత గడువు ముగిసిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లో దరఖాస్తుల సవరణకు అవకాశం ఉండదని అధికారులు స్పష్టం చేశారు. అభ్యర్థుల అధికారిక టెట్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ లాగిన్ వివరాలతో ప్రవేశించాలి. అక్కడ వన్‌టైమ్ డిలీట్ అనే ఐచ్ఛికాన్ని ఎంచుకోవాలి. దీని వల్ల పాత దరఖాస్తు వ్యవస్థ నుంచి డిలీట్ అవుతుంది. ఆ తర్వాత అభ్యర్థులు తాజా వివరాలతో ఎటువంటి తప్పులు లేకుండా దరఖాస్తు తిరిగి సబ్‌మిట్ చేయాలి అని సూచించారు.

## ఎపిఎన్‌ఆర్‌టి కోఆర్డినేటర్ల నియామకం

**విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వం ఎపిఎన్‌ఆర్‌టి కోఆర్డినేటర్లను ప్రకటించింది. దేశవిదేశాల్లోని ప్రవాసాంధ్రుల సంక్షేమం కోసం ప్రాంతీయ, రాష్ట్ర, దేశస్థాయిలో 600 మందికి పైగా కోఆర్డినేటర్ల నియామకం చేపట్టింది. వీరు ప్రవాసాంధ్రుల సంక్షేమం, అభ్యున్నతికి కృషి చేయనున్నారు. ఎపిఎన్‌ఆర్‌టితో సమన్వయం చేస్తూ భారత ఎంబసిలు, స్థానిక ప్రభుత్వాలతో సమన్వయం చేస్తూ సేవలందించనున్నారు. ఎపి ప్రభు త్వం, ఎపిఎన్‌ఆర్‌టి కార్యక్రమాల మేరకు విధులు నిర్వహించనున్నారు. కొత్తగా నియమితులైన కోఆర్డినేటర్లకు మంత్రి శ్రీనివాస్ శుభాకంక్షలు తెలిపారు.

## కె.వెంకటరామిరెడ్డికి 14 రోజుల రిమాండ్



**విజయనగరం (బొబ్బిలి), జులై 2 ప్రభాతవార్త:** హైదరాబాద్‌కు చెందిన కె.వి.ఆర్ టీవీ నిర్వాహకుడు కె.వెంకటరామిరెడ్డికి 14 రోజులు రిమాండ్ విధిస్తూ గురువారం బొబ్బిలి కోర్టు సీనియర్ సివిల్ జడ్జ్ ఎం.రోహిణీరావు తీర్పు వెలువరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పోలీసులు అరెస్టు చేసి బుధవారం మధ్యాహ్నం బొబ్బిలి స్టేషన్‌కి తీసుకువచ్చారు. బొబ్బిలి రూరల్ సీఐ ఎస్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు అతన్ని అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా అతనికి రిమాండ్ విధించారు. కె.వి.రెడ్డి రాజ్యాంగాన్ని అసభ్యకర పదజాలాలతో బూతులతో కించపరిచారన్న అభియోగంపై ఏప్రిల్ 10న బాడంగి పోలీస్ స్టేషన్‌లో కండి రమేష్ అన్న బాడంగి వ్యక్తి కేసు పెట్టారు. సీఎం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై విమర్శలు చేసినట్లు ఆరోపణ ఆయన వ్యాఖ్యానాలు యూట్యూబ్‌లో ప్రచారం అయ్యాయని అవి తమను ఎంతో కించపరిచాయని బాడంగికి చెందిన మాజీ సర్పంచ్ కండి రమేష్ పోలీస్ స్టేషన్లో కేసు వేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి బాడంగి పోలీసులు కెవి రెడ్డిని అరెస్టు చేసేందుకు వెళ్లి విఫలమయ్యారు. రాజ్యాంగాన్ని కించపరిచినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడు పై నాన్బెల్ వారెంట్ జారీ చేశారు. ఈ ఆదేశాల మేరకే సీఎస్ శ్రీనివాస్ తన సిబ్బంది తీవ్ర ప్రతిఘటన మధ్య నిందితుడిని అరెస్టు చేసి బొబ్బిలి తరలించారు. ఏవీ రెడ్డిని బొబ్బిలి కోర్టులో హాజరు పరిచేందుకు జరిగిన సన్నాహాల్లో భాగంగా ముందుగా అతడు స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. స్థానిక కోర్టుకు ఇతర సిబ్బంది వచ్చి సమాచారాన్ని కోర్టు అధికారులకు తెలిపారు ఈలోగా ఏమి జరుగుతుందో ఏమో గాని నిందితుడిని కోర్టులో ఆధారపరచలేదు. నిందితుడు రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఉంచారు ఉదయం బొబ్బిలి కోర్టులో హాజరపరిచారు. జూనియర్ సివిల్ జడ్జ్ ఎం.రోహిణీరావు ఆదేశాల మేరకు కేవీరెడ్డిని స్థానిక సభ్యులు తరలించారు నిందితుడిని తన కస్టడీకి తీసుకొని విచారించాలన్న పోలీసు అభ్యర్థులను కోర్టు ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. నిందితుడు భార్య సిఐఎస్ శ్రీనివాసరావు పై సరూర్ పోలీస్ స్టేషన్లో కేసు పెట్టారు. ఆడవారిని చూడకుండా బలవంతంగా నెట్టేసి నా భర్తను తీసుకెళ్లిపోయారని ఆమె పోలీస్ స్టేషన్లో కేసు పెట్టింది దీనిపై పూర్తి వివరాలు రావాల్సి ఉంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
సుమారు రూ.21.05 లక్షల విలువ గల 02 పనులకు నిట్ నెం. 16 & 17/EE/(R&B)/GNT/2026-27, తేది: 29.06.2026 ద్వారా టెండర్లు ఆహ్వానించబడుచున్నవి. వివరములకు ఇ-మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in నందు చూడగలరు. టెండర్లు దాఖలు చేయుటకు చివరి తేది: 15.07.2026, మ.3.30గం. వరకు.
సం/-. కార్యనిర్వాహక ఇంజనీరు, (ర.భ) డివిజను, గుంటూరు.
DIPR.NO. 20806/CL/ADVT/1/1/2022-23 తేది: 02.07.2026

వార్త

పట్టణాల శోభ ఎక్కడైనా ఒక్కటే, ప్రకృతి అందాలే పల్లెకోవిధంగా పరిమళిస్తుంటాయి.

న-తిరుక్కురళ్

# పతనం అంచున ప్రజారోగ్యం!


జనారోగ్యమే జాతి మహాభాగ్యమనే ఆశయం, లక్ష్యాల కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని దేశ ప్రజలందరికి వైద్యసేవలు అందుబాటులోకి తెస్తామని పాలకులు ఎంతగా చెప్తున్నా ఆచరణకు వచ్చేసరికి కనీస వైద్యసదుపాయాలు అందించలేకపోతున్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఈ లక్ష్యసాధన కోసం ఎన్నో లక్షల కోట్ల రూపాయలు వెచ్చించారు, వెచ్చిస్తున్నారు. అయినా ఆశించిన ఫలితాలు చేకూరడం లేదు. దేశానికిపట్టుగొమ్మలైన గ్రామసీమల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగానే ఉందని చెప్పొచ్చు. అందరికి వైద్యం అనేది దశాబ్దాలు దాటిపోయినా కనుచూపు మేరలో కన్పించడం లేదు. ఇప్పటికీ భారత్‌లో దాదాపు నలభైఏడు కోట్ల మందికి పైగా అత్యవసర మందులు, వైద్యం అందుబాటులో లేవని చెప్తున్నారు. అన్నిటికంటే ముఖ్యంగా దేశంలో మధ్యతరగతి ప్రజలు పెట్టే ఖర్చులో దాదాపు డెబ్బై శాతం పైగా మందుల కొనుగోళ్లకే ఖర్చు చేస్తున్నారు. ప్రధానంగా సీజన్ మారినప్పుడల్లా ప్రజారోగ్యంపై రోగాలదాడి ఊహించని రీతిలో పెరిగిపోతున్నది. కొత్త కొత్త మందులు, సాంకేతిక పరిజ్ఞానంతో చికిత్సలు అందిస్తున్నా అంతకు రెట్టింపుస్థాయిలో రకరకాల వ్యాధులు విస్తరిస్తూనే ఉన్నాయి. ఈ వ్యాధులను నియంత్రించడంలో సమర్థవంతంగా వ్యవహరించలేకపోతున్నారని చెప్పొచ్చు. మొన్నటి కరోనా సృష్టించిన బీభత్సం నుండి ఇంకా కొందరు సంపూర్ణ ఆరోగ్యవంతులు కాలేకపోతున్నారు. ఆ వ్యాధి నుండి బయటపడేందుకు అప్పుడు వాడిన మందుల ప్రభావం నుండి నేటికీ కొలుకోలేకపోతున్నారు. ముఖ్యంగా గుండెజబ్బులు, కిడ్నీ తదితర వ్యాధులు విస్తరించిపోతున్నాయి. ఇక సీజన్‌తోపాటు వచ్చే వ్యాధుల గురించి చెప్పక్కర్లేదు. మలేరియా నిర్మూలనకు పెద్దఎత్తున చర్యలు తీసుకుంటున్నామని పాలకులు ఎంతగా చెప్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులువేరుగా ఉన్నాయి. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో వైద్యం అందుబాటులో లేదనే చెప్పొచ్చు. కలుషిత నీరు, దోమల కారణంగా డెంగ్యూ, స్వైన్‌ఫ్లూ, చికెన్‌గున్యా లాంటి వ్యాధులు ప్రబలిపోతున్నాయి. గిరిజన ప్రాంతాల్లో మందులు అందుబాటులో లేకపోవడంతో పసర్లు, వేర్లు, ఆకులతో వచ్చీరాని నాటువైద్యంతో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఇకపోతే పట్టణాల్లో, నగరాల్లో ముఖ్యంగా మురికివాడల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ప్రభుత్వ ఆస్పత్రులే కాదు ప్రైవేట్ ఆస్పత్రులు కూడా రకరకాలజ్వరాల బాధితులతో కిటకిటలాడుతున్నాయి. వీటన్నింటికంటే మించి నకిలీ, నాసిరకం మందులు జనారోగ్యాన్ని పతానంచుకు తీసుకుపోతున్నాయి. దేశవ్యాప్తంగా నమోదైన మందుల రకాల కంటే రెట్టింపు స్థాయిలో నకిలీ, నాసిరకం మందులు చెలామణి అవుతున్నాయి. ఇవి విచ్చలవిడిగా సరఫరా చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని గుల్లచేస్తున్న ఈ నకిలీ మందులు ఒక వ్యూహం ప్రకారం ప్రవేశపెడుతున్నారు. అప్పుడప్పుడు పట్టుబడుతున్నా ఏదో నామమాత్రపు కేసులతో కాలం గడుపుతున్నారే తప్ప నిర్దిష్టమైన చర్యలు తీసుకొని మళ్లీమళ్లీ పునరావృతంకాకుండా చేయలేకపోతున్నారు. మందుల్లో ప్రామాణికత దెబ్బతినడంవల్ల చోటు చేసుకుంటున్న అనర్థాలు అన్నీఇన్నీకావు. గతంలో నకిలీ మందులు వాడటంతో ఎందరో ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. వాస్తవంగా ఆనాడే ప్రభుత్వం చర్యలకు శ్రీకారం చుట్టింది. ముంబాయిలో నాసిరకం మందులతో పది మందికిపైగా మరణించడంతోప్రభుత్వం జస్టిస్ లెంటిన్ కమిషన్‌ను నియమించింది. మంత్రిత్వ స్థాయి మొదలు దిగువ స్థాయి వరకు ఆరోగ్య, ఔషధ విభాగాల్లోని లొసుగులను వైఫల్యాలను అవినీతిని ఎత్తి చూపుతూ లెంటిన్ తన నివేదికలో ఆనాడే స్పష్టంగా పేర్కొన్నారు. ఆ నివేదికలో చేసిన ప్రతిపాదనలు పాలకులు అంతగా పట్టించుకోలేదనే చెప్పొచ్చు. నకిలీ మందుల వల్ల కలిగే దుష్ప్రభావాలు అటుంచి జబ్బు తగ్గకపోతే వైద్యుడి వైఫల్యమా? ఉపయోగించిన మందులు కారణమా అర్థంకాక వైద్యుడు మళ్లీ మళ్లీ పరీక్షలు చేయిస్తూ ఇతర మందులతో రోగులపై ప్రయోగాలు చేస్తున్నారు. దానివల్ల రోగి ఆరోగ్యంతోపాటు ఆర్థికంగా కూడా కుప్పకూలిపోతున్నాడు. అసలు వైద్య, ఆరోగ్య విషయంలో నిర్దిష్టమైన ప్రణాళిక, ముందుచూపు లేకపోవడంతోనే ఈ పరిస్థితులు దాపురిస్తున్నాయి. గత రెండు, మూడు వారాలుగా దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న విషజ్వరాలుప్రధానంగా గ్రామీణ ప్రాంతాలను అతలాకుతలం చేస్తున్నాయి. ఇందులో మలేరియా, డెంగ్యూ అగ్రస్థానంలో ఉన్నట్లువార్తలు అందుతున్నాయి. అయితే గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధిని ముఖ్యంగా డెంగ్యూను సకాలంలో గుర్తించలేకపోతున్నారు. వ్యాధి ముదిరి ప్రాణాలకు ముప్పు తెస్తున్నది. అన్నిటికంటే ముఖ్యంగా డెంగ్యూ వ్యాధికి ఇప్పటివరకు ఖచ్చితమైన ఔషధం, టీకా లేకపోవడంతో విస్తరణను అడ్డుకోలేకపోతున్నారు. పెరుగుతున్న వ్యాధుల బారిన పడుతున్న రోగులకు తగినట్టుగా ఆస్పత్రులు కానీ, సిబ్బంది కానీ లేవనిచెప్పొచ్చు. దారిద్ర్యరేఖకు దిగువనున్న బడుగు వర్గాల కుటుంబాలకు వైద్యం అందుబాటులో లేదు. దీంతో కొన్ని గ్రామాల్లో వచ్చీరాని వైద్యంతో డాక్టర్లుగా చెలామణి అవుతూ తోచిన మందులు ఇచ్చేవారు కూడా తక్కువ సంఖ్యలో లేరు. కనీసం మందుల పేర్లు స్పష్టంగా రాయలేనివారు కూడా డాక్టర్ల జాబితాలో చేరిపోతున్నారు. చిన్న చిన్న ఆపరేషన్లు చేయడానికి కూడా వెనుకాడడం లేదు. రాబోయే రోజుల్లో ప్రజారోగ్యం అత్యంత క్లిష్టపరిస్థితులు ఎదుర్కోబోతున్నట్లు వైద్యనిపుణులే అభిప్రాయపడుతున్నారు. పాలకులు ఇప్పటికైనా గత అనుభవాలతో పాఠాలు నేర్చుకొని ప్రజారోగ్యం ఎదుర్కోబోతున్న సవాళ్లకు అనుగుణంగా సమాయత్తం కావాలి.

మనకుగల శక్తిని బట్టి మనలను మనం అంచనా వేసుకుంటాం. మనం చేసిన పనులను బట్టి ఇతరులు మనల్ని అంచనా వేస్తారు.



హెచ్. పోర్టర్

మామూలు మనుషులు కాలాన్ని ఎలా ఖర్చు చేయాలా అని ఆలోచిస్తే తెలివిమంతుడు కాలాన్ని ఉపయోగించుకోవడానికి ప్రయత్నిస్తాడు.



సెయింట్ బెర్నార్డ్

## ప్రజావాక్కు



### రైళ్లలో నాణ్యమైన ఆహారం అందేనా?

ముంబై వెళ్తున్న తేజస్ ఎక్స్‌ప్రెస్‌లో ఓ ప్రయాణికుడికి అందించిన వెజ్ బిర్యానీలో ఈగ కనిపించిన ఘటన మరోసారి భారతీయ రైల్వేల్లో అందిస్తున్న ఆహార నాణ్యతపై ప్రశ్నలు లేవనెత్తింది. ప్రయాణికులు పూర్తి ధర చెల్లించి భోజనం కొనుగోలు చేస్తున్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో నాణ్యతలేని, అపరిశుభ్రమైన ఆహారం అందుతుండటం ఆందోళనకలిగిస్తోంది. ఈఘటనపై సంబంధిత విక్రేతకు రూ.1 లక్ష జరిమానా విధించి, లైసెన్స్ రద్దుకు షోకాజ్ నోటీసు జారీ చేయడం స్వాగతించదగ్గ చర్యే. అయితేఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడటమే అసలు లక్ష్యం కావాలి. రైలులో అందించే ఆహారం కేవలం సేవ మాత్రమే కాదు, ప్రయాణికుల ఆరోగ్యానికి సంబంధించిన అంశం కూడా. అపరిశుభ్రమైన ఆహారం వల్ల ఫుడ్ పాయిజనింగ్ వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. భారతీయ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్‌ఆహార నాణ్యతపై మరింత కఠినమైన పర్యవేక్షణ వ్యవస్థను అమలు చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### తల్లిదండ్రుల బాధ్యత పిల్లలదే..

నవమాసాలు మోసి కని పెంచి విద్యాబుద్ధులు నేర్పి, ఎదుగుదలకుకృషి చేసిన తల్లిదండ్రులను ముదివయస్సు రాగానే నిర్లక్ష్యం చేయడం తగదు. ఆస్తిపాస్తులు అందగానే భారంగా భావించివృద్ధాశ్రమం, బస్టాండు, రైల్వే స్టేషన్‌లో వదిలిచేతులు దులుపుకోవడం ఇటీవల ఎక్కువ అవుతుండడం ఆందోళనకరం. మానవతానికి మాయని మచ్చఅంటే అతిశయోక్తికాదు. జీవిత చరమాంకంలో మన వాళ్లతో ప్రేమ, ఆప్యాయతల పలకరింపు కోసమై ఎదురు చూస్తుంటారు. నడిచే దేవుళ్ల జననీజనకులు. వార్ధక్యం దశ చిన్న పిల్లలంటారు. కావున కంటికి రెపనపలా కాపాడుకోవాలి. రేపటిపౌరులు కూడా ఇదేబాటలో నడుస్తారు. ప్రత్యేక చట్టం అమలులో ఉండడం ఆనందదాయకం.

- ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూర్లు

### కార్మికులను పట్టించుకోరా..

నేటి భారతంలో అధిక పనుల పేరిట ఆదివారం కూడా ఆకలి మంటలకోసం అహర్నిశలు కృషి చేస్తూ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ప్రైవేట్ ఆఫీసులు, ఆసుపత్రుల బంధిఖానలో తీవ్రఅనారోగ్యానికి గురవుతున్న కార్మికులు కుటుంబం గురించి ఆలోచించి ముందుకు సాగాలి.

### బ్లాక్ మెయిల్ కార్యకర్తలపై నిషేధం

సమాచారహక్కు చట్టాన్ని దుర్వినియోగపరుస్తూ అధికారులను బ్లాక్ మెయిల్ చేస్తున్న కొంతమంది కార్యకర్తలపై నిషేధం విధించాలని ఈమధ్య ఆర్టీఐ చీఫ్ కమిషనర్ ఆదేశించారు. ఎందుకంటే ఇలాంటివారి వలన అసలైన కార్యకర్తలకు చెడ్డపేరు వస్తుంది. బ్లాక్ మెయిలర్స్‌కు ఖచ్చితంగా అడ్డుకట్ట వెయ్యాలి. అయితే చీఫ్ కమిషనర్ కార్యకర్తలు అడిగిన సమాచారాన్ని తగినకాలంలో ఇవ్వని పీఐఓ పై, మొదటి అప్పులేట్ అధికారులపై, సకాలంలో సమాధానం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులపై కూడా శాఖాపరమైన చర్యలు గాని, జరిమానా విధించటం గానీ ఖచ్చితంగా అమలుపరచినప్పుడే కమిషనర్లను కార్యకర్తలు నమ్ముతారు. ఎంతమంది అధికారులపై చర్యలు తీసుకున్నారో లేక జరిమానావిధించారో కూడాకమిషనర్ పత్రికలకు ఇస్తేకార్యకర్తలకు ధైర్యం వస్తుంది.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### పే కమిషన్ నత్తనడక

ఒక కమిషన్ వేసి సంవత్సరాలు ఆలస్యం చేసి మొత్తం దేశం అంతా దానిని ఊరేగించి పెద్దల ఎదుట పెట్టి (పార్లమెంట్ ) హారతిఇప్పించి చేయడానికి 2సంవత్సరాలు పడటం నిజంగా హాస్యాస్పదం. దానికిఫైనాన్స్ మినిస్టర్‌నిట్టూర్పులు ఇక ఎన్నో చెప్పలేము. ఆవిడ అందరికీ వరాల జల్లులు కురిపిస్తారు పాపం ఉద్యోగుల మొహాలు చూస్తే ఆవిడకెందుకో నచ్చదు. డిఏలు, బేసిక్లు, హెచ్‌ఆర్‌ఏలు, ఏరియర్లు అంతకన్నా ముఖ్యంగా టాక్స్ రిలీఫ్‌లు కనపడతాయి. అదే ఎంపిలకు ఒక లక్ష పెంచడానికి ఆవిడ సూపర్ సోనిక్ రాకెట్‌ను ఉపయోగిస్తారు. ఒక గంట అనుకోవడం వేరే నిమిషంలో ఆర్డర్స్. ఈ ఎనిమిదోవ పే కమిషన్ గూడ్స్ ఎప్పుడు మన స్టేషనకి వస్తుందో.

- గార్లపాటీ సీతారామయ్య, హైదరాబాద్

### ఉద్యోగావకాశాల కల్పన

భారతదేశంలోనే మొట్టమొదటి క్వాంటం టెక్ పార్క్‌గా గుర్తింపు పొందనున్న అమరావతి క్వాంటం వ్యాలీ ప్రాజెక్ట్ ఉద్ధండ రాయునిపాలెంలో ఏర్పాటు అవుతోంది. దీని ప్రధాన లక్ష్యం 133క్యూబిట్లక్వాంటం కంప్యూటర్(సిస్టమ్2)ను నెలకొల్పడం. ఐబీఎం, టీసీఎస్ వంటి గ్లోబల్‌సంస్థల సహకారంతో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా పరిశోధకులు, స్టార్టప్‌లకు అత్యాధునిక సాంకేతిక వనరులు అందుబాటులోకి వస్తాయి. ఈ ప్రాజెక్ట్ వల్ల దాదాపు లక్ష ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# సామాజిక ఉద్యమమే శాశ్వత పరిష్కారం!

**'కూరగాయల మార్కెట్‌కు వెళ్లేటప్పుడు చేతిలో ఒక బట్ట సంచి పట్టుకెళ్లడం' అనే ఒక చిన్న అలవాటు రేపటి తరం భవిష్యత్తును మార్చగలదు. వ్యాపారులు లాభాపేక్షను పక్కనపెట్టి, వినియోగదారులు బద్ధకాన్ని వదిలిపెట్టి స్వచ్ఛందంగా 3ఆర్ (రిడ్యూస్, రీయూస్, రీసైకిల్) సూత్రాన్ని నిత్యజీవితంలో అమలు చేయాలి. ఒక చేత్తో ప్లాస్టిక్ మహమ్మారిని బహిష్కరిస్తూ, మరో చేత్తో పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ఆహ్వానించినప్పుడే ఈ యుద్ధంలో మనం గెలుస్తాం. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని కేవలం ఒక రోజు నినాదాల వేడుకగా కాకుండా, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం ప్రభుత్వాల బాధ్యతతో ముగిసే కార్యక్రమంకాదు, ప్రతి పౌరుడు చేపట్టాల్సిన జీవన ఉద్యమం. అది కేవలం పర్యావరణ పరిరక్షణ కోసం కాదు, రాబోయే తరాల మనుగడ కోసం చరిత్ర మనపై ఉంచిన బాధ్యత.**



ఫిరోజ్ ఖాన్

మనం ప్లాస్టిక్‌ను వాడుతున్నామా.. లేక ప్లాస్టిక్కేమనల్ని వాడుకుంటూ నిశ్శబ్దంగా మన సమాధిని తవ్వుతోందా? ఆధునిక మానవాళి అలవాటు చేసుకున్న 'యూజ్ అండ్ త్రో' సంస్కృతి నేడు భూగోళానికి నిశ్శబ్ద ముప్పుగా మారింది. ఉదయం లేచింది మొదలు పాలు, కూరగాయల నుంచి రాత్రి పడుకునే వరకు ప్రతి అవసరానికి ప్లాస్టిక్ కవర్లపై ఆధారపడటం ఒక సామాజిక వ్యసనంగా మారింది. కేవలం 12 నిమిషాల సగటు కాల పరిమితి కోసం మనం వాడి విసిరేసే ఈ ఒక్క సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సంచి, ఈ భూమిపై పూర్తిగా విచ్ఛిన్నం కావడానికి 500 నుండి 1000 సంవత్సరాల సమయం పడుతుందనే నిజం మనల్ని నిలువునా వణికించకమానదు. ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం విడుదల చేసిన పర్యావరణ నివేదికల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా ప్రతి నిమిషానికి 10 లక్షల ప్లాస్టిక్ సంచులు వినియోగంలోకి వస్తున్నాయి. వాటిలో అత్యధికం చివరికి చెత్తకుప్పలకే చేరుతున్నాయి. ఇక్కడ ఉద్భవిస్తున్న పదునైన ప్రశ్న ఒక్కటే. పర్యావరణాన్ని నిశ్శబ్దంగా మింగేస్తున్న ఈ మహమ్మారిని అరికట్టడానికి తెచ్చిన కఠినమైన చట్టాలు, క్షేత్రస్థాయిలో ఎందుకు కాగితాలకే పరిమితమవుతున్నాయి? ప్రస్తుత వర్షాకాలంలో విచ్చలవిడిగా పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు భూమి, ఆకాశం, జలాలను కలుషితం చేస్తూ పర్యావరణ సమతుల్యతను దారుణంగా దెబ్బతీస్తున్నాయి. ప్లాస్టిక్ సంచుల వల్ల మురుగు కాల్వలు, డ్రైనేజీ వ్యవస్థలు పూడిపోయి నగరాలు స్వల్ప వర్షాలకే జలమయమవుతున్నాయి. అందుకు 2005 జులైలో ముంబై నగరంలో సంభవించిన భారీ వరదలకు ప్లాస్టిక్ వ్యర్థాలే ప్రధాన కారణమని నిపుణుల కమిటీలు అధికారికంగా తేల్చడం ఒక చారిత్రకసాక్ష్యం అంతకంటే భయంకరమైన విషయం ఏమిటంటే, ఎల్లెన్ మాక్‌ఆర్థర్ ఫౌండేషన్ పరిశోధనా పత్రాల ప్రకారం, ఇదే పరిస్థితి కొనసాగితే 2050 నాటికి సముద్రాలలో చేపల మొత్తం బరువు కంటే ప్లాస్టిక్ వ్యర్థాల బరువే ఎక్కువగా ఉంటుందని అంచనా. ఈవ్యర్థాలు నీటిలో విచ్ఛిన్నమై మైక్రోప్లాస్టిక్స్ (కంటికి కనిపించని ప్లాస్టిక్ రేణువులు) రూపంలో మారి సముద్ర జీవుల శరీరాల్లోకి, వాటి ద్వారా తిరిగి మానవ ఆహార గొలుసులోకి ప్రవేశిస్తున్నాయి. మనం పారేసిన విషం తిరిగి మన ప్లేట్లలోకే వస్తోందని, దీనివల్ల మానవ శరీరంలో క్యాన్సర్ కారకాలు, హార్మోన్ల అసమతుల్యత పెరుగుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలు హెచ్చరిస్తున్నాయి. పట్టణాలు, గ్రామాల్లో రోడ్లపై పారేసే ప్లాస్టిక్ చెత్తను ఆహారంగా భ్రమించి అమాయక పశువులు తింటున్నాయి, ఫలితంగా వాటి జీర్ణ వ్యవస్థలు దెబ్బతిని ప్రతిఏటా వేలాది మూగజీవాలు మృత్యువాత పడుతున్నట్లు



వెటర్నరీ నివేదికలు నిరూపిస్తున్నాయి. భారతదేశంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల జరుగుతున్న నష్టాన్ని నివారించడానికి కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ 2022 జులై 1 నుండి దేశవ్యాప్తంగా 19 రకాల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల ఉత్పత్తి, నిల్వ, పంపిణీ, అమ్మకాలపై అధికారికంగా కఠిన నిషేధం విధిస్తూ గెజెట్ నోటిఫికేషన్ జారీ చేసింది. చట్టం ప్రకారం ఉల్లంఘనలకు పాల్పడిన వారికి పర్యావరణ పరిరక్షణ చట్టం1986 కింద భారీ జరిమానాలతో పాటు ఐదేళ్ల జైలు శిక్ష విధించే నిబంధనలు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్లాస్టిక్ సంచుల వినియోగం ఇంకా యథేచ్ఛగా కొనసాగుతుండటం పాలనాపరమైన వైఫల్యాన్ని బట్టబయలు చేస్తోంది. ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 127 దేశాలు ప్లాస్టిక్ సంచులపై పూర్తిగా లేదా పాక్షికంగా నియంత్రణ చట్టాలు తెచ్చినప్పటికీ, ఆశించిన ఫలితాలు రాలేదు. అయితే, ఈ సమస్యకు మరో కోణం కూడా ఉంది. ఆల్ ఇండియా ప్లాస్టిక్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ గణాంకాల ప్రకారం, ప్లాస్టిక్ పరిశ్రమలపై ఆధారపడి దేశంలోలక్షలాది మంది కార్మికులు, చిన్న వ్యాపారులు జీవనోపాధి పొందుతున్నారు. వీరికి సరైన పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలను, రాయితీలతో కూడిన బట్ట సంచులు లేదా జూట్ బ్యాగుల తయారీ పరిశ్రమలనుప్రభుత్వం భారీగా ప్రోత్సహించకపోవడం, తగినంత సమయం ఇవ్వకుండా ఆకస్మిక చర్యలకు దిగడం కూడా చట్టం పూర్తి స్థాయిలో విజయవంతం కాకపోవడానికి ఒక ప్రధాన కారణంగా నిలుస్తోంది. ఈ భూమి మన సొంత ఆస్తి కాదు, రేపటి తరాలకు మనం ఇవ్వాల్సిన పచ్చని ఆస్తి. దీనిని ప్లాస్టిక్ సమాధిగా మార్చే హక్కు ఏ మనిషికీ లేదు. కేవలం ప్రభుత్వాల లాఠీలు, జరిమానాల వల్లే సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదు. చట్టాల పట్ల భయం కంటే సమాజంలో పర్యావరణం పట్ల నైతిక భయం పెరగాలి. 2024లో జరిగిన ఐక్యరాజ్యసమితి ప్లాస్టిక్ ఒప్పంద చర్చలు సైతం కేవలం వినియోగాన్ని మార్చడం మాత్రమే కాదు, ఉత్పత్తి స్థాయిలోనే ప్లాస్టిక్‌ను నియంత్రించాలని స్పష్టం చేశాయి. 'కూరగాయల మార్కెట్‌కు వెళ్లేటప్పుడు చేతిలో ఒక బట్ట సంచి పట్టుకెళ్లడం' అనే ఒక చిన్న అలవాటు రేపటి తరం భవిష్యత్తును మార్చగలదు. వ్యాపారులు లాభాపేక్షను పక్కనపెట్టి, వినియోగదారులు బద్ధకాన్ని వదిలిపెట్టి స్వచ్ఛందంగా 3ఆర్ (రిడ్యూస్, రీయూస్, రీసైకిల్) సూత్రాన్ని నిత్యజీవితంలో అమలు చేయాలి. ఒక చేత్తో ప్లాస్టిక్ మహమ్మారిని బహిష్కరిస్తూ, మరో చేత్తో పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ఆహ్వానించినప్పుడే ఈ యుద్ధంలో మనం గెలుస్తాం. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని కేవలం ఒక రోజు నినాదాల వేడుకగా కాకుండా, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం ప్రభుత్వాల బాధ్యతతో ముగిసే కార్యక్రమంకాదు, ప్రతి పౌరుడు చేపట్టాల్సిన జీవన ఉద్యమం. అది కేవలం పర్యావరణ పరిరక్షణ కోసం కాదు, రాబోయే తరాల

# ఇయు దేశాల్లోనూ పెరుగుతున్న ఆర్థిక సంక్షోభం

బొల్లిముంత సాంబశివరావు

యూరోపియన్యూనియన్ అనేది 27దేశాల మధ్య ఏర్పడిన ఒకప్రత్యేకమైన రాజకీయ, ఆర్థిక వ్యవస్థ. సభ్య దేశాల మధ్య వాణిజ్యాన్ని సులభతరం చేయడం, ఉమ్మడి చట్టాలను రూపొందించడం, ప్రజల స్వేచ్ఛాసంచారాన్ని ప్రోత్సహించడం దాని ముఖ్యఉద్దేశం. దీనికి యూరో కరెన్సీ ప్రత్యేకంగా ఉంది. 20 దేశాలు యూరో కరెన్సీని ఉపయోగిస్తున్నాయి. దీనిని యూరో జోన్ అంటారు. ఈయూ ప్రజలచే ఎన్నుకోబడిన పార్లమెంట్, యూరోపియన్ కమిషన్ ఈయూ పరిపాలన నిర్వహిస్తాయి. ఇది పెద్ద ఆర్థికవ్యవస్థను కలిగిఉంది. ప్రస్తుతం యూరోపియన్ యూనియన్ దేశాలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయి. 2008 నాటి ప్రపంచ ఆర్థికమాంద్యం తర్వాత యూరప్ దేశాలు తమ ప్రభుత్వరంగాలను ద్రవ్యలోటును అదుపు చేయలేకపోయాయి. ఈ దేశాలన్నిటికీ ఒకే కరెన్సీ యూరో ఉండటం వల్ల, ఆర్థికకంగా వెనుకబడిన దేశాలు తమ సొంత కరెన్సీ ఏర్పాటు చేసుకునే అవకాశం కోల్పోయాయి. రియల్‌ఎస్టేట్ రంగంలో సమస్యలు, ప్రైవేట్ అప్పులు పెరిగిపోవడంవల్ల అనేక బ్యాంకులు దివాలా స్థాయికి చేరుకున్నాయి. యూరప్ సెంట్రల్ బ్యాంకు స్వతంత్రంగా పనిచేసినప్పటికీ, గ్లోబల్ ఫైనాన్షియల్ మార్కెట్లు, డాలర్ మారకం రేటు యూరప్ ఆర్థిక నిర్ణయాలను తీవ్ర ప్రభావితం చేస్తున్నాయి. పెట్టుబడిదారీ దేశాల ఆర్థిక విధానాలు పేదరికాన్ని, సంపన్నవర్గాలను సృష్టిస్తుంది. యూరోపియన్యూనియన్లో ఈ విభజన ఎక్కువగానే ఉంది. ఈ యూనియన్లో 27 దేశాలు ఉన్నాయి. ఈ దేశాల జనాభా 45 కోట్లు. ఇందులో 9.27 కోట్లమంది పేదరికంలో ఉన్నారు. ఇది మొత్తం జనాభాలో 20.9 గాఉన్నారు. ఇక్కడ పేదరికం కొలమానం వేరుగా ఉంటుంది. అంటే కనీస అవసరాలు లేనివారు కాకుండా, జాతీయ ఆదాయంలో 60శాతం కంటే తక్కువ ఆదాయం ఉన్నవారు పేదలుగా గుర్తించబడతారు. ఈయూలోని బల్గేరియా 29శాతం, గ్రీస్27.5 శాతం, రుమేనియా 27.4 శాతంతో అత్యధిక పేదరికం కలిగి ఉండగా, ప్రధాన ఆర్థికవ్యవస్థలుగా ఉన్న స్పెయిన్లో 25.7 శాతం, ఇటలీలో 22.6శాతం, జర్మనీలో




21.2 శాతం పేదరికంలోఉన్నారు. యూరప్యూనియన్లో సంపద, అసమానతలు, ఆదాయ అసమానతల కంటే ఎక్కువగా ఉన్నాయి. ఇందులోని ధనిక దేశాల్లో కూడా సంపద పంపిణీలో భారీ వ్యత్యాసాలున్నాయి. అత్యంత ధనవంతులుగా ఉన్న 10 శాతం జనాభా, మొత్తం సంపదలో సుమారు 67శాతం కలిగిఉన్నారు. దిగువ 50 శాతం మంది ప్రజల వద్ద కేవలం 1.2 శాతం సంపద మాత్రమే ఉంది. అత్యంత ధనవంతులైన 1శాతం కుబేరుల చేతుల్లో యూరప్ మొత్తం సంపదలో 24 శాతం పోగుబడి ఉంది. పూర్వపు సోషలిస్టు దేశాలైన స్లోవేకియా, హంగరీ, పోలెండ్ వంటి దేశాల్లో సంపద అసమానతలు తక్కువగాఉన్నాయి. దీన్ని గమనిస్తే ఆ దేశాల్లో గతంలో అమలు జరిపిన సోషలిస్టు ఆర్థిక విధానాలే కారణం అన్న వాస్తవాన్ని తెలియచేస్తున్నది. జర్మనీ, నెదర్లాండ్ వంటి దేశాల్లో సంపద కేంద్రీకరణ ఎక్కువ ఉంది. బల్గేరియా, రుమేనియా, గ్రీస్, స్పెయిన్ దేశాల్లో ప్రతినలుగురులో ఒకరు పేదరికంలో ఉన్నారు. యూరోపియన్యూనియన్ అప్పులు విపరీతంగా పెరుగుతున్నాయి. అందుకు కారణం దాని ఆర్థిక సంక్షోభం. ఈయు నిబంధనల ప్రకారం జిడిపిలో అప్పుల శాతం 60 మించి ఉండకూడదు. అందుకు విరుద్ధంగా 81.7 శాతం ఉంది. యూరోజోన్ దేశాల అప్పులు 87.8శాతం వరకు ఉన్నాయి. కొన్నిదేశాలు ముఖ్యంగా గ్రీస్ 146 శాతం, ఇటలీ 136.8 శాతం, ఫ్రాన్స్ 117.7 శాతం ,బెల్జియం 107.1 శాతం, స్పెయిన్ 103.2 శాతం వాటి జిడిపిలో అత్యధిక అప్పులు కలిగి ఉన్నాయి. యూరోపియన్యూనియన్లో నిరుద్యోగం 6శాతంగా ఉంది. కోటి, 32 లక్షలమంది ప్రజలు ఉపాధికి దూరంగా ఉన్నారు. యూనియన్ దేశాలైనఫిన్లాండ్ 10.5 శాతం, స్పెయిన్ 10.3 శాతం, గ్రీస్ 9.5శాతంతో అత్యధిక నిరుద్యోగం ఉంది. ఈయూలో యువత సగటు నిరుద్యోగం 15.1శాతంగా ఉంది. ముఖ్యంగా స్పెయిన్, గ్రీస్, ఇటలీ వంటి దక్షిణ ఐరోపా దేశాలలో యువతలో నిరుద్యోగం 24శాతంగా ఉంది. ప్రతి నలుగురులో ఒకరు నిరుద్యోగిగా ఉన్నారు. గుత్తపెట్టుబడిదారుల మధ్య మార్కెట్ల కోసం పోటీ, అత్యధిక ప్రజల అవసరాలకు కాకుండా కొద్ది సంపన్నుల అవసరాలకు అనుగుణమైన ఉత్పత్తులు అధికంగా చేయడం, మార్కెట్ సంక్షోభం, ఆర్థికవ్యత్యాసాలు గుత్తపెట్టుబడిదారుల పోటీవల్ల ఏర్పడినవే. ఆర్థిక సంక్షోభం, కొద్ది మంది వద్దే సంపద కేంద్రీకరణ, ప్రజల పేదరికం. పెట్టుబడిదారీ దేశాల్లో ఆర్థికసంక్షోభాలు తొలగాలంటే

# వ్యవస్థ కాపలాదారులే దోపిడీదారులైతే..



పాపని నాగరాజు

దేశంలో ప్రజాస్వామ్యానికి, సుపరిపాలనకు వెన్నెముక సివిల్ సర్వీసెస్ వ్యవస్థ. చట్టాన్ని అమలు చేయడం, ప్రజా వనరులను సంరక్షించడం, ప్రభుత్వ విధానాలను ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగాఅమలు చేయడం ఈ వ్యవస్థ ప్రధానబాధ్యత. కానీ చట్టాన్ని కాపాడాల్సిన వారే చట్టంలోని బలహీనతలను తమ లాభాల కోసం వినియోగించడం ప్రారంభిస్తే, ప్రజాస్వామ్యానికి అది తీవ్రమైన హెచ్చరికగా మారుతుంది. మధ్యప్రదేశ్‌లో వెలుగు చూసిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల భూ కుంభకోణం, అదే రాష్ట్ర లోకాయుక్త పనితీరుపై బయటపడిన గణాంకాలు, అలాగే తెలంగాణలో బయటపడుతున్న భూవ్యవహారాల వివాదాలు, ఇవన్నీ కలిసి భారత పాలనా వ్యవస్థలో దాగి ఉన్న ఒక అసౌకర్యకరమైన సత్యాన్ని బయటపెడుతున్నాయి. అవినీతిని అరికట్టడానికి ఏర్పాటైన వ్యవస్థలే అవినీతికి అద్దం పట్టే పరిస్థితి ఏర్పడింది. మధ్యప్రదేశ్ లోకాయుక్త స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ గత ఇరవై ఏళ్ల అధికారిక గణాంకాలు ఒక చేదు వాస్తవాన్ని చెబుతున్నాయి. 2006 నుంచి 2026 వరకు కోర్టులు లోకాయుక్త కేసుల్లో 2,067 మందిని దోషులుగా నిర్ధారించాయి. మొదటి చూపులో ఇది విజయం అనిపించవచ్చు. కానీ అదే కాలంలో 966 మంది నిర్దోషులుగా విడుదల కాగా, మరో 105 మంది కేసులు విచారణ దశకే చేరలేదు. మొత్తం 1,071 కేసుల్లో, అంటే దాదాపు 34 శాతం సందర్భాల్లో, అవినీతి నిరోధక వ్యవస్థ కోర్టులో తన వాదనను నిలబెట్టలేకపోయింది. ఇటీవలి పరిస్థితి మరింత ఆందోళనకరం. 2025-26లో కేవలం 71 మందికే శిక్షపడగా, 62 మంది నిర్దోషులుగా బయటపడ్డారు. అంటే లోకాయుక్త వలలో చిక్కిన వ్యక్తి కోర్టులో తప్పించుకునే అవకాశాలు దాదాపు సమానంగా ఉన్నాయన్న మాట. ఇది దర్యాప్తు నాణ్యత, సాక్ష్యాల సమర్పణ, కేసుల నిర్వహణలో తీవ్రమైన లోపాలను సూచిస్తోంది. దోషులుగా తేలిన వారి వర్గీకరణను పరిశీలిస్తే అసలు అసమానత స్పష్టమవుతుంది. శిక్షపడిన వారిలో 85 శాతం మంది అత్యల్ప స్థాయి ఉద్యోగులే. రెవెన్యూ శాఖలో 652 కన్విక్షన్లలో 558 మంది పట్వారీలు. పోలీస్ శాఖలో 321 కేసుల్లో 242 మంది కానిస్టేబుళ్లు లేదా హెడ్ కానిస్టేబుళ్లు. విద్యుత్ శాఖలో 194 కేసుల్లో 91 మంది లైన్‌మెన్లు. కానీ ఐఏఎస్, ఐపీఎస్, డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులవాటా ఒక శాతానికీ చేరలేదు. ఇక్కడే వ్యవస్థలోని వర్గ వివక్ష బయటపడుతోంది. చిన్న స్థాయి ఉద్యోగులు శిక్షను ఎదుర్కొంటుంటే, పైస్థాయి అధికారులపై చట్టం ప్రభావం చూపలేకపోతోంది. ఈ అసమానతకు భోపాల్ సమీపంలోని గురాడీ ఘాట్ భూ వ్యవహారం ప్రత్యక్ష ఉదాహరణ. 2022 ఏప్రిల్ 4న ఒకే రోజున, ఒకే రిజిస్టర్డ్ పత్రం ద్వారా మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ, తెలంగాణ కేడర్లకు చెందిన



దాదాపు 50 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు గురాడీ ఘాట్ గ్రామంలో 2.023 హెక్టార్ల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు. ఆ భూమి మార్కెట్ విలువ సుమారు 7.78 కోట్లు కాగా, కొనుగోలు ధర కేవలం 5.50 కోట్లు మాత్రమే. భూమి కొనుగోలు జరిగిన కేవలం 16 నెలలకే, 2023 ఆగస్టులో రాష్ట్ర ప్రభుత్వం 3,200 కోట్ల వ్యయంతో వెస్టర్న్ బైపాస్ ప్రాజెక్టును ఆమోదించింది. ఆశ్చర్యకరంగా ఆ ప్రతిపాదిత రహదారి ఈ భూమికి కేవలం 500 మీటర్ల దూరంలోనే వెళ్లేలా ప్రణాళిక రూపొందింది. ప్రభుత్వ ప్రాజెక్టులపై ముందస్తు సమాచారం లేకుండా ఇలాంటి పెట్టుబడి సాధ్యమా అన్న ప్రశ్న తప్పనిసరిగాతలెత్తుతుంది. అంతటితో ఆగకుండా, 2024 జూన్‌లో అదే భూమిని వ్యవసాయ వినియోగం నుంచి నివాస వినియోగానికి మార్చారు. దీంతో భూమి ధరలు అమాంతం పెరిగాయి. 2022లో చదరపు అడుగు ధర 81.75 ఉండగా, బైపాస్ ప్రకటన తర్వాత 557కు చేరింది. ప్రస్తుతం అది 2,500 నుంచి 3,000 వరకు పెరిగింది. కేవలం నాలుగేళ్ల వ్యవధిలో ఎలాంటి ఉత్పాదక శ్రమ లేకుండా, కేవలం అధికార సమాచారం మరియు విధాన నిర్ణయాల ఆధారంగా 50 నుంచి 60 కోట్ల లాభం ఆర్జించబడింది. ఇంతటి తీవ్ర ఆరోపణలు వెలుగులోకి వచ్చినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం మరింత ఆందోళనకరం. దేశవ్యాప్తంగా చర్చ జరిగినప్పటికీ అధికారిక విచారణ ప్రకటించలేదు. చివరకు 62 మంది మాజీ సివిల్ సర్వెంట్లతో కూడిన ఒక బృందం ముఖ్యమంత్రికి లేఖ రాసి స్వతంత్ర విచారణ జరపాలని డిమాండ్ చేయాల్సి వచ్చింది. ఇది వ్యక్తిగత అవినీతిసమస్య మాత్రమే కాదని, వ్యవస్థాగత అవినీతి రూపమని వారు హెచ్చరించారు. మధ్యప్రదేశ్ మాత్రమే కాదు, తెలంగాణలోనూ ఇదే ధోరణి కనిపిస్తోంది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం భూదాన్ భూముల వ్యవహారంలో ఉన్నతాధికారులు, వారి బంధువులు, బినామీల పేర్లతో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయన్న ఆరోపణలను హైకోర్టు సీరియస్‌గా పరిగణించింది. భూములు, ప్రజా వనరుల కేటాయింపుల్లో సీనియర్ అధికారుల పాత్రపై తరచుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. దిగువ స్థాయి ఉద్యోగులపై విచారణలు వేగంగా సాగుతుంటే, ఉన్నతాధికారుల కేసులు సంవత్సరాల పాటు విచారణలకే పరిమితమవడం ఒకే వ్యవస్థలో రెండు న్యాయాలున్నాయనే భావనను మరింత బలపరుస్తోంది. ఇక్కడ ఒకేవ్యవస్థలో రెండురకాల న్యాయం కనిపిస్తోంది. ఉదా. 500లంచం తీసుకున్న పట్వారీ లోకాయుక్త వలలో పడతాడు. అతని పేరు మీడియాలో వస్తుంది. అతను సస్పెండ్ అవుతాడు, జైలుకు వెళ్తాడు. అదే సమయంలో ప్రభుత్వ రహస్య సమాచారం ఆధారంగా కోట్ల రూపాయల లాభం పొందిన ఉన్నతాధికారులు లేదా ప్రజా భూములను ప్రభావంతో మళ్లించిన అధికార వర్గాలు విచారణకే పరిమితమవుతున్నాయి. చిన్న ఉద్యోగి చేసినది నేరమైతే, పెద్ద అధికారి చేసినది పెట్టుబడిగా మారుతోంది. అవినీతిని నిర్వచించే శక్తి కూడా అధికార వర్గాల చేతుల్లో ఉండటంతో చట్ట సమానత్వం కేవలం నినాదంగా మిగిలిపోతోంది. రాజ్యాంగ నిర్మాత బి. ఆర్. అంబేద్కర్ హెచ్చరించినట్లే, చట్టం ఎంత గొప్పదైనా దాన్ని అమలు చేసే వ్యవస్థ న్యాయబద్ధంగా లేకపోతే సమానత్వం కాగితాలకే పరిమితమవుతుంది. మధ్యప్రదేశ్ లోకాయుక్త గణాంకాలు, గురాడీ ఘాట్ భూ కుంభకోణం, తెలంగాణ భూదాన్ భూముల వివాదాలు కలిసి ఒక అసౌకర్యకరమైన నిజాన్ని చెబుతున్నాయి. ఇది కేవలం అమలు వైఫల్యం కాదు, వ్యవస్థ రూపకల్పనలోనే ఉన్న అసమానత. ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి ఉన్నతాధికారులపై వచ్చిన అవినీతి ఆరోపణలపై స్వతంత్ర విచారణలు జరిపించాలి. లోకాయుక్త, ఏసీబీవంటి సంస్థలకు పూర్తి స్వతంత్రత, పైస్థాయి అధికారులపై కూడా

# ఎస్పీ వీడియో కాన్ఫరెన్స్

గుంటూరు క్రైమ్, జూలై 2,(ప్రభాతవార్త):నిందితులకు కఠిన శిక్షలే లక్ష్యంగా శాస్త్రీయ దర్యాప్తు,పటిష్టమైన ప్రాసిక్యూషన్ నిర్వహించడంతో పాటు,తరచూ నేరాలకు పాల్పడే నిందితులపై పి.ఐ.టి ఎన్.డి.పి.ఎస్ చట్టం అమలు చేయాలి. గంజాయి,ఇతర మాదకద్రవ్యాల (ఎన్.డి.పి.ఎస్) అక్రమ రవాణా,నిల్వ, విక్రయాలు, వినియోగాన్ని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. ఈరోజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గుంటూరు జిల్లా



పోలీస్ కార్యాలయం నుంచి ఈస్ట్,వెస్ట్,సౌత్ సబ్‌డివిజన్ల డీఎస్పీలు,సీఐలు,ఎస్ఐలతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలో నమోదైన గంజాయి,ఎన్‌డిపిఎస్ కేసుల దర్యాప్తు పురోగతి,పెండింగ్ చార్జ్‌షీట్లు, ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఆర్.ఎఫ్.ఎస్.ఎల్) నివేదికలు, కోర్టు విచారణలో ఉన్న కేసుల స్థితిగతులను సమీక్షించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

**దర్యాప్తు,ప్రాసిక్యూషన్ వంటి అంశాలపై ఎస్పీ జారీ చేసిన ఆదేశాలు**

ప్రతి గంజాయి,ఇతర ఎన్.డి.పి.ఎస్ కేసులో శాస్త్రీయ,సాంకేతిక ఆధారాలను పక్కాగా సేకరించి, ఎలాంటి లోపాలకు తావులేకుండా నాణ్యమైన దర్యాప్తు పూర్తి చేయాలి.గంజాయి,ఇతర ఎన్.డి.పి.ఎస్ కేసుల్లో పరారీలో ఉన్న నిందితులను ప్రత్యేక బృందాల ద్వారా గుర్తించి త్వరితగతిన అరెస్ట్ చేయాలి.గంజాయి రవాణాదారులకే పరిమితం కాకుండా సరఫరా చేస్తున్న ప్రధాన సూత్రధారులు,ఫైనాన్షియర్లు,కొనుగోలుదారుల నెట్‌వర్క్‌ను పూర్తిగా ఛేదించే దిశగా దర్యాప్తు విస్తరించాలి.పెండింగ్‌లో ఉన్న గంజాయి,ఎన్‌డిపిఎస్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి,నిర్దేశిత గడువులోపు చార్జ్‌షీట్లు కోర్టులో దాఖలు చేయాలి.ఆర్.ఎఫ్.ఎస్.ఎల్ నివేదికలు త్వరగా అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని,నివేదికలు అందిన వెంటనే వాటిని చార్జ్‌షీట్‌కు జతచేసి కోర్టులో సమర్పించాలి.కోర్టు విచారణలో ఉన్న ఎన్‌డిపిఎస్ కేసులను నిరంతరం పర్యవేక్షిస్తూ,సాక్షులను సకాలంలో హాజరుపరిచి,ప్రాసిక్యూషన్ అధికారులతో సమన్వయంగా పనిచేసి నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలి.తరచూ గంజాయి కేసుల్లో అరెస్టవుతున్న నేరస్థులపై అవసరమైన చోట పి.ఐ.టి ఎన్.డి.పి.ఎస్ యాక్ట్ కింద నిర్బంధ చర్యలు చేపట్టాలి.పాత గంజాయి నేరస్థులపై నిరంతర నిఘా కొనసాగిస్తూ అవసరమైన చోట సస్పెక్ట్ షీట్లు తెరవాలి.గంజాయి,ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి పోలీసు అధికారి,సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని,దర్యాప్తు నుంచి కోర్టు విచారణ వరకు ప్రతి దశలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.సమర్థవంతమైన దర్యాప్తు పటిష్టమైన ప్రాసిక్యూషన్ ద్వారానే నిందితులకు కఠిన శిక్షలు పడతాయని అదే మాదకద్రవ్యాల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుందని ఎస్పీ పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ ఎస్పీలు జి.వి. రమణమూర్తి (అడ్మిన్), ఈస్ట్,వెస్ట్,సౌత్ సబ్‌డివిజన్ల ఇంచార్జి డీఎస్పీలు,సీఐలు,ఎస్ఐలు,ఐటీ కోర్ సీఐ నిసార్ బాషా,డీసీఆర్‌బీ సీఐ ప్రభాకర్,డీసీఆర్‌బీ ఏఎస్ఐ బాలు,ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## సమాజంలో ఆధ్యాత్మిక విలువలు బలోపేతం కావాలి..

### ఎమ్మెల్యే రామాంజనేయులు.

ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), జూలై 2, ప్రభాతవార్త : సమాజంలో ఆధ్యాత్మిక విలువలు బలోపేతం కావాలని ప్రత్తిపాడు శాసనసభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు అన్నారు.మండలంలోని చముళ్ళమూడి గ్రామంలో గురువారం శ్రీ సీతారామస్వామి వారి దేవస్థాన పునఃనిర్మాణ, విగ్రహ ప్రతిష్ఠ, నూతన జీవధ్వజ ప్రతిష్ఠా మహోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రామాంజనేయులు సతీసమేతంగా హాజరై, శ్రీ సీతారామస్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే



మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలపై సీతారాముల వారి కృపాకటాక్షాలు ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని పేర్కొన్నారు. ధర్మం, సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలు మరింత బలోపేతం కావాలని స్వామివారిని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు చెప్పారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, ప్రత్యేక పూజలు, హోమాలు, యాగాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని శ్రీ సీతారాముల వారి ఆశీర్వాదాలను పొందారు. ఈ మహోత్సవంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పిల్లి మాణిక్యరావు, పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, ప్రత్తిపాడు మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ నార్నె బాబు, మండల టిడిపి పార్టీ అధ్యక్షులు మర్రి సాంబశివరావు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు ఎడ్లపల్లి వాణి, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎడ్లపల్లి లెనిన్, క్లస్టర్ ఇన్చార్జులు ఆరికపూడి మురళి జాగర్లమూడి రంగారావు, కూటమి నేతలు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, దేవస్థాన కమిటీ సభ్యులు, మహిళలు, యువత, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పెదవడ్లపూడిలో రూ.4.17 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

మంగళగిరి, జూలై 2, ప్రభాతవార్త: ముఖ్యమంత్రి సహాయనిధి ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తోంది. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వం సహాయం అందించడమే లక్ష్యంగా పనిచేస్తోంది" అని మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ అన్నారు..మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు మొత్తం రూ.4,17,976 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను గురువారం పంపిణీ చేశారు.మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ చేతుల మీదుగా చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక గొప్ప ఆసరాగా నిలుస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పాలనకు పెద్దపీట



వేస్తున్న ప్రభుత్వం, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తోందని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో మంగళగిరి నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ముఖ్యమంత్రి సహాయనిధి అందేలా నిరంతరం కృషి జరుగుతోందని తెలిపారు.ఈ సందర్భంగా వెలగపూడి శివకుమారికి రూ.1,27,581, బట్టిప్రోలు గోపి స్వరమ్మకు రూ.1,12,166, వడ్లపూడి దుర్గకు రూ.65,000, తోకల వెంకటేశ్వర్లుకు రూ.56,545, అన్నే పద్మావతికి రూ.41,684, షేక్ అరిఫాకు రూ.25,000 చొప్పున మొత్తం రూ.4,17,976 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.చెక్కులు అందుకున్న లబ్ధిదారులు మంత్రి నారా లోకేష్, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు....మాదల రమేష్ బాబు, అన్నే చంద్రశేఖర్, చిట్టి బొమ్మ వెంకటేశ్వరరావు, ఊల్లంగి శ్రీనివాసరావు, నడపన దుర్గారావు, కొడవలి ఆనంద్, మినీగ వెంకటేష్,జాలాది సందీప్, కొండపల్లి కిషోర్, షేక్ ఖాసిం, లింగినేని శ్రీనివాసరావు, గుడిమెట్ల ఎల్లయ్య, వాసు ,తదితరులు పాల్గొన్నారు......

# గుంటూరు వార్త

## వైద్యులకు స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బి.సి. రాయ్

### ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ టి. సేవకుమార్..

గుంటూరు మెడికల్ , జూలై 2:( ప్రభాత వార్త): భారత వైద్యులకు డాక్టర్ బి.సి. రాయ్ స్ఫూర్తి ప్రదాత అని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) గుంటూరు శాఖ అధ్యక్షులు డాక్టర్ టి. సేవకుమార్ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఐఎంఏ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో సీనియర్ వైద్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ సేవకుమార్ మాట్లాడుతూ డాక్టర్ బి.సి. రాయ్ వైద్యునిగా, విద్యావేత్తగా,




స్వాతంత్ర్య సమరయోధుడిగా, సంఘసంస్కర్తగా, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. ఆయన జీవితం యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ బి. సాయికృష్ణ మాట్లాడుతూ డాక్టర్ చేబ్రోలు విశ్వేశ్వరరావు, డాక్టర్ పెద్ద శివదేవ ప్రసాద్, డాక్టర్ జి. వేణుగోపాల్, డాక్టర్ తన్నీరు వేణుగోపాలరావు, డాక్టర్ డి. ఉదయ్ కుమార్‌లను సుదీర్ఘకాల వైద్య సేవలకు గుర్తింపుగా సన్మానించినట్లు తెలిపారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ క్రమశిక్షణ, సేవాభావంతో వైద్య వృత్తిని నిర్వహించడం ఎంతో సంతృప్తినిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని ప్రముఖ సర్జన్ డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగా, వైద్యులు డాక్టర్ బి.సి. రాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐఎంఏ గుంటూరు శాఖ పదాధికారులు, సభ్యులు, వైద్యులు, సన్మాన గ్రహీతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.z

## శ్రీ పద్మావతి ఆండాళ్ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం పునర్నిర్మాణం

గుంటూరు విద్య జులై 2 ప్రభాతవార్త : గుంటూరు పట్టణం లాలాపేటలో వేంచేసియున్న శ్రీ పద్మావతి ఆండాళ్ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం పునర్నిర్మాణం సందర్భంగా గురువారం ఉదయం 7.06 నీ. లకు శ్రీశ్రీశ్రీ విశ్వ యోగి విశ్వంజీ మహారాజ్ స్వామివారి స్వహస్తములతో శ్రీ లక్ష్మీ హయగ్రీవ లలితా పీఠం కామవరపు కోట ఏలూరు జిల్లా వాస్తవ్యులు శ్రీ సుదర్శనం రామ దుర్గా కుమారాచార్యులు యాగ్నిక స్వాములు వారిచే శ్రీ స్వామివారి నూతన



ఆలయం నిర్మాణం చేయుటకు శంకుస్థాపన కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా గుంటూరు తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు మహమ్మద్ నజీర్ దేవాలయమునకు విచ్చేసి శ్రీ స్వామి వారి నూతన దేవాలయము శంకుస్థాపన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనియున్నారు తదుపరి శ్రీ స్వామివారి నూతన దేవాలయమునకు విరాళములు అందజేసిన ప్రధాన దాత శ్రీ వీర గంధం వెంకట సుబ్బారావు గారిని మరియు దాతలను సత్కరించి మరియు అభినందించియున్నారు శ్రీ స్వామివారి నూతన ఆలయం నిర్మాణం సుమారు 2 సంవత్సరముల కాలవ్యవధిలో పూర్తి చేయగలవారమని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కార్యనిర్వాహణకారి టి. సుభద్ర దేవస్థానం ఛైర్మన్ మల్లెంపూడి శ్రీనివాసరావు లు తెలిపారు.

### బి ఫార్మశి పరీక్షా ఫలితాలలో హిందూ ఫార్మశీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

గుంటూరు విద్య జూలై 2 ప్రభాతవార్త: స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మశి కళాశాలలోని విద్యార్థులు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విడుదల చేసిన బి.ఫార్మశి రెండవ సంవత్సరం మూడవ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభచూపారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. వి. నాగభూషణం తెలిపారు. మొత్తం 93మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వారిలో 90 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ జూపూడి రంగరాజు ,సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ డాక్టర్ ఎస్. మధుసూదన రావు పాల్గొని పరీక్షల్లో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ పి. సీతారామయ్య,డాక్టర్ ఎ.ప్రత్యూష, అధ్యాపకులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు ప్లస్ టు పాఠశాలల్లో ఉపాధ్యాయుల భర్తీకి కౌన్సిలింగ్

గుంటూరు విద్య జూలై 2 ప్రభాతవార్త : ఉమ్మడి గుంటూరు జిల్లా లో ప్లస్ 2 పాఠశాలల్లో తెలుగు 03, ఇంగ్లీషు 05, లెక్కలు02, ఫిజిక్స్01, కెమిస్ట్రీ03, బోటనీ01, జువాలజీ04, కామర్స్ 01 మొత్తం 20 పోస్టులను భర్తీ చేయుట కొరకు జిల్లా విద్యాశాఖాధికారి వారి కార్యాలయం, గుంటూరు నకు దరఖాస్తు చేసుకున్న స్కూల్ అసిస్టెంట్లు అర్హత నిర్ధారణకై ధృవ పత్రముల పరిశీలన కొరకు శుక్రవారం ఉదయం 12.00 లకు గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి వారి కార్యాలయలయం నందు హాజరు కావాలని డీఈవో తెలిపారు. ధృవ పత్రముల పరిశీలన తర్వాత కౌన్సిలింగ్ జరుపబడును. దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ, బి.యిడి.. లో మెథడాలజీ. పిజీ నందు 50శాతము మార్కులు కలిగి ఉండాలని, వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు సేవా పుస్తకము తీసుకొని రావలెనని, ఈ విషయాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ప్లస్ 2 పాఠశాలల్లో దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు గమనించగలరని, సీనియారిటీ లిస్టు లు ను డీఈవో జి ఎన్ టి డాట్ కామ్ నందు పబ్లిష్ చేయడమైనదని జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు.

## గ్రామీణ అభివృద్ధికి నూతన దిశగా విబి జిఆర్‌ఏఎంజి నిలుస్తుంది..

ప్రతిపాడు, జూలై 2, ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వికసిత్ భారత్ గ్రామ అభియాన్ కార్యక్రమం గ్రామీణాభివృద్ధికి బాసటగా నిలుస్తుందని ప్రతిపాడు ఎమ్మెల్యే, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు పేర్కొన్నారు. ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెం గ్రామంలో గురువారం వికసిత్ భారత్ గ్రామ అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని



గ్రామాభివృద్ధి పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..వికసిత భారత్ – గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ) కార్యక్రమం గ్రామీణాభివృద్ధికి నూతన దిశగా నిలుస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు, గ్రామాల సమగ్రాభివృద్ధే ఈ పథకం ప్రధాన లక్ష్యమని తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. అర్హత కలిగిన ప్రతి గ్రామీణ కుటుంబానికి ఉపాధి భరోసా కల్పిస్తూ, గ్రామాల్లో శాశ్వత ఆస్తుల నిర్మాణం, నీటి సంరక్షణ, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ఈ పథకం దోహదపడుతుందని వివరించారు. అలాగే గ్రామ పంచాయతీలను బలోపేతం చేస్తూ, పారదర్శక పాలనకు సాంకేతికతను వినియోగించడం ఈ పథకంలోని ప్రత్యేకతని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ కేంద్ర ప్రభుత్వంతో సమన్వయంగా పనిచేస్తోందని, గ్రామీణ యువతకు ఉపాధి, మహిళా సంఘాలకు ప్రోత్సాహం, రైతులకు మౌలిక వసతుల కల్పన ద్వారా వికసిత భారత్ 2047 లక్ష్య సాధనలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఏడాదికి 125 రోజులు ఉపాధి హామీ పనులు కల్పించడంతోపాటు గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి కార్యక్రమాల కార్యాచరణ, ప్రణాళికలను రూపొందించి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రతి గ్రామాన్ని స్వావలంబన దిశగా తీసుకెళుతుందని వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు, గ్రామ పంచాయతీ ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, ఉపాధి హామీ కార్మికులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రకృతి వ్యవసాయమే సుస్థిర మార్గం..

ప్రతిపాడు (వట్టిచెరుకూరు), జూలై 2, ప్రభాతవార్త : ప్రకృతి వ్యవసాయమే సుస్థిర మార్గమని, రైతులు దానిని తప్పనిసరిగా ఆచరించాలని మాజీ రాజ్యసభ సభ్యులు, ప్రగతిశీల రైతు సంఘం అధ్యక్షులు ఎలమంచిలి శివాజీ పేర్కొన్నారు. మండలంలోని పుల్లడిగుంట గ్రామం, రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ శివాజీ హాజరై మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం పట్ల వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు కూడా ఆసక్తి చూపుతున్నారని వివరించారు. భవిష్యత్తు వ్యవసాయానికి పీఎండిఎస్,అంతర్ పంటలు మరియు పకృతి వ్యవసాయమే




సుస్థిర మార్గమని తెలియజేశారు. మరో అతిథి జిల్లా పకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ కె.రాజకుమారి మాట్లాడుతూ.. ఒకప్పుడు పేదవారి ఆహారంగా భావించిన సిరిధాన్యాలు నేడు ఆరోగ్యాన్ని కాపాడే ఆహారంగా మారాయన్నారు. ప్రస్తుతం అధికంగా వినియోగిస్తున్న పాలిష్ చేసిన తెల్లబియ్యానికి బదులుగా చిరుధాన్యాలను ఆహారంలో భాగంగా చేసుకోవడం ద్వారా జీవనశైలి వ్యాధుల నుండి రక్షణ పొందవచ్చని, రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యంగా ఉండవచ్చని సూచించారు. రాబోయే పంటల సాగులో పీఎండీస్ మరియు అంతర పంటలు తప్పనిసరిగా సాగు చేయాలని రైతులకు సూచించారు. అంతర పంటలు ప్రధాన పంటలకు ఆశించే హానికర కీటకాల నుండి రక్షించడమే కాకుండా, జీవ వైవిధ్యాన్ని పెంపొందించి సహజ కీటక నియంత్రణకు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రైతునేస్తం ఫౌండేషన్ సీఈఓ సాంబశివరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఆహారం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. ప్రతిరైతు సిరిధాన్యాలు మరియు ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా ఆచరించాలని పిలుపునిచ్చారు. ఏపీసీఎన్ఎఫ్ జిల్లా మోడల్ మేకర్ ఇర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..ప్రకృతి వ్యవసాయం, పీఎండీస్ విత్తనాల విత్తే విధానం మరియు వాటి ప్రయోజనాలపై తన అనుభవాలను రైతులతో పంచుకున్నారు. ప్రకృతి వ్యవసాయ ఆహారం తీసుకోవడం వల్ల తమ కుటుంబ ఆరోగ్యంలో వచ్చిన సానుకూల మార్పులను వివరించారు. అనంతరం రైతులకు పీఎండీస్ కిట్లతో పాటు సజ్జలు, కొర్రలు, మొక్కజొన్న, తదితర అంతర పంటల విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిలుకూరి విజయకుమార్, అన్నామణి, నాగరాజ, ఇంతియాజ్, ఎన్ఎఫ్ఏ ఝాన్సీలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వివిధ మండలాల రైతులు పాల్గొన్నారు.

## స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరీ పంపిణీ

అచ్చంపేట జూలై 2 (ప్రభాత వార్త) : స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అచ్చంపేటలోని ఎంపీపీఎస్ (ఎస్సీ) పాఠశాలలో గురువారం 65 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, కాపీ బుక్స్, స్టేషనరీ సామగ్రిని మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) శ్రీ ఏకుల ప్రసాదరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఏకుల ప్రసాదరావు మాట్లాడుతూ, గత 15 సంవత్సరాలుగా స్నేహహస్తాలు ఫౌండేషన్ అచ్చంపేట మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందిస్తూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విశేషంగా కృషి చేస్తోందని కొనియాడారు. ఫౌండేషన్ అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటకొమ్ముల చిన్న నరసింహారావు, ఉపాధ్యాయులు గనుపల్లి సునీల్ బాబు, రజనీ, జ్యోతి, అమరేశ్వరి, స్నేహహస్తాలు ఫౌండేషన్ కోఆర్డినేటర్ తాయి కరిముల్లా బాబు తదితరులు పాల్గొన్నారు



33 సంవత్సరాలుగా రైతన్నల నమ్మకాన్ని పొందిన ఏకైక ప్రత్తి విత్తన సంస్థ
తులసి సీడ్స్
ISO 9001 : 2015 Certified
సూర్య
ప్రత్తి విత్తనాలు
ప్రత్యేక లక్షణాలు
దోమపోటును తట్టుకునే హైబ్రిడ్
ప్రత్తితీత తేలిక
మరల మరల కాపు కాసే గుణం
అధిక దిగుబడి అధిక లాభం
అకిరా
ప్రత్తి విత్తనాలు






## గ్రామపంచాయతీల్లో విబిజిఆర్ఎంజి చట్టం అమలు

సత్తెనపల్లి, జూలై 2, ప్రభాతవార్త: సత్తెనపల్లి మండల పరిధిలోని 25 గ్రామ పంచాయతీల్లో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ 2005 చట్టంకు బదులుగా విబిజిఆర్ఎంజి 2025 ఈనెల 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చింది. ఇయితే కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఈనెల 2వ తేదీ న మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో గ్రామ పెద్దలు, కూటమి నాయకులు ఈ పథకాన్ని ప్రారంభించారు. అలాగే దేశవ్యాప్తంగా మన రాష్ట్రంలో తిరుపతి జిల్లాలో రైల్వేకోడూరులోని ఒబులవారిపల్లె మండలం ముక్కవారి పల్లె గ్రామంలో సిఎం, డిప్యూటీ సిఎం కేంద్రమంత్రులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో లైవ్ ప్రోగ్రామ్ను రైతు భరోసా కేంద్రాల్లో ,సచివాలయాల్లో టివిల ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో నేతలు పాల్గొన్నారు. నందిగంలో మండల కన్వీనర్ ఆళ్ల అమరేశ్వరరావు, ఛైర్మన్ కొమటినేని శోభారాణి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఫణిదంలో ఎంపిడిఓ పాల్గొన్నారు.



## ఎస్బిఐ ఆధ్వర్యంలో ఘనంగా రక్తదాన శిబిరం: వైద్యులకు, సీనియర్ ఖాతాదారులకు ఘన సన్మానం

సత్తెనపల్లి, జూలై 2, ప్రభాతవార్త: 71వ స్టేట్ బ్యాంక్ డే సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సత్తెనపల్లి మెయిన్ బ్రాంచ్ ఆధ్వర్యంలో, క్లస్టర్ శాఖల సహకారంతో, భారత రెడ్ క్రాస్ సొసైటీ సమన్వయంతో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వైద్యులు డా. శ్రీధర్ రెడ్డి , డా. షకీలా శ్రీధర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సమాజానికి వారు అందిస్తున్న విశిష్ట వైద్య సేవలను గుర్తించి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తరఫున వారిని శాలువాలు కప్పి జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా, బ్యాంకుతో సుదీర్ఘ అనుబంధం కలిగిన 70 సంవత్సరాలు పైబడిన ఐదుగురు సీనియర్ ఖాతాదారులను ఎస్బిఐ సమ్మాన్ సర్టిఫికెట్లు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టి. సాంబ శివరావు , చీఫ్ మేనేజర్, ఎస్బిఐ సత్తెనపల్లి మెయిన్ బ్రాంచ్, రమేష్ బాబు, బ్రాంచ్ మేనేజర్, జీసీ సత్తెనపల్లి శాఖ, ఆనంద రాజు , బ్రాంచ్ మేనేజర్, బజార్ సత్తెనపల్లి శాఖ, భారత రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు చంద్రశేఖర్, బ్యాంకు అధికారులు, సిబ్బంది, ఖాతాదారులు, రెడ్ క్రాస్ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో స్వచ్ఛంద రక్తదాతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సరస్వతి పుత్రులు మంచికంటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, "రక్తదానం మహాదానం. మనం ఇచ్చే కొద్దిపాటి రక్తం మరొకరికి ప్రాణదానంగా మారుతుంది. ప్రతి ఆరోగ్యవంతుడు నిరంతరం స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా సమాజానికి గొప్ప సేవ చేయగలడు" అని పేర్కొన్నారు. రక్తదానం యొక్క విశిష్టత, అవసరం, ఆరోగ్య ప్రయోజనాలను వివరించి ప్రజల్లో అవగాహన కల్పించారు. సామాజిక బాధ్యతలో భాగంగా నిర్వహించిన ఈ రక్తదాన శిబిరం విజయవంతంగా సాగగా, పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సమాజ సేవలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్లప్పుడూ ముందుంటుందని నిర్వాహకులు తెలిపారు.



## లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ ఆధ్వర్యంలో వైద్యులకు ఘనసత్కారం

సత్తెనపల్లి, జూలై 2, ప్రభాతవార్త: 2026.2027 సంవత్సరానికి ఎన్నిక కాబడిన కొత్త కార్యవర్గం ఆధ్వర్యంలో డాక్టర్లను ఘనంగా సన్మాన చేశారు కార్యక్రమంలో డాపి చకీలాశ్రీధర్ ని,డా:కె రాహుల్ రాజ్ ని, డా:కుప్పుమాచార్యులు ని, డా:ఆళ్ల విజయ శారద ని, డా:పమిడి హిమబిందుని, డా:కూకుట్ల బ్రహ్మయ్య ని, గవర్నమెంట్ హాస్పిటల్ గైనకాలజిస్ట్ డా:వైదియన్ సుజాత ని, మిస్ మిసెస్ సాయికృష్ణ హాస్పిటల్ అధినేత డైన డా:సాయికృష్ణని, ఘనంగా సన్మానించటం జరిగింది. ఈ కార్యక్రమంలో నూతన ప్రెసిడెంట్ గా ఎన్నికైన లయన్ పెద్దింటి వెంకటేశ్వర్లు , కార్యదర్శి గా ఎన్నికైన లయన్ ముద్దా రమేష్ బాబు, కోశాధికారి గా ఎన్నికైన డా:కుప్పుమాచార్యులుగారు, జిల్లా 316బి బిత్రిగ్ కో ఆర్డినేటర్ గా ఎన్నికైన కంబాల వెంకటేశ్వరరావు , రీజనల్ ఛైర్మన్ గా ఎన్నికైన లయన్ పొన్నెగంటి కిషోర్ కుమార్ , జోనల్ ఛైర్మన్ గా ఎన్నికైన వీరాంజనేయులు ,సీనియర్ సభ్యులు మంచికంటి వెంకటేశ్వరరావు చిన సాంబయ్య , తవిటి భావన్నారాయణ, మహేశ్వరరావు సీనియర్ సభ్యులు కోట వెంకటేశ్వర్లు లయన్ భాస్కరరావు , లయన్ రాజా పాల్గొన్నారు.



## కోదండరామస్వామి ఆలయ 9వ వార్షికోత్సవ పూజలు

నకరికల్లు,జూలై 2, ప్రభాతవార్త :: మండల కేంద్రమైన నకరికల్లు లోకి కోదండ రామస్వామి ఆలయ 9వ వార్షికోత్సవం ఘనంగా గురువారం నిర్వహించారు. గ్రామంలోని మునుసుబు బజారు నందు గల శ్రీ సీత కోదండరామ స్వామి వారి దేవస్థానం 9 వ వార్షికోత్సవం పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. దేవస్థానం నందు. గణపతి పూజ, హనుమాన్ చాలీసా, హోమం, అభిషేకం, కళ్యాణం అర్చనలు నిర్వహించారు. స్వామి వారి దర్శనానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ప్రసాదాల వితరణతో పాటు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఆవరణలో ప్రత్యేక ఏర్పాట్లను ఏర్పాటు చేశారు.

## గ్రామాల్లో వీబీజీ రామ్‌జీ పనులు ప్రారంభం

కారంపూడి, జూలై 2 ప్రభాతవార్త: మండల పరిధిలోని ఒప్పిచర్ల గ్రామంలో వీబీజీరామ్‌జీ పనులను ఎంపీడీఓ గంటా శ్రీనివాసరెడ్డి గురువారం ప్రారంభించారు. అదేవిధంగా చింతపల్లి, వేపకంపల్లి గ్రామాల్లో పనులు మొదలుపెట్టినట్లు శ్రీనివాసరెడ్డి తెలిపారు. వేపకంపల్లిలో ఎంపీపీ శ్రీనివాసరావు, చింతపల్లిలో రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ సత్యం, మాజీ మండల కన్వీనర్ చప్పిడి వాసు, కారంపూడి పార్టీ ప్రెసిడెంట్ శేషగిరి, సొసైటీ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, బాలకృష్ణ, మస్తాన్‌జానీ, ఎపీఎల్ కృష్ణ, యార్డు డైరెక్టర్ లక్ష్మయ్య, కన్వీనరు సురేష్, ఎంపీటీసీ పూర్ణయ్య, ఉపాధి హామీ సిబ్బంది, ఏపీఓ కట్టా నాగేశ్వరరావు, టీఏ రేఖ, బీఎఫ్‌టీ అంజిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు, శ్రామికులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## అగ్ని ప్రమాద బాధిత మృతదేహాలకు పోస్ట్‌మార్టమ్

..బంధువులకు అప్పగించిన పోలీసులు

యద్దనపూడి, జూలై 2, ప్రభాతవార్త : జాతీయ రహదారి 16వ నెంబరుపై బుధవారం ఉదయం పోటు చేసుకున్న రెండు లారీలు ప్రమాదానికి గురై వెంటనే మంటలు వ్యాపించి అందులోనే ఇరు లారీల డ్రైవర్, క్లీనర్ మృతి చెందిన విషయం విదితమే. ప్రమాదంలో అగ్ని కీలలకు కాలి మాంసపు ముద్దలుగా మారిన ముగ్గురు డ్రైవర్ మేకల రవికుమార్(36), క్లీనర్ రమేష్ (35), డ్రైవర్ ధర్మవతి (26)ల మృత దేహాలను గుంటూరు జీజీహెచ్ పోలీసులు తరలించారు. మృతుల బంధువులకు ఇచ్చిన సమాచారం మేర గురువారం జీజీహెచ్‌లో మృత దేహాలకు పోస్టు మార్టమ్ నిర్వహించి బంధువులకు అప్పగించటం జరిగిందని ప్రతిపాడు ఎస్సై నరహరి తెలిపారు. అదేవిధంగా ప్రమాదంలో కాలిపోయిన వాహనాలను కూడా సంబంధిత వాహన దారులకు అప్పగించామన్నారు.



## శ్రీ సీతా రామాంజనేయ స్వామి వారి ఆలయ పునఃనిర్మాణ శంకుస్థాపన

యద్దపాడు, జూలై 2, ప్రభాతవార్త : యద్దపాడు గ్రామంలోని శ్రీ సీతా రామాంజనేయ స్వామి వారి ఆలయ పునఃనిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం గురువారం ఉదయం 7.08 నిమిషాలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆలయ ప్రాంగణంలో నిర్వహించి అనంతరం శాస్త్రోక్తంగా పండితుల మంత్రోచ్ఛరణ మధ్య శంకుస్థాపన గావించారు. పురాతన దేవాలయం కావటం శిథిలావస్థకు చేరుకోవటంతో గ్రామస్థులు కమిటీగా ఏర్పడి పునఃనిర్మాణానికి నడుంబిగించారు. ఈ కార్యక్రమాలలో గ్రామస్తులు భారీగా తరలి వచ్చి పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.



## గ్రామాభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టండి..అభివృద్ధి పనులు పూర్తి చేయండి

కొల్లిపర,జూలై 2 ప్రభాతవార్త: గ్రామాభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు గ్రామాల్లో చేస్తున్న అభివృద్ధి పనులు నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని ఎంపీడీవో విజయలక్ష్మీ అన్నారు.గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా విజయలక్ష్మీ మాట్లాడుతూ గ్రామాలలో దోమలు నివారణకు మందులు చల్లించి తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం వున్నంగి, అన్నవరం లంక, బొమ్మువానిపాలెం, చివలూరు,దంతలూరు,కుంచవరం గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారు.గ్రామసభలో ప్రజల నుంచి సమస్యలు ఏమైనా ఉంటే తెలపాలని తహశీల్దార్ గుమ్మడి సిద్ధార్థ కోరగా గ్రామస్తులు పలు సమస్యలు ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సిద్ధార్థ మాట్లాడుతూ గ్రామస్తులు తెలిపిన ప్రతి సమస్యను తప్పక పరిష్కరిస్తామన్నారు.సెంపీడీవో విజయలక్ష్మీ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం అవసరమన్నారు.సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్,దానయ్య,పరిపాలనాధికారి కిషోర్‌కుమార్,ఏవో శ్రీనివాసరెడ్డి,ఏపిఎం రమాదేవి,ఎంఈవో యూస్పిలత,హౌసింగ్ ఏఈ పద్మావతి వివిధ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఓటర్ల జాబితా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

-ఆర్డీవో శ్రీరమణి

కొల్లిపర,జూలై 2 ప్రభాతవార్త: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని తెలుపుతూ ఓటర్ల జాబితా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆర్డీవో శ్రీరమణి అన్నారు.గురువారం మండల పరిధిలోని చివలూరు,కొల్లిపర గ్రామాలలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఆమె తనిఖీ చేసారు. మ్యాపింగ్ డిజిటలైజేషన్ పనులు పురోగతిని బూత్ స్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు .ఈ సందర్భంగా శ్రీరమణి మాట్లాడుతూ 2002 ఓటర్ల జాబితాతో సరిపోల్చి మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.ప్రతి ఇంటినీ సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయటంతో పాటు పాత ఓటర్ల జాబితాలో నమోదైన వివరాలతో ఓటరు లేకపోతే వారి కొత్త చిరునామా వివరాలను సేకరించి నమోదు చేయాలని సూచించారు.కార్యక్రమంలో తహశీల్దార్ గుమ్మడి సిద్ధార్థ,ఎంపీడీవో విజయలక్ష్మీ,డిప్యూటీ తహశీల్దార్ రాజేష్,ఆర్ఐ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## తూనికలు..కొలతలుశాఖ మండల గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు

కొల్లిపర,జూలై 2 ప్రభాతవార్త: తూనికలు..కొలతలు శాఖ ఇన్స్పెక్టర్ శేషసాయి తన సిబ్బందితో కలిసి గురువారం మండలంలోని అత్తోట,తూములూరు,దావులూరు,కొల్లిపర తదితర గ్రామాలలో పండ్ల దుకాణాలు..కూరగాయలు..కిరాణాషాపులు..తోపుడు బండ్లను ఆకస్మికంగా దాడులు నిర్వహించారు.ఆ దాడుల్లో 20 దుకాణాలలో తనిఖీ చేసి తమ వెంట తెచ్చుకున్న తూనిక రాళ్లను ఎలక్ట్రానిక్ కాటాలపై ఉంచి పరిశీలించారు.దుకాణాలలో తక్కువ తూకం వచ్చేలా సెట్టింగ్ చేయించుకున్నట్లు నిర్ధారించారు.నాలుగు ముద్రలేని కాటాలను గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్లు శేషసాయి తెలిపారు.తనిఖీలో టెక్నికల్ అసిస్టెంట్ రవికిషోర్ తదితరులు ఉన్నారు.



## శ్రీకార్యసిద్ధి హనుమాన్ ఆలయనిర్మాణానికి పూర్తయిన శంఖుస్థాపన

తెనాలి జూలై2(ప్రభాతవార్త): తెనాలి మండలంలోని పెదరావూరు అవధూత దత్తపీఠం ప్రాంగణంలో, సువిశాలమైన 6ఎకరాల విస్తీర్ణంలో,అరుదైన ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లేందుకు వీలుగా శ్రీ కార్యసిద్ధి హనుమాన్ దేవాలయ నిర్మాణానికి భూమిపూజా కార్యక్రమం వేదపండితుల ఆధ్వర్యంలో విశేషంగా నిర్వహించారు. మైసూరు దత్తపీఠం వ్యవస్థాపకులైన శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి దివ్యాశీస్సులతో, భక్తుల,సూచస్వామ్యంతో, ఎంతో విశిష్టతను చాటుకునేే తీరుగా శ్రీ కార్యసిద్ధి హనుమాన్ ఆలయానికి స్వామి రూపకల్పన చేశారు. ఈక్రమంలో ఆలయ శంఖుస్థాపన పూజలు గురువారం ప్రాతః కాలం నుండి విశేషంగా నిర్వహించారు. మామిళ్లపల్లి మృత్యుంజయ ప్రసాద్, విష్ణుభొట్ల సత్యన్నారాయణ ఘనాపాటి, తదితర వేదగామ పండితులు, వైఖానస పండితుల పర్యవేక్షణలో,విశేష యజ్ఞపూజలతో నిర్వహించిన కార్యక్రమ విశిష్టతను, మైసూరు దత్తపీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద సద్గురు సంకల్ప విశిష్టతను పండితులు మీడియాకు వివరించారు. హనుమాన్ భక్తులు లక్ష హనుమాన్ చాలీసాను ఏక కాలంలో లక్షమంది భక్తులు ఆలపించే విధంగా నాటి కార్యక్రమ నిర్వాహకులైన పుప్పల వరదరాజులు మీడియాతో మాట్లాడుతు 2015లో తెనాలిలో హనుమాన్ చాలీసా సేవకు బీజం వేసింది, శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి వారని, వారు ఆనాడే ఈప్రాంతంలో హనుమాన్ ఆలయ నిర్మాణ సంకల్పం చేశారని, అది ఈనాటికి దాతల సహకారంతో, పెదరావూరు దత్తపీఠం, స్వామి ఆశ్రమంలో, కార్యరూపం దాల్చడం ఈప్రాంత ప్రజల అదృష్టమన్నారు. స్వామి సంకల్పం, భక్తుల ఉడత సాయంతోనే ఆలయం నెలకొల్పబడిందని, ఆలక్ష్యం నెరవేరిందని, నాడు లక్షహనుమాన్ చాలీసాకు తరలి వచ్చిన్నారు, నేడు శ్రీ కార్యసిద్ధి హనుమాన్ ఆలయ నిర్మాణంలో భక్తులందరూ భాగస్వాములే అన్నారు. హనుమాన్ ఆలయం రూపుదిద్దుకుంటే, ఉపాలయాలు అన్నీ పూర్తి చేసుకున్నాక ఈప్రాంతం అరుదైన ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లు తుందని,వరదరాజులు తమ అభిప్రాయాన్ని, స్వామి సంకల్పాన్ని మీడియాతో పంచుకున్నారు. ఈకార్యక్రమంలో పలు ప్రాంతాల దత్తభక్తులు, స్వామిజీ శిష్యులు పాల్గొని తమ ఆనందాన్ని చాటుకున్నారు.



## గ్రామీణ ఉపాధి కల్పన, జీవనోపాధి విస్తరణే లక్ష్యం

నగరం, జూలై 2, ప్రభాతవార్త: గ్రామీణ ఉపాధి కల్పన జీవనోపాధి విస్తరణ లక్ష్యంగా ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్, ఎంపీడీవో బొర్రా శ్రీనివాసరావు తెలిపారు. గురువారం వికసిత్ భారత్ గ్యారెంటీ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉపాధి హామీ పనులు రోజులుగా నిర్ణయించగా ఇప్పుడు వీబీ రాంజీ అనే నూతన పథకం ద్వారా 125 రోజులు కనిపిస్తూ ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయన్నారు. రోజువారి వేతనం 350 గా ఉండగా దానిని నూతన పథకంలో 311 రూపాయలుగా పెంచి పేదలకు కేంద్ర శుభ ఉత్సవాలు సహకారాలు అందిస్తున్నా యని తెలియజేశారు. ఈ పథకం ద్వారా రైతు కూలీల సంక్షేమ ఉపాధి అవకాశాల ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వివారపు వీరయ్య, జడ్పీటీసీ శివరామకృష్ణ, నగరం జెడ్పీటీసీ సభ్యులు మాన్యం నాగలక్ష్మి, కూటమి ప్రభుత్వం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## తెనాలి చినరావూరు పార్కులో సైకిల్ పార్కింగ్ దోపిడీ: టిక్కెట్ లేకుండా వసూళ్ళు.... సైకిళ్ల మాయం

తెనాలి, జూలై 2(ప్రభాతవార్త): తెనాలి పట్టణం లోని చినరావూరులో ఉన్న అన్నాబత్తుని సత్యనారాయణ పార్కుకు సందర్శకుడు వచ్చే ప్రజల నుండి సైకిల్ పార్కింగ్ పేరుతో అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పార్కింగ్ స్థలంలో ఎలాంటి అధికారిక రసీదు, టిక్కెట్ ఇవ్వకుండానే కొందరు వ్యక్తులు సొమ్ము వసూలు చేస్తున్నారని సందర్శకులు వాపోతున్నారు.అంతేకాకుండా పార్కింగ్ లో పెట్టిన సైకిళ్లు కూడా తరచూ మాయమవుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సైకిల్ కనిపించకపోవడంతో పార్కు సిబ్బందిని ప్రశ్నిస్తే "మాకు సంబంధం లేదు, మాకు తెలియదు" అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. పార్కుకు వచ్చే చిన్నపిల్లలు, విద్యార్థులు ఎక్కువగా సైకిళ్లపై వస్తుంటారు. టిక్కెట్ లేకుండా డబ్బు వసూలు చేయడం, ఆపై సైకిల్ పోతే బాధ్యత లేదనడం సరికాదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు, పార్కు నిర్వాహకులు స్పందించి పార్కింగ్ ప్రాంతంలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సైకిళ్ల భద్రతకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అధికారిక పార్కింగ్ ఫీజు ఉంటే బోర్డు ఏర్పాటు చేసి, రసీదులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.



## అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలి

గుంటూరు విద్య జూలై 2 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ సర్వీసు అసోసియేషన్ నాయకులు గుంటూరు ప్రాంతీయ సంచాలకులు నాగరాజు ని కలిసి జీవోల గౌరవ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం అర్హులైన వారికి గుంటూరు జోన్ పరిధిలోని జూనియర్ అసిస్టెంట్ లకు సీనియర్ సహాయకులుగా, ఎం పి హెచ్ ఏ ఫీమేల్ వారికి హెల్త్ సూపర్ వైజర్ లు గా హెల్త్ విజిటర్స్ గా , స్టాఫ్ నర్సులను హెడ్ నర్సులు గా హెడ్ నర్సులు లను గ్రేడ్ 2 నర్సింగ్ పర్యవేక్షకులుగా పదోన్నతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ సర్వీసు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్ బాష కోరారు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు రెహమాన్ మాట్లాడుతూ త్వరగా ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడంవలన ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా కార్యదర్శి రాఘవరెడ్డి, ఉపాధ్యక్షులు డి.రాజు, జిల్లా కోశాధికారి రాజు , సంయుక్త కార్యదర్శి కోటయ్య, నగర శాఖ అధ్యక్షులు భాను , ఉపాధ్యక్షులు షేక్ అన్వర్ బాషా, నగర శాఖ ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు



## 4న ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాల 38వ అవుట్ గోయింగ్ బ్యాచ్ 11వ అటానమస్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

గుంటూరు విద్య జూలై 2 ప్రభాతవార్త : తమ కళాశాల 38 వ అవుట్ గోయింగ్ బ్యాచ్ మరియు 11 వ అటానమస్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఈ నెల 4 న, కళాశాలలో ఘనంగా నిర్వహించనున్నట్లు కళాశాల అధ్యక్షులు డా.రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీ జాగర్లమూడి మురళీమోహన్, డా.జగదీష్ కె. మద్దినేని ది.02072026 న గురువారం నాడు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఒడిశా రాష్ట్ర గవర్నర్ డా.కంభంపాటి హరిబాబు గారు మరియు గౌరవ అతిథిగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధర రావు గారు పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. 2022 26 సంవత్సర 38 వ అవుట్ గోయింగ్ బ్యాచ్ విద్యార్థులలో సివిల్, కెమికల్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ బిజినెస్ సిస్టమ్, కంప్యూటర్ సైన్స్ (డేటా సైన్స్), కంప్యూటర్ సైన్స్(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్), కంప్యూటర్ సైన్స్ (ఇంటర్నెట్ ఆఫ్ థింకింగ్), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాల్లో డిగ్రీ పూర్తి చేసుకున్న 1,256 మంది విద్యార్థులకు ఇంజనీరింగ్ డిగ్రీ పట్టాలను, మరియు 179 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు పి.జి పట్టాలను పొందనున్నారని వారు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు 13 బంగారు పతకాలను ఈ వేడుకల్లో పాల్గొనున్న ముఖ్య అతిథి మరియు గౌరవ అతిథి చేతుల మీదుగా అందించనున్నారని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ శ్రీ రాయపాటి గోపాల కృష్ణ, కళాశాల ట్రెజరర్ డా.కొండబోలు కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.కొల్లా శ్రీనివాస్, కళాశాల అకడమిక్ అండ్ ఆర్ డి డైరెక్టర్ డా.కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డా.ఎన్.వి. శ్రీనివాస రావు తదితరులు కలరు.



## జి జి హెచ్ లో సమస్యలు పరిష్కరించాలి

రాష్ట్రీయ మహాజన సమితి రాష్ట్ర అధ్యక్షులు కంభం ఆనందకుమార్

గుంటూరు విద్య జూలై 1 ప్రభాతవార్త : రాష్ట్రీయ మహాజన సమితి అధ్యక్షులైన కంభం.ఆనంద్ కుమార్ గుంటూరు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరిన్ టెన్ డెంట్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డా., దుర్గా ప్రసాద్ ని కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తూ హాస్పిటల్ లో నెలకొని అనేక సమస్యల గురించి మెమొరాండమ్ సమర్పించామని కంభం ఆనందకుమార్ తెలిపారు. అందులో ప్రధానంగా అనేక జిల్లాల నుండి మరియు సుదూర ప్రాంతాల నుండి వైద్య చికిత్స కోసం వస్తున్న నిరుపేదలైన వివిధ జబ్బులతో బాధపడుతున్న రోగులు, వారికి సేవ చేయటానికి వస్తున్న బంధువులైన వారి సహాయకులు ఎండకు ఎండుతు, వానకు తడుస్తు, చలికి వణుకుతు, దోమకాటులవలన రోగులతో పాటు వీరు కూడా రోగాల బారిన పడుతున్నారని పేర్కొంటూ ఆయా సమస్యలను సూపర్ డెంటెంట్ దృష్టికి తీసుకువచ్చారు. మానవతా దృక్పధంతో,కనీస సౌకర్యాలతో కూడిన షెల్టర్ లను ఏర్పాటు చేయవలసినదిగా కోరుతూ విజ్ఞప్తి చేయగా, తక్షణమే షెల్టర్ లను ఏర్పాటు చేయిస్తానని గుంటూరు జి జి హెచ్ సూపర్డెంట్ డా.,దుర్గా ప్రసాద్ హామీ ఇచ్చారని కంభం ఆనంద్ కుమార్ పేర్కొన్నారు.



## జీఎస్టీ ప్రజలపై భారం కాదు

సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ అరుణ్ రిచర్డ్

గుంటూరు విద్య జూలై 2 ప్రభాతవార్త: జీఎస్టీ అనేది ప్రజలపై భారం కాదని, అది మన సామాజిక భవిష్యత్ కోసం చేసే పెట్టుబడి అని సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ అరుణ్ రిచర్డ్ అన్నారు. మంగళవారం రింగ్ రోడ్డు లోని శుభం కన్వెన్షన్ హాలు లో జరిగిన తొమ్మిదవ జీఎస్టీ దినోత్సవ వేడుకలో ఆయన ముఖ్య అతిథి గా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కమిషనర్ అరుణ్ రిచర్డ్ మాట్లాడుతూ... ప్రతి పన్ను చెల్లింపు దేశ మౌలిక సదుపాయాలు, వైద్యం, విద్య మరియు ప్రభుత్వ సేవల మెరుగుదలకు దోహద పడుతుందని తెలిపారు. పన్ను చెల్లింపుదారులకు మెరుగైన సేవలందించడం, వారి సమస్యల పరిష్కారం, స్వచ్ఛందంగా పన్ను చెల్లింపుదారులను ప్రోత్సహించడం మరియు వ్యాపార అభివృద్ధికి తోడ్పడేలా సాంకేతికను వినియోగించుకోవడంలో గుంటూరు కమిషనరేట్ జీఎస్టీ బృందం నిరంతరం కృషి చేస్తుందని వివరించారు. ఖి సుగమ కర్ వ్యవస్థ, సశక్త భరత్ ఖి ( సరళమైన పన్ను వ్యవస్థ, శక్తివంతమైన భారతం ) అనే ఇతివృత్తం తో ఈ ఏడాది జీఎస్టీ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. పన్ను చెల్లింపుదారులకు పారదర్శకమైన, సాంకేతికత తో కూడిన అనుకూలమైన పన్ను పరిపాలన అందించాలనే ప్రభుత్వ నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుందన్నారు. భారతదేశపు అత్యంత పరివర్తనాత్మక ఆర్థిక సంస్కరణలలో ఒకటిగా జీఎస్టీ ఎల్లప్పుడూ ఆధారణ గా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షులు భాస్కరరెడ్డి వేమిరెడ్డి, విజయవాడ కస్టమ్స్ ప్రివెంటివ్ కమిషనర్ ఎస్. కె. రామన్, గుంటూరు రైల్వే డివిజన్ మేనేజర్ సుదేష్ట సేన్, సెంట్రల్ జీఎస్టీ అప్పీల్ కమిషనర్ దేవేష్ గుప్తా, సీనియర్ అధికారులు, సిబ్బంది, వాణిజ్య మరియు పారిశ్రామిక ప్రతినిధులు, పన్ను నిపుణులు, ఇతర వాటాదారులు పాల్గొన్నారు. సరళమైన, పారదర్శకమైన మరియు సమర్థవంతమైన జీఎస్టీ వ్యవస్థ ద్వారా ఖి వికసిత్ భారత్ ఖి లక్ష్య సాధనకు తమ వంతు కృషి చేస్తామని వారు పునరుద్ఘాటించారు.



## ఏపీ ఈఏపీ సెట్ 2026లో సత్తా చాటిన భాష్యం విద్యార్థులు

..స్టేట్ టాప్ టెన్ లో 6 ర్యాంకులు కైవసం చేసుకున్న భాష్యం..


గుంటూరు విద్య జూలై 2(ప్రభాతవార్త: ఏపీ ఈఏపీ సెట్ 2026 ఫలితాలలో భాష్యం విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్, రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ తెలిపారు. బుధవారం విడుదలైన ఫలితాలలో వి.ప్రవీణ్ కుమార్ రెడ్డి స్టేట్ 3వ ర్యాంకు, టి.దుర్గానుప్రభాత్ స్టేట్ 4వ ర్యాంకు, బి.ధాత్రిక స్టేట్ 5వ ర్యాంకు, వి.ధీరజ్ కృష్ణ స్టేట్ 7వ ర్యాంకు, నూర్ బాషా హాఫీజ్ స్టేట్ 8వ ర్యాంకు, ఎ.ఎస్.ఎస్.సాయినిఖిలారెడ్డి స్టేట్ 9వ ర్యాంకు వంటి 10లోపు 6 స్టేట్ ర్యాంకులు, 100లోపు 18 ర్యాంకులతో భాష్యం ది బెస్ట్ అని నిరూపించారని రామకృష్ణ పేర్కొన్నారు. స్టేట్ టాప్ టెన్ లో భాష్యం విద్యార్థులు 6 ర్యాంకులను కైవసం చేసుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. భాష్యం ఐఐటి జేఈఈ అకాడమీ, మెడెక్స్ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులతో తిరుగులేని ఫలితాలు సాధించారన్నారు. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో కూడా భాష్యం విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయి ఈఏపీ సెట్ లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ ఛైర్మన్ హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్ రామ్ లు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.



## ఉద్యోగులకు, విశ్రాంతి ఉద్యోగుల కు ఈ హెచ్ ఎస్ ప్రత్యేక సదుపాయాలు కల్పించండి..

గుంటూరు విద్య జూలై 1 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ సర్వీసు అసోసియేషన్ గుంటూరు జిల్లా సభ్యులు గుంటూరు ప్రభుత్వ సమగ్ర హాస్పిటల్ లో సూపర్ డెంట్ గా విధుల్లో చేరిన డాక్టర్ జి. దుర్గా ప్రసాద్ ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ..ఆ తర్వాత ఉద్యోగ, ఉపాధ్యాయ విశ్రాంతి ఉద్యోగుల కు గుంటూరు ప్రభుత్వ సమగ్ర హాస్పిటల్ లో ఎంప్లాయిస్ హెల్త్ స్కీం కింద ప్రత్యేక సదుపాయాలతో , వైద్యం, అందించాలని , అలాగే ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి వార్డులో సూపర్ స్పెషాలిటీ సేవలు ఉద్యోగులకు అందించేలా కృషి చేయాలని కోరారు కొత్తగా విధుల్లో చేరిన సూపర్ డెంట్ డాక్టర్ జి.. దుర్గా ప్రసాద్ ని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ సర్వీసు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్ బాష, కోరారు..

## అవాంఛిత రోమాలు తొలగించాలంటే..



ఈ మధ్య అమ్మాయిల్లో పై పెదవి పైన, గడ్డం దగ్గర, సైడ్‌లాక్స్ దగ్గర అవాంఛిత రోమాలు రావడం ఎక్కువైంది. దీన్ని హిరునసటిజం అంటారు. ఇది ఉన్నవారిలో పురుషులకు ఎక్కడ వెంట్రుకలు వస్తాయో మహిళలకు కూడా అదే ప్రాంతంలో ఒత్తుగా వెంట్రుకలు వస్తుంటాయి. చాలామందిలో పిసిఓఎస్ కారణంగా ఈ సమస్య వస్తుంటుంది. ఇక మరికొంత మందికి ఎలాంటి హార్మోన్ల సమస్య లేకపోయినా పైపెదవి పైన, గడ్డం దగ్గర వెంట్రుకలు వస్తుంటాయి. ఇది వంశపారంపర్యంగా వస్తుంటుంది. దీనిని హైపర్‌ట్రైకోసిస్ అంటారు. హిర్సుటిజం సమస్య ఉన్నప్పుడు దానికి గల కారణాన్ని తెలుసుకోవాలి. ఇందుకోసం కొన్ని పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. ఏదైనా సమస్య ఉంటే మొదట అందుకు తగిన చికిత్స తీసుకుని ఆ తర్వాత వెంట్రుకల పెరుగుదలను ఆపడానికి ప్రయత్నించవచ్చు. ఒకవేళ అప్పటికే వెంట్రుకలు ఒత్తుగా పెరిగి ఉంటే వాటిని తొలగించడానికి పర్మనెంట్ హెయిర్ లేజర్ రిడక్షన్ ట్రీట్‌మెంట్ చేస్తుంటారు. అయితే లేజర్ ట్రీట్‌మెంట్‌లోనూ పలు రకాలుంటాయి. ఇందులో ట్రిపుల్ వేవ్‌లెంగ్త్ లేజర్‌ని ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. ఇది వివిధ దశల్లో ఉన్న హెయిర్ ఫాలికల్స్‌ని కంట్రోల్ చేస్తుంది. ఈ ట్రీట్‌మెంట్‌ని నెలకోసారి చేయించుకోవాల్సి ఉంటుంది. సాధారణంగా ఆరు నుంచి ఎనిమిది సెషన్లలో అవాంఛిత రోమాల సమస్య తగ్గిపోతుంది. అయితే పిసిఓఎస్, హార్మోన్ల అసమతుల్యత ఉన్నవారికి ఎక్కువ సెషన్లు తీసుకోవాల్సి వస్తుంది. అవాంఛిత రోమాలకు గల అసలు సమస్యను తెలుసుకుంటే సెషన్ల సంఖ్యను తగ్గించుకునే అవకాశం ఉంటుంది. కాబట్టి మీ సమస్యను గుర్తించి, ఆ తర్వాత సరైన సద్ధతిలో హెయిర్ లేజర్ చేయించుకుంటే మంచి ఫలితం ఉంటుంది. □

## బ్యూటీకి సూత్రాలు

ప్రతి వారు అందంగా కనిపించాలని తాపత్రయపడుతుంటారు. అందంగా వుండాలని కోరికవుంటే సరిపోదు అందనికి అవసరమైన ఆచరించదగిన సూత్రాలను ఖచ్చితంగా పాటించాలి. ★ అందంగా కనిపించాను కునేవారు నిద్రవిషయంలో అత్యంత జాగ్రత్త వహించాలి. పగలు ఎక్కువగా నిద్రించకూడదు. గృహిణులు అరగంట నిద్రపోతే అలసట పోయి ఫ్రెష్‌గా కనిపిస్తారు. ★. వయసునుబట్టి పేస్‌ప్యాక్ ఉపయోగించడం అలవాటు చేసుకోండి. తలారా స్నానం చేయడానికి ముందుగ అయిల్‌బాగా మసాజ్ చేసుకోవాలి. □

## పిల్లలు ఎత్తు పెరగడం లేదా ?



తమ పిల్లలు ఎత్తుగా ఉండాలి.. ఎత్తుకు తగ్గ బరువుండాలి. అని తల్లిదండ్రులు కోరుకోవడం సహజం. అయితే కొంతమంది చిన్నారుల్లో పెరుగుదల మందకొడిగా సాగడం, ఒక వయసొచ్చాక ఆగిపోవడం వల్ల సరైన ఎత్తు పెరగక పొట్టిగా కనిపిస్తుంటారు. తల్లిదండ్రుల జీన్స్ ఒక్కటే దీనికి కారణం అనుకుంటే పొరపాటే! ఎందుకంటే పోషకాహార లోపం, శరీరానికి సరైన వ్యాయామం లేకపోవడం, వారుండే వాతావరణం. వంటివీ చిన్నారుల ఎత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలోనే పిల్లలు ఎత్తు పెరగడానికి కొన్ని వ్యాయామాలు దోహదం చేస్తాయంటున్నారు. మరి, ఏంటా వర్కవుట్లు? తెలుసుకుందాం..

**స్ట్రెచింగ్ వ్యాయామాలు ...** స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయడానికి సులభంగా ఉండడంతో పాటు, పిల్లలు ఎత్తు పెరగడానికి ఎంతో ప్రభావవంతంగా పని చేస్తాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో నిటారుగా నిల్చొని కిందికి వంగుతూ కాలి వేళ్లను అందుకోవడం, కాళ్లు ముందుకు చాపి కూర్చొని చేతి వేళ్లతో కాళ్లను అందుకోవడం, శరీర పైభాగాన్ని ఇరువైపులా వంచుతూ చేసే వ్యాయామాలు.. ఇలాంట వర్కవుట్లు వెన్నెముకకు ఫ్లెక్సిబులిటీని అందిస్తాయి. అది సులభంగా సాగేలా చేస్తాయి. ఫలితంగా వయసు పెరిగే కొద్దీ ఎత్తు పెరగడం సులువవుతుంది.

**వేలాడితే మంచిదే!...** పిల్లల ఎత్తు పెరగడానికి చాలామంది నిపుణులు సూచించే వ్యాయామాలివి. బార్ హ్యాంగింగ్స్, హ్యాంగింగ్‌రాడ్, పులప్స్, చిన్–అప్స్.. వంటి ఎక్సర్‌సైజెస్ వెన్నెముకను సులభంగా సాగేలా చేస్తాయి. తద్వారా వయసు పెరిగే కొద్దీ ఎత్తు పెరగచ్చు. అలాగే ఈ వ్యాయామాలు వెన్ను, భుజాల కండరాలకు దృఢత్వాన్ని అందించి ఫిట్‌గా మార్చుతాయి.

**యోగాసనాలతో...** కొన్ని రకాల యోగాసనాలు శారీరక దృఢత్వాన్ని పెంచడమే కాదు.. పిల్లలు ఎత్తు పెరగడానికీ దోహదం చేస్తాయంటున్నారు నిపుణులు. సూర్య నమస్కారాలు చేయడం వల్ల శరీరమంతటికీ చక్కటి వ్యాయామం అందుతుంది. అలాగే భుజాలు, వీపు, కాళ్లలోని కండరాలను బలంగా మార్చి సులభంగా సాగేలా చేస్తుంది. ఇక చక్రాసనం వల్లభుజాలు, పాదాలపై ఒత్తిడి పడుతుంది. తద్వారా అక్కడి కండరాలు దృఢమవడంతో పాటు సాగుతాయి. ఫలితంగా ఎత్తు పెరిగే ప్రక్రియ వేగవంతమవుతుంది.

**స్కిప్పింగ్-స్విమ్మింగ్...** స్కిప్పింగ్ ఆడడమంటే ఆడపిల్లలకు భలే సరదా. ఎంతో సరదాగా చేసే ఈ వ్యాయామం వారి శరీరానికి దృఢత్వాన్ని అందించడమే కాదు.. గుండె ఆరోగ్యాన్ని సైతం మెరుగుపరుస్తుంది. అలాగే ఈ వర్కవుట్‌లో భాగంగా ఎగిరి దూకే క్రమంలో వెన్నెముక, భుజాలు, కాళ్లలోని కండరాలు ఫ్లెక్సిబుల్‌గా మారతాయి. సులభంగా సాగేలా తయారవుతాయి. ఫలితంగా వయసు పెరిగే కొద్దీ ఎత్తు పెరగడం ఈజీ అవుతుంది. ఇక ఈత కొట్టే క్రమంలో కూడా శరీరాన్ని ముందుకు సాగదీస్తాం. తద్వారా వెన్నెముకకు చక్కటి వ్యాయామం అందుతుంది. ఇది కూడా ఎత్తు పెరిగేందుకు సహాయపడుతుంది.

మన శరీరంలో హెచ్‌జిహెచ్ అనే పెరుగుదల ప్రేరేపించే హార్మోన్ ఉంటుంది. ఇది పిల్లల్లో నిద్ర పోయినప్పుడు మాత్రమే విడుదల వుతుందట! అందుకే చిన్నారులు ఎంత చక్కగా నిద్రపోతే అంతగా పెరుగుతారంటారు. విటమిన్ 'డి' సైతం చిన్నారులు ఎత్తు పెరిగేందుకు పేరేపిస్తుందంటున్నారు నిపుణులు. ఇది కండరాలు, ఎముకల సామర్థ్యం పెరిగేలా చేసి.. పరోక్షంగా ఎత్తు పెరగడానికి సహకరిస్తుంది. ఇందుకోసం రోజూ కాసేపు ఎండలో నిలబడడం.. చేపలు పుట్టగొడగులు, గుడ్లు.. వంటి విటమిన్ 'డి' అధికంగా ఉండే ఆహార పదార్థాలు వారి డైట్‌లో భాగం చేయడం మంచిది. పిల్లలకు అందించే ఆహారంలో ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్లు.. ఇలా అన్ని పోషకాలు ఉండేలా చూసుకోవాలి. ఇందుకోసం సీజనల్ పండ్లు అన్ని రకాల కాయకూరలు దుంపలు ఆకుకూరలు వంటివన్నీ వీరి ఆహారంలో చేర్చాలి. □

## దానాలు ఫలించాలంటే..

దానం ఓ మహోత్తర కార్యం. నువ్వు ఏ దానం అయినా చేయి కాని కుటుంబ అవసరాలు, నీ జీవితానికి సంబంధించినవి తీర్చుకుని దానం చేయి. అలా కాకుండ కొంత మంది మాకు దానం చేస్తే పుణ్యం వస్తుంది. మేము స్వర్గ సుఖాలు పొంద వచ్చని మూఢంగా దానాలు చేస్తుంటారు. కుటుంబంలో కొడుకులు కావొచ్చు. కూతుర్లు కావొచ్చు వాళ్ల అవసరలకు కొంత మంది, వాళ్లు అనారోగ్యంగా ఉన్నా ఖర్చు పెట్టరు. వేలకు, వేలు వివిధ సంస్థలకు డబ్బు దానం చేస్తుంటారు. అది వారి సొంత డబ్బు అయినా ఎంతో కొంత కుటుంబ అవసరాలకు ఉంచుకుని దానం చేస్తే బాగుంటుంది. ఇది కొంత మందికి నచ్చదు. అందుకే హతమార్చడం చేస్తు న్నారు. ఉదాహరణకు ఓ ముదుసలికి నెల, నెల ప్రభుత్వ పింఛను వస్తుంది. ఆవిడను కొడుకు,కోడలు తరిమివేశారు. కూతురు ఇంటికి వచ్చినా ఆమె చేసే దానాలకు అంతులేదు కూతురు అనారోగ్యంగా ఉన్నా, ఏమి పట్టనట్లుగా డబ్బు దానం చేస్తుడటం ఆమె మూర్ఖత్వం. అట్టి దానాలు ఎప్పటికి ఫలించవు. వీళ్లేమో మేము దానాలు చేశాం మాకు పుణ్యం వస్తుంది అనుకుంటారు. నిజానికి వారు పాపం మూట గట్టుకుంటారు. మా డబ్బు పేదలకు చేరుతుంది కదా అనుకుంటారు. కానీ నీకు అన్ని సమాకూర్చే నీ వాళ్లకు నీవు ఏమి ఖర్చు పెట్టవు. నేను అంత చేశాను, ఇంత చేశాను అని వాళ్లకు మనసులో ఉండొచ్చు కాని ఏవి నీకు మంచి జరగదు. అవసాన దశలో నీవు నీ కుటుంబ సభ్యులు, వాళ్ళ రోగాలకు డబ్బు ఖర్చు పెడితే అదే నీకు పుణ్యం. నువ్వు చేసేది దానం అయినా, ఆ దానంలో నీ వాళ్లు కూడ ఉన్నారు. నీ వాళ్లకు ఖర్చు పెడితే ఆ పనులకు పెట్టినట్లే. ఇప్పటికైనా ఎవరైనా డబ్బు దానం చేయాలిసివస్తే ముందు కుటుంబ అవసరాలు, తర్వాత దానలు చేస్తే అనంత ఫలితం వస్తుంది. భగవంతుడు కూడ వున్న దానిలో కొంచెం నాకు ఇస్తే నీకు పుణ్యం కలుగుతుంది అని మన పురాణ గ్రంధాలలో, వివిధ మత నగ్రంధాలలో కూడ ఉంది. మొత్తానికి వున్న దానిలో దానంచేస్తే కలిగే ప్రయోజనాలు ఎన్నో. □



## చేతులు మండుతున్నాయా?

వంటన్నాక ప్రతి దానిలో పచ్చి మిర్చిని తప్పక వడుతుంటాం. కొంతమందికి వీటిని కోస్తే చేతులు మండుతాయి. దీనికి కారణం మిర్చిలో ఉండే క్యాప్సైసిన్ అనే రసాయం. ఈచిట్కాలు పాటించడంతో ఉపశమన పొందవచ్చు.

✦ పచ్చిమిరపకాయలు కోసిన వెంటనే టొమాటోలను కోయడమో లేదా ఆ గుజ్జుతో చేతులను శుభ్రం చేసుకుంటేనో మంట తగ్గుతుంది. మరీ ఎక్కువ మంట అనిపస్తే చపాతీపిండి లేదా పూరీపిండిని కలపడంతో ఉపశమనం కలుగుతుంది. ✦. నిమ్మరసంలో విటమిన్–సి, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉండి మంటను తగ్గస్తాయి. పచ్చిమిర్చి కోస్తే సమస్య ఉన్నవారు నిమ్మచెక్క రసంతో చేతులను రుద్ది కడిగితే యాంటీసెప్టిక్ పనిచేసి మంటను తగ్గిస్తాయి. చేతులూ ఎర్రబడవు. ✦ పచ్చిమిర్చిని కోసిన తరవాత ఐస్‌క్యూబ్స్‌తో కాసేపు చేతులను రుద్దాలి. లేదా కలబంద గుజ్జు రాసినా, చక్కెరతో చేతులను కడిగినా ఉపశమనం లభిస్తుంది. □



## నూనె పీల్చని జొన్న మురుకులు

మురుకులు ఎంతో మంది ఎన్నోరకాలుగా చేస్తారు. బియ్యప్పిండి, మినప్పిండి, పెసర పిండి.. ఇలా చాలా వైరైటీలు ఉన్నాయి. వేటికవే బాగుంటాయి. జొన్నపిండి ఇంకా మంచిది కదా చాలా సులువు కూడా. ఎలా చేయలంటే జొన్న పిండిలో నువ్వులు, వేరుశనగ పొడి, వాము, పచ్చిమిర్చి ముద్ద, ఉప్పు, రెండు చెంచాల వెన్న వేసి.. కొన్ని నీళ్లతో పిండి కలిపి..కాగుతున్న నూనెలో మురుకులు ఒత్తుకోవాలి. ఇవి రుచిగా ఉంటాయి. నూనె కూడా ఎక్కువ పీల్చవు. మూడు కప్పుల జొన్నపిండికి అర కప్పు నువ్వులు, ఒక కప్పు వేరుశనగగుళ్లు, ఒక టేబుల్ స్పూన్ వాము, మూడు పచ్చిమిర్చి అవసరమౌతాయి. వేరుశనగ గుళ్లను వేయించి పొట్టు తీసి, గ్రైండ్ చేయాలి. పిల్లలు చిప్స్ లాంటి స్నాక్స్ తింటే వాటిల్లో ఉండే ప్రిజర్వేటివ్స్ వల్ల జబ్బులపాలవుతారు. ఇలాంటి చిరుతిళ్లు పెడితే ఆరోగ్యంగా, పుష్టిగా ఉంటారు. ముఖ్యంగా డయాబెటిస్‌తో బాధపడేవారికి ఇవెంతో ఉపశమనం కలిగిస్తాయి. పిల్లలు ఇంకా కావాలంటూ ఇష్టంగా తింటారు.. ఈ జొన్నమురుకులు మీరూ ఒకసారి చేసి చూడండి. □

# తెర

## మైత్రీ మూవీ మేకర్స్ 4వ తమిళ చిత్రం పూజా కార్యక్రమం ప్రారంభం



ప్రముఖ పాన్‌ఇండియా నిర్మాణ సంస్థ ఖిమైత్రీ మూవీ మేకర్స్‌ఖి కేవలం తెలుగు పరిశ్రమకే పరిమితం కాకుండా ఇతర భాషల్లోనూ భారీ చిత్రాలను నిర్మిస్తోంది. ఈ క్రమంలో వారి నాలుగవ తమిళ చిత్రాన్ని ప్రకటించారు. ధృవ్ విక్రమ్ హీరోగా నటిస్తున్న నాలుగవ చిత్రం కావడం విశేషం. పూర్తి స్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ చిత్రానికి కరణ్ అరవింద్ కుమార్ దర్శకత్వం వహించనున్నారు. చెన్నైలోని ఎంఆర్‌సి నగర్ మైత్రీ ఆఫీస్ లో జరిగిన పూజా కార్యక్రమంతో MythriTamil04 DV4 ప్రాజెక్ట్ అధికారికంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి చిత్ర బృందం, పలువురు ప్రముఖ అతిథులు హాజరయ్యారు. ధృవ్ విక్రమ్, దర్శకుడు కరణ్ అరవింద్ కుమార్, చిత్ర బృందంతో కలిసి ఈ శుభకార్యంలో పాల్గొన్నారు. ముహూర్తం షాట్ కు దర్శకుడు కీర్తిశ్వరన్ క్లాప్‌బోర్డ్ కొట్టారు. దర్శకులు అధిక్ రవిచంద్రన్, రవికుమార్, కీర్తిశ్వరన్, ఆంటోనీ భాగ్యరాజ్, రాజా, శశి, 'హాయ్ నాన్న' ఫేమ్ శౌర్యువ్ ఈ ప్రారంభోత్సవ వేడుకకు హాజరయ్యారు.నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం (డివి4), ధృవ్ విక్రమ్‌ను పూర్తిగా మాస్ ఓరియెంటెడ్ అవతార్‌లో కనిపించ నున్నారు. నటనకు ప్రాధాన్యతనిచ్చే పాత్ర లతో ప్రయోగాలు చేయ దానికి పేరు పొందిన ధృవ్ , ఇప్పుడు మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందుతున్న ఒక కమర్షియల్ ఎంటర్‌టైనర్ కోసం సిద్ధమయ్యారు. కరణ్ అరవింద్ కుమార్, సబీతో కలిసి ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లేను కూడా అందించారు. ఈ చిత్రానికి అద్భుతమైన సాంకేతిక బృందం పని చేస్తోంది.

## దర్శకుడు మెహర్ రమేష్ కుమార్తె వివాహం: నూతన దంపతులను ఆశీర్వదించిన చిరంజీవి దంపతులు



దర్శకుడు మెహర్ రమేష్ కుమార్తె మోహన వివాహం అనిరుధ్‌తో వైభవంగా జరిగింది. ఈ పెళ్లి వేడుకకు మెగాస్టార్ చిరంజీవి సతీసమేతంగా హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకకు సినీ, రాజకీయ రంగాలకు చెందిన అనేక మంది ప్రముఖులు హాజరై సందడి చేశారు. ముఖ్యంగా . పవన్ కల్యాణ్, ఆయన అర్ధాంగి అన్నా లెజెనోవాతో కలిసి విచ్చేసి కొత్త జంటకు శుభాకాంక్షలు తెలిపారు. టాలీవుడ్ నుంచి అగ్ర హీరో వెంకటేశ్, ప్రముఖ దర్శకులు వీవీ వినాయక్, శ్రీను వైట్ల, ఎన్. శంకర్, వీర శంకర్, నిర్మాతలు అల్లు అరవింద్, సి. అశ్వినీదత్, ఏఎం రత్నం, బన్నీ వాసు, రచయితలు కోన రవి, నటుడు మురళీ మోహన్, కొరియోగ్రాఫర్ ప్రభుదేవా, యాంకర్ సుమ తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. రాజకీయ రంగం స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, గంటా శ్రీనివాస్, అంబటి రాంబాబు వంటి నేతలు కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు.

## 'నాగబంధం' థియేట్రికల్ ఎక్స్‌పీరియెన్స్: డైరెక్టర్ అభిషేక్ నామా



నాగబంధం జూలై 3న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ అభిషేక్ నామా విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**నాగబంధం ఆలోచన ఎప్పుడు వచ్చింది?**
పద్మనాభస్వామి ఆలయంలో వాల్ట్ బి ఎందుకు తెరవలేదనే విషయంలో చాలా చర్చలు జరిగాయి. దానిపై ఎన్నో కథలు ఉన్నాయి. ఆ గదిలోపల ఏముందనేది అందరికీ ఎంతో ఆసక్తికరం. నిజంగా ఆ గది తెరిస్తే అందులో ఏముంటుందో ఊహిస్తూ ఒక కథ చేస్తే బాగుంటుందని అనిపించింది. దాన్ని బ్యాక్‌డ్రాప్‌గా తీసుకుని ఒక ఫిక్షనల్ స్టోరీ చేయాలనిపించింది. అలా నాగబంధం కథను రాశాను.

**ఇలాంటి కథలకు పెద్ద హీరోలు అయితే బాగుంటుంది కదా. మీరెందుకు కొత్తవాళ్లతో చేశారు?**
నిజానికి ఈ కథ అనుకున్నప్పుడు ఎవరితో చేయాలనే ఆలోచన లేదు. మంచి కథ చెప్పడంపైనే నా దృష్టి అంతా ఉంది. కథ పూర్తయిన తర్వాత దానికి ఎవరు బాగా సరిపోతారో వారిని ఎంపిక చేశాం.ఇది నేను విజువలైజ్ చేసుకున్న కథ.

**విరాట్ కర్ణలాంటి కొత్త హీరోతో వంద కోట్లకు పైగా సినిమా చేయడం వెనుక కారణం?**
నిజానికి ఈ కథ మొదలుపెట్టినప్పుడు వంద కోట్ల బడ్జెట్ అవుతుందని అనుకోలేదు. కొత్త నటుడితో సినిమా చేయాలని అనుకున్నాను. .

**నిర్మాతల గురించి?**మా నిర్మాతలు మొదటి నుంచి కథను, నన్ను పూర్తిగా నమ్మి సినిమా కోసం ఖర్చు చేశారు. ఎలాంటి లెక్కలు వేసుకోకుండా కథకు ఏం అవసరమో అది అందించారు.

**మైథాలజీ అంశాలతో సినిమా చేయడం పెద్ద టాస్క్ కదా. ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?**
ఇది మైథాలజీ మాత్రమే కాదు, ఒక కమర్షియల్ సినిమా కూడా. కుటుంబమంతా కలిసి చూడదగ్గ సినిమా.

**హిందీలో ఎలాంటి స్పందన ఉంది?**
బాలీవుడ్‌లో చాలా మంచి స్పందన వచ్చింది. దాదాపు 700కి పైగా స్క్రీన్లలో విడుదల అవుతోంది. **ఇంత భారీ సినిమా చేయాలని ఎప్పుడు నిర్ణయించుకున్నారు?**
డెవిల్ తర్వాత ఒక కథ చేయాలనుకున్నాను. కొంతకాలం దానిపైనే ప్రయాణించాను. అయితేచేస్తే అందరూ గుర్తుపెట్టుకునే పెద్ద సినిమా చేయాలనిపించి ఈ సినిమాను మొదలుపెట్టాను.

## పాన్ ఇండియా ఫీచర్ ఫిల్మ్ 'వనజీవి రామయ్య'



వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'వనజీవి రామయ్య' మూవీ టీమ్ సమక్షంలో ఘనంగా వనజీవి 90వ జయంతి సందర్భంగా వనజీవి హరిత అవార్డు పురస్కార మహోత్సవం..పరావరణ పరిరక్షణకు విశేష సేవలందించిన పలువురికి సత్కారం తెలంగాణ రాష్ట్రంలోని పల్లె ప్రకృతి వనాలకు వనజీవి రామయ్య పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం. నిర్మాత నిడిగొండ నరేష్ ప్రజాపతి

కోటి మొక్కల రామయ్యగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన పర్యావరణ ఉద్యమకారుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత వనజీవి దరిపల్లి రామయ్య సేవలను చిరస్థాయిగా నిలబెట్టే ఉద్దేశంతో రూపొందిన లఘుచిత్రం 'వనజీవి రామయ్య' మూవీ టీమ్ సమక్షంలో, వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వనజీవి అవార్డు పురస్కార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వాస్విక్ గ్రూప్ చైర్మన్, సినీ నిర్మాత నిడిగొండ నరేష్ ప్రజాపతి, వాస్విక్ ఫౌండేషన్ వైస్ చైర్మెన్ నూకల భాస్కర్ రెడ్డి, దర్శకుడు వేముగంటి తదితరులు నాయకత్వం వహించారు. సమాజానికి పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని అందించిన మహనీయుడు దరిపల్లి రామయ్య జీవితాన్ని వెండితెరపై ఆవిష్కరించిన 'వనజీవి రామయ్య' లఘుచిత్రం ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రదానం చేసే 'గద్దర్ అవార్డ్స్'లో ఉత్తమ లఘుచిత్రాల విభాగానికి ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా మొక్కల సత్యనారాయణ, మొక్కల వెంకటయ్య మాట్లాడుతూ, ప్రకృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నిర్మాత నిడిగొండ నరేష్ ప్రజాపతి మాట్లాడుతూ, 'నీటి కరువు, పర్యావరణ సంక్షోభం వంటి సమస్య లను సుమారు 50 ఏళ్ల క్రితమే ముందుగానే గుర్తించి ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చిన దూరదృష్టి కలిగిన మహనీయుడు వనజీవి రామయ్య. దర్శకుడు వేముగంటి మాట్లాడుతూ, 'దాదాపు ఏడు దశాబ్దాల పాటు తన జీవితాన్నే మొక్కల కోసం అంకితం చేసిన వనజీవి రామయ్యను భావితరాలు ఎన్నటికీ మరచిపోకూడదు.

## 'ముపాపా' ఫిబ్రవరి 19, 2027న రిలీజ్

'ముపాపా' ఫిబ్రవరి 19, 2027న రిలీజ్‌బాలీవుడ్ వెర్సటైల్ స్టార్ ఆయుష్మాన్ ఖురానా హీరోగా యశ్ రాజ్ ఫిల్మ్స్, పోషమ్ పా పిక్చర్స్ బ్యానర్స్‌పై రూపొందు తోన్న చిత్రం 'ముపాపా'. యశ్‌రాజ్ ఫిల్మ్స్ సిఇఒ అక్షయ్ విదాని ఈ మూవీని నిర్మిస్తున్నారు. ఇండియన్ మూవీస్‌లో ప్రముఖ షో రన్నర్, డైరెక్టర్ సమీర్ సక్సేనా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈయన నిర్మిం చిన గత చిత్రం సయారా హయ్యస్ట్ గ్రాసర్ సాధించిన రొమాంటిక్ మూవీగా ఇండియన్ సినిమాలో రికార్డ్ క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. ముపాపా చిత్రం వచ్చే ఏడాది ఫిబ్రవరి 19న రిలీజ్ కానున్నట్లు మేకర్స్ తెలియజేశారు. యశ్ రాజ్ ఫిల్మ్స్‌లో కొత్త క్రియేటివ్ బిజినెస్ మోడల్‌ను నిర్మించాలనే ఆదిత్య చోప్రా విజన్‌కు అనుగుణంగా ఈ భాగస్వామ్యం ఉంది. కంపెనీ సీఈఓ అక్షయ్ విదాని నేతృత్వంలో.. ఆయన నిర్మాతగా స్టూడియో ఈ మోడల్‌ను వ్యూహాత్మకంగా అభివృద్ధి చేస్తున్నారు. ముపాపా" ఓ వినూత్నమైన థియేట్రికల్ చిత్రంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. థియేటర్లలో ప్రేక్షకులకు పూర్తిగా కొత్త విజువల్ అనుభూతిని అందించనుంది. డిఫరెంట్ కంటెంట్ మూవీస్‌తో ప్రేక్షకులను అలరిస్తోన్న ఆయుష్మాన్ ఖురానా ఇందులో కథానాయకుడు. అనౌన్స్‌మెంట్ నుంచే ఈ మూవీ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. కాలా పానీ, మామ్లా లీగల్ హైస వంటి ప్రేక్షకాదరణ పొందిన సినిమాల్లో భాగమైన పోషమ్ పా పిక్చర్స్ పార్ట్‌నర్స్ సమీర్ సక్సేనా, బిస్వపతి సర్కార్, సౌరభ్ ఖన్నా, అమిత్ గోలాని ఇందులోనూ భాగమయ్యారు.



## లవ్ స్టోరీ 'కాగితం పడవలు' 24న గ్రాండ్‌గా రిలీజ్



వర్ధన్, కృష్ణప్రియ హీరో హీరో యిన్స్‌గా ఎంజీఆర్ తుకారాం దర్శకత్వంలో తెరకెక్కుతున్న బ్యూటిఫుల్ లవ్ స్టోరీ కాగితం పడవలు. ఎస్ఎల్ఎన్ సినీ క్రియేషన్స్, ప్రణధి క్రియేషన్స్, నవ నారాయణ సినీ క్రియేషన్స్ బ్యానర్స్ పై కీర్తన నరేష్ టి.ఆర్. ప్రసాద్ రెడ్డి వెంకట్రాజుల, గాయిత్రమ్మ అంజ నప్ప నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ట్రైలర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా చిత్ర బృందం విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది. జూలై 24న ఈ చిత్రం ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రతిష్టాత్మకమైన పంపిణీ సంస్థల్లో ఒకటైన ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తుండటం విశేషం.ఒక సినిమా కంటెంట్‌పై బలమైన నమ్మకం ఉన్నప్పుడే ఇలాంటి ప్రముఖ సంస్థలు ముందుకు వస్తాయి. దీంతో 'కాగితం పడవలు' పై పరిశ్రమ వర్గాల్లోనూ, ప్రేక్షకుల్లోనూ మరింత ఆసక్తి నెలకొంది.ఈ చిత్రానికి ఎఐఎస్ నౌఫల్ రాజామ్యూజిక్ అందిస్తున్నారు. రుద్రసాయి డీవోపీగా పని చేస్తున్నారు, జెస్విన్ ప్రభు ఎడిటర్. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎం.హిమ బిందు. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.



## మావిగన్ ప్రతిపాదన జగన్ కు భస్మాసుర హస్తమే. : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూలై 2, ప్రభాతవార్త: రాష్ట్ర రాజధాని కోసం తమ భూములు త్యాగం చేసిన రైతులపై ఏ నాయకుడు, ఏ పార్టీ రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడిన దాఖలాలు లేవని, అలాంటి నాయకుడు దేశంలో జగన్ ఒక్కడేనని, తన మావిగన్ ప్రతిపాదన జగన్ పాలిట శాపంగా మారుతుందని, భస్మాసుర హస్తంలా తనను, తన పార్టీనే దహిస్తుందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. గురువారం ఆయన నాదెండ్ల మండలం అప్పాపురంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతికా శుక్లా, స్థానిక నాయకులతో కలిసి వీబీ జీ రామ్ జీ పథకాన్ని ప్రారంభించారు. పథకం కింద చేపట్టిన పనులు పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే, కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. మావిగన్స్ తో వైసీపీ రాజకీయ మనుగడకే ముప్పు.. జగన్ మావిగన్ ప్రతిపాదనపై ప్రజలకంటే ఎక్కువగా సొంతపార్టీనేతలే నవ్వుతున్నారని, ఏమాత్రం ఆలోచన లేకుండా జగన్ ప్రకటించే నిర్ణయాలతో వైసీపీనాయకులకే దిక్కుతోచని స్థితిలో పడుతున్నారని ప్రత్తిపాటి తెలిపారు. జగన్ నిర్ణయంతో తమ రాజకీయ భవిష్యత్ ఏమవుతుందోనన్న భయం వారిని పీడిస్తోందన్నారు. తమ నాయకుడి అనాలోచిత నిర్ణయాలపై వైసీపీనేతలు విభేదించలేకుంటే, వారి రాజకీయ భవిష్యత్ ఎప్పటికీ అంధకారమేనని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రానికి గుండెకాయ అయిన రాజధాని నిర్మాణానికి తమ భూములు త్యాగం చేసిన రైతులపై కక్షసాధింపులకు పాల్పడుతున్న ఏకైక నాయకుడు దేశంలో జగన్ ఒక్కడేనని ప్రత్తిపాటి ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర అభివృద్ధికి, ప్రజలకు ఉపయోగపడే రాజధాని నిర్మాణంపై జగన్ దుష్ప్రచారం చేయడం తగదన్నారు. జగన్ తన మావిగన్ దురాలోచన మానుకోకుంటే.. వైసీపీ రాజకీయ మనుగడకే ముప్పు వాటిల్లుతుందని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. తన ప్రతిపాదన భవిష్యత్ లో జగన్ కే శాపంగా మారతాయన్నారు. వీబీజీ రామ్ జీ తో రాష్ట్రానికి భారీ లబ్ది.. గ్రామాల అభివృద్ధి : ప్రత్తిపాటి నరేగా స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వీబీజీ రామ్ జీ పథకంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని ప్రత్తిపాటి తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతులతో పాటు... రైతులు, రైతు కూలీలకు ఆర్థికంగా ఉపాధి లభిస్తుందన్నారు. పంట కాలువలు, కుంటలు, చెరువుల నిర్మాణం, ఆధునీకరణతో నీటివనరుల లభ్యత పెరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం వీబీజీ రామ్ జీ పథకం ద్వారా 12వేల కోట్ల విలువైన పనులు కేటాయించిందని, వాటి సద్వినియోగం అందరి బాధ్యతని ప్రత్తిపాటి చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్రమంత్రి పెమ్మసాని కృషి, నిరంతర సంప్రదింపుల వల్లే కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం వీబీజీ రామ్ జీతో రాష్ట్రానికి భారీ లబ్ది చేకూరనుందని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ఇప్పటికే కూటమిప్రభుత్వ సంక్షేమ పథకాలతో మెరుగుపడిన గ్రామీణ ప్రజల ఆర్థిక జీవనానికి, ఈ పథకం మరింత మేలు చేస్తుందన్నారు.



**గ్రామసభల ద్వారా ప్రజాభిప్రాయంతోనే పనులు చేపడతాం : కలెక్టర్ కృతికా శుక్లా**

నరేగాపరిధిలో ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధి పనులన్నింటినీ ఇకనుంచి వీబీజీ రామ్ జీ పథకం పరిధిలోకి తీసుకు రానున్నట్టు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా వెల్లడించారు. వచ్చే రెండు వారాల్లో కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా గ్రామసభలు నిర్వహించి, ప్రజాభిప్రాయంతోనే ఆయా గ్రామాల్లో పథకం కింద చేపట్టాల్సిన పనుల్ని నిర్ధారిస్తామని ఆమె తెలిపారు. జలధారలబాటలోకి కింద చేపట్టిన రూ.30 కోట్ల విలువైన పనుల్ని కూడా వీబీజీ రామ్ జీ పథకంకిందే పూర్తిచేస్తామన్నారు. గతేడాది నరేగా పరిధిలో జిల్లాకు 58 లక్షల పనులు మంజూరైతే, ఈ ఏడాది ఇప్పటికే 34 లక్షల పనులు పూర్తిచేసినట్టు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మదన్ మోహన్, గొట్టిపాటి రామారావు, జగదీష్, మస్తాన్ వలి, అయోధ్య, డ్వామా పిడి సిద్ద లింగమూర్తి, ఏపీఓపీసీ పిడి, ఆర్.డబ్ల్యూయస్ పిడి, హౌసింగ్ పిడి, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఎల్.ఓ.సీలతో పేదలకు ఖరీదైన, నాణ్యమైన వైద్యసేవలు : ప్రత్తిపాటి



చిలకలూరిపేట, జూలై 2, ప్రభాతవార్త: కూటమిప్రభుత్వం ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, అనారోగ్య సమస్యలపై వారందించే విజ్ఞప్తులను వెంటనే పరిష్కరిస్తోందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. గురువారం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఐదుగురికి ప్రభుత్వం మంజూరు చేసిన ఎల్.ఓ.సీలు (లెటర్ ఆఫ్ క్రెడిట్), సీ.ఎం.ఆర్.ఎఫ్ లు అందించారు. ఎల్.ఓ.సీలు పేదల ప్రాణాలు రక్షించే సాధనాలు.. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ.. జగన్ ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని వ్యాపార వస్తువుగా చూస్తే, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల ఆరోగ్య రక్షణకు అన్నివిధాల అండగా నిలుస్తున్నారన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు తమకు ఎదురయ్యే అనారోగ్య సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధుల కోసం ఎక్కడా అప్పులు చేయాల్సిన పనిలేకుండా ప్రభుత్వం ఎల్.ఓ.సీలు, సీ.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులు అందిస్తోందని ప్రత్తిపాటి చెప్పారు. దీనివల్ల పేద కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోకుండా వారికి తగిన చేయూత లభిస్తుందన్నారు. చంద్రబాబు అందించే ఎల్.ఓ.సీలు పేదల ప్రాణాలు రక్షించే గొప్ప సాధనాలని, వాటితో ఖరీదైన వైద్య చికిత్సలు, సేవలు ప్రజలకు సులభంగా లభిస్తాయని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మదన్ మోహన్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, వజ్జ సింగయ్య, జయప్రసాద్, షేక్ మజాదుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల ముఖద్వార నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్రత్తిపాటి



చిలకలూరిపేట, జూలై 2, ప్రభాతవార్త: నాదెండ్ల మండలం ఇర్లపాడులోని కేంద్రీయ విద్యాలయం ముఖద్వార నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి శంకుస్థాపన చేశారు. అప్పాపురంలో వీబీజీ రామ్ జీ పథకం ప్రారంభించిన అనంతరం ఆయన ఇర్లపాడులో పర్యటించి, జరుగుతున్న అభివృద్ధి పనుల్ని పరిశీలించారు. గ్రామ నాయకులతో కలిసి రూ.15 లక్షలతో నిర్మించనున్న ముఖద్వారనిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మదన్ మోహన్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు గుర్రం నాగ పూర్ణచంద్రరావు, వజ్జ సింగయ్య, జయప్రసాద్, గంగనాథుల నాగేశ్వరరావు, కృష్ణమ నాయుడు, రామాంజి, జ్యోతి, పంచాయతీ రాజ్ డి.ఈ బాల కుమార్, ఏ.ఈ వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ సీతారాంబతల్లి ఆలయ వార్షికోత్సవం



చిలకలూరిపేట, జూలై 2, ప్రభాతవార్త: చిలకలూరిపేట నియోజకవర్గం, గణపవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ సీతారాంబ తల్లి ( బొడ్డాయి ) 15వ వార్షికోత్సవం సందర్భంగా, ఆలయ, గ్రామ కమిటీ వారు ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజల్లో పాల్గొని, అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించి, కమిటీ వారు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి, అన్నదాన వితరణ చేసిన మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు .అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతూ శ్రీ సీతారాంబ తల్లి కృపాకటాక్షలతో కుటుంబంలో ఐకమత్యం, మనశ్శాంతి లభిస్తుందని, ఈ రోజును భక్తి శ్రద్ధలతో జరుపుకోవడం వల్ల సకల శుభాలు చేకూర్చాలని కోరుకుంటున్నాను అని అన్నారు.

## ఘనంగా బొడ్డాయి వార్షికోత్సవం



చిలకలూరిపేట, జూలై 2, ప్రభాతవార్త: నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ సీతారాంబ తల్లి బొడ్డాయి 16 వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ వారి ప్రత్యేక ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించిన శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ భక్తులందరూ అపారమైన భక్తి, విశ్వాసాలతో ప్రతి ఏడాది అమ్మవారి వార్షికోత్సవాలను అత్యంత అద్భుతంగా, వైభవంగా నిర్వహిస్తూ తమ భక్తి ప్రపత్తులను చాటుకోవడం అభినందనీయమని అన్నారు. భక్తి ప్రధానంగా నిర్వహిస్తున్న కోలాట ప్రదర్శనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలతో ఈ ప్రాంతమంతటా ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పాయని, ఇలాంటి వాతావరణం అందరికి కూడా మంచి చేస్తుందని అన్నారు . ప్రతి కుటుంబం పై కూడా అమ్మవారి ఆశీస్సులు ఉండి, ఆ కుటుంబాలు అన్ని రకాలుగా కూడా అభివృద్ధి చెందుతాయని నేను విశ్వసిస్తున్నాను అని అన్నారు. అలాగే ఈ వార్షికోత్సవ వేడుకలో కోలాటం నిర్వహిస్తున్న నిర్వాహకులకు, కోలాట ప్రదర్శన చేస్తున్న సోదరీమణులకు అందరికీ ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాను అని అన్నారు.ముందుగా ఈ వేడుకలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మర్రి రాజశేఖర్ కి వలేటి హిమవంతరావు ,ఎం నాగభూషణం ,నార్నె హరిబాబు , గొట్టిపాటి శివకుమార్, నూతలపాటి శ్రీనివాసరావు గారు, తూబాటి గంగాధరరావు ,నార్నె వెంకట సుబ్బయ్య ,కొమ్మినేని దిలీప్ , కొమ్మినేని ప్రదీప్ ,మరియు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు.

## ప్రఖ్యాత క్యాలిగ్రఫిస్ట్, జాతీయ స్థాయి అవార్డులు

చిలకలూరిపేట, జూలై 2, ప్రభాతవార్త: వివిఐటి ది స్కూల్ సుబ్బయ్యతోట, వికాస్ స్కూల్ పెదనందిపాడు రోడ్ క్యాంపస్ల్ల ఈనెల 12 తేదీల్లో ప్రఖ్యాత క్యాలిగ్రఫిస్ట్ మల్లికార్జునరావుతో హ్యాండ్ రైటింగ్ శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యార్థులు పాల్గొన్నారు. పాల్గొన్న విద్యార్థులకు శిక్షణ ఇవ్వబడింది. విద్యార్థుల మౌలిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడం కోసం ఇలాంటి కార్యక్రమాలను వికాస్ విద్యాసంస్థలు భారతదేశంలోనే వివిధ రంగాలలోని నిశ్రీశినిళిగిళీ తో నిరంతరం నిర్వహిస్తున్నాయని డైరెక్టర్ దండా పవన్ కుమార్ మరియు డైరెక్టర్ రోజశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ శ్యాంబాబు అప్పరున్నిసా మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మావిగన్ పేరుతో రాజధానిపై వైసీపీ కుట్ర: టీడీపీ

నకరికల్లు, జూలై 2 ప్రభాతవార్త :: రాష్ట్ర రాజధాని అమరావతి పై విషం చిమ్ముతూ వైఎస్సార్సీపి మావిగన్ అనే కొత్త నినాదాన్ని అందుకుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు సౌరయ్య అన్నారు. స్థానిక కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు.ప్రజల ఆస్తి అమరావతిని విధ్వంసం చేసేందుకే ఈ కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు గత ఎన్నికల్లో వైయస్సార్సీపీకి బుద్ధి చెప్పిన వారి తీరు మారలేదన్నారు. రాజధాని మహిళలు,రైతులు నేర రాజకీయాలు చేసే పార్టీని తమ ప్రాంతంలోకి అడుగుపెట్టకుండా తరిమికొట్టారని గుర్తు చేశారు. గడిచిన వైకాపా పాలనలో మూడు రాజధానుల పేరుతో ఆడిన నాటకం ప్రజలు చూశారన్నారు. అద్భుతమైన రాజధానికి, సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ సాగుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనపై విషం చిమ్మే ప్రకటనలు మానుకోవాలన్నారు. మావిగన్ నినాదం వైయస్సార్సీపీని భూస్థాపితం చేస్తుందన్నారు. ఈ మాట చెబుతుంది తెలుగుదేశం పార్టీ కాదని ఆ పార్టీ నాయకులే చెప్పుకుంటున్నారని తెలిపారు. రాజధానిపై నిన్న వైయస్ జగన్ ప్రకటనతో ఆ పార్టీ నాయకుల వెన్నులో వణుకు పుడుతుంది అన్నారు. 2029 ఎన్నికల్లో 11 సీట్లు కూడా మిగలవని లోలోపల ఆ పార్టీ శ్రేణులు ఇప్పుడు మదనపడే పరిస్థితి నెలకొందన్నారు. ఒకవైపు కోట్ల రూపాయల పెన్షన్లు ప్రతినెలా ఒకటో తేదీన అందిస్తూ, మరోవైపు గ్రామాలలో ఉపాధి హామీ పనులతో రోజువారి కూలీలకు అండగా నిలుస్తున్నామని, పేద పిల్లలు చదువుకు భరోసానిస్తూ తల్లికి వందనం, వ్యవసాయానికి అండగా నిలిచి రైతు భరోసా కూటమి ప్రభుత్వంఅమలు చేస్తుందని తెలిపారు. కుట్రలు చేస్తున్న వైయస్సార్సీపీకి గట్టిగా మరో మారు ప్రజలు చంప దెబ్బ కొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు సౌరయ్య తెలిపారు.



## యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి : సీఐ ఫిరోజ్

నరసరావుపేట, జూలై 2 ప్రభాతవార్త : సమాజాన్ని, ముఖ్యంగా యువతను పట్టిపీడిస్తున్న డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు పల్నాడు జిల్లా వ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు కోట సాయి కుమార్, ఈ. ఆంజనేయరాజు తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమానికి సంబంధించిన గోడ ప్రతులను నరసరావుపేట 1వ పట్టణ సీఐ షేక్. ఫిరోజ్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయి కుమార్, ఆంజనేయరాజు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, క్రీడలు, సామాజిక సేవలపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలోని విద్యా సంస్థలు, కళాశాలల్లో డ్రగ్స్, గంజాయి వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు, యువతలో చైతన్యం కల్పించే లక్ష్యంతో సదస్సులు, పోస్టర్ ప్రచారాలు, ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల బారిన పడకుండా యువతను కాపాడేందుకు సమాజం లోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రజలు, విద్యార్థులు, యువజనులు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. సీఐ షేక్ ఫిరోజ్ మాట్లాడుతూ మత్తు పదార్థాల బారిన పడితే యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందన్నారు.సే నో టు డ్రగ్స్‌ఖి, ఖిమత్తు వద్దు జీవితం ముద్దుఖి వంటి నినాదాలతో ప్రజల్లో చైతన్యం కల్పించడం అభినందనీయమని అన్నారు. మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఎస్ఎఫ్ఐ గర్ల్స్ జిల్లా కన్వీనర్ కె. నవిత, మహిళా నాయకురాలు ఈ. సాయి శిరీష తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఎస్టియు వినతి

నరసరావుపేట టౌన్, జూలై 2 ప్రభాతవార్త :: కేజీబీవీ పాఠశాలల లోని పలు సమస్యలపై జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని ఏపీసి ని ఎస్ టి యు పల్నాడు జిల్లా శాఖ నాయకులు వినతి పత్రం అందజేశారు.6 నుండి 10 వరకు ఖాళీగా ఉన్న సీట్లని సంబంధిత కేజీబీవీ ఎస్ఓ భర్తీ చేయాలన్నారు.ఐచ్ఛిక సెలవులు కేజీబీవీ ఉపాధ్యాయునిలకు కూడా వర్తింప చేయాలన్నారు.సమస్యలపై ఎపిసి శ్యాం ప్రసాద్ సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమం లో ఎస్ టి యు జిల్లా నాయకులు ఏ ఏమండీ, షేక్ మహబూబ్ సుభాని, కె ఏసయ్య, ఎస్.కె కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

## సర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన డా.గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి

నరసరావుపేట,జూలై 2 ప్రభాతవార్త :: ..పల్నాడు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి గురువారం పట్టణంలోని పలు వార్డులో జరుగుతున్న ఖీ.ఖి కార్యక్రమం ను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో కలిసి ఎన్యుమరేషన్ ఫారములు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకుని బిఎల్ఎలు 100 ఎన్యూమరేషన్ ఫారాలు ఓటర్లకు అందే విధంగా పనిచేయాలన్నారు. అదేవిధంగా ఎటువంటి తప్పులు దొర్లకుండా సక్రమంగా పూర్తి చేసి బిఎల్ఓ లకు అందజేయాలని ,సంబంధిత ఓటర్లకు సంబంధించిన ఫోటోలు,అవసరమైన సర్టిఫికెట్లను కూడా జతపరచాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ఒక భాగమైతే ఈఎన్యూమరేషన్ ఫారంలను పూర్తి చేసి సకాలంలో ఇవ్వటం ముఖ్యమని ,లేని పక్షంలో ఓట్లు కోల్పోవాల్సి వస్తుందని, బిఎల్ఎలు అప్రమత్తంగా ఉండి పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారంలను ఓటర్లు వద్ద నుంచి పూర్తి చేయించి 100 బిఎల్ఓ లకు అందజేయాల్సిన బాధ్యత సక్రమంగా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు,పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ కరీముల్లా, నాయకులు నీడమనూరి సురేంద్ర, ఆయా వార్డుల ప్రెసిడెంట్లు,వార్డుల బూత్ లెవెల్ ఏజెంట్లు మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు..

## నరసరావుపేట ఎమ్మెల్యేను కలిసిన నూతన మహిళా శిశు సంక్షేమ పీడీ..

నరసరావుపేట, జూలై 2 ప్రభాతవార్త : నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబును గురువారం నూతనంగా డిప్యుటేషన్‌పై మహిళా మరియు శిశు సంక్షేమ ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ)గా బాధ్యతలు స్వీకరించిన నాగమల్లేశ్వరి మర్యాదపూర్వకంగా కలిశారు. సూపరింటెండెంట్ చంద్రశేఖర్ ఎమ్మెల్యే ని కలిసిన వారిలో ఉన్నారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే కార్యాలయంలో వారిని కలిసిన నూతన అధికారులకు డాక్టర్ అరవింద బాబు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ద్వారా ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నూతన పీడీ నాగమల్లేశ్వరి, సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌తో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## మావిగన్‌ఖి పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం :: ఎమ్మెల్యే

రొంపిచర్ల, జూలై 2 ప్రభాతవార్త: : వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మావిగన్ పేరుతో అమరావతిపై ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. అమరావతి రాష్ట్రానికి చట్టబద్ధంగా నిర్ణయించిన రాజధాని అని పేర్కొన్నారు. 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అమరావతిని రాజధానిగా ప్రకటించి, అసెంబ్లీలో తీర్మానం ఆమోదించిందన్నారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన జరిగిందని గుర్తు చేశారు.

2014 నుంచి 2019 వరకు అమరావతి ప్రాంతంలో రహదారులు, తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు భవనాలు, విద్యాసంస్థలు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి భారీగా ఖర్చు చేశారని తెలిపారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మూడు రాజధానుల ప్రతిపాదనతో అమరావతి అభివృద్ధి నిలిచిపోయిందని, రైతులు సుదీర్ఘకాలం ఉద్యమం చేసినప్పటికీ వారి సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. 2024 తర్వాత కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రాజధాని అమరావతిలో వేగంగా పనులు జరుగుతున్నాయని తెలిపారు.

## ఉద్యోగాలకు ఎంపికైన 25 మంది ఏ.ఎం.రెడ్డి విద్యార్థులు

రొంపిచర్ల, జులై 2 ప్రభాతవార్త : నరసరావుపేట మండలంలోని పెట్లూరివారి పాలెం గ్రామంలోని ఏ.ఎం.రెడ్డి స్మారక ఫార్మసి కళాశాలలో గురువారం దివిస్ ఫార్మా లాబరేటరీస్ సంస్థ ప్రాంగణ ఎంపికలను నిర్వహించారు. ఈ ప్రాంగణ ఎంపికలలో బి ఫార్మసీ, ఎం ఫార్మసీ విద్యార్థులు 40 మంది హాజరయ్యారు. దివిస్ సంస్థ సీనియర్ హ్యూమన్ రిసోర్స్ అధికారి రామకృష్ణ వారిని రాత పరీక్ష గ్రూప్ డిస్కషన్ పరీక్షలు చేపట్టి, 25 మంది విద్యార్థులను వివిధ శాఖల ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కార్యదర్శి డాక్టర్ అట్లూరి శాంతి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ పి భార్గవ్ భూషణ్ రావు, అకాడమిక్ డీన్ డాక్టర్ ఏ. పావని, ప్లేస్మెంట్స్ అధికారి డాక్టర్ కె వెంకట్ గోపయ్య, విభాగాధిపతులు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## వి బి జి రాం జి పథకం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి

చెరుకుపల్లి ,జూలై 2, ప్రభాతవార్త : వి బి జి రాం జీ పథకం ద్వారా గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను సాధించవచ్చునని ఎంపీడీవో కృష్ణ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన చెరుకుపల్లి ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పథకాన్ని వి బి జి రాంజీ పథకంగా పేరు మార్చడం జరిగిందని తద్వారా మరిన్ని ప్రయోజనాలను ఈ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఆయన తెలిపారు. గతంలో వంద రోజులు పని దినాలను 125 రోజులకు పెంచినట్లు, ప్రతి కార్మికుడి పని ప్రక్రియను తన యొక్క ఆధార్ తో అనుసంధానం చేయడం జరిగింది అన్నారు. అదేవిధంగా గ్రామాల్లో నీటి ఎద్దడిని నివారించేందుకు చెరువులు , పంట కాలువల్లో పూడికతీత పనులు సైతం ప్రవేశపెట్టిందన్నారు. గతంలో ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం 75 రాష్ట్ర ప్రభుత్వం 25 చొప్పున నిధులు మంజూరు చేసేవని నేడు కేంద్ర ప్రభుత్వం 60 రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం చొప్పున నిధులు మంజూరు చేస్తుందని వివరించారు. ఉపాధి లేని ప్రతి ఒక్క అర్హత కలిగిన వ్యక్తి ఈ పథకంలో చేరి 125 రోజులు పని దినాలను పొందవచ్చునని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ ఎంఆర్కే మూర్తి, పంచాయతీ కార్యదర్శి షేక్ నూరుల్లా నబి, మల్లాది రామకృష్ణ, సొంటి సుబ్బయ్య, అనగాని ఆంజనేయులు, గోగినేని రామాంజనేయులు, వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతినెల ఉచిత ఫ్యాబ్రోస్కాన్ పరీక్షలు

చిలకలూరిపేట, జూలై 2, ప్రభాతవార్త: నేటి సమాజంలో విపరీతంగా పెరిగిపోతున్న కాలేయ సమస్యల నివారణకు చిలకలూరిపేట ఇన్నర్ వీల్ సభ్యురాలు ఎన్ ఎన్ .పద్మ విజయకృష్ణ హాస్పిటల్ లో ఫ్యాబ్రో స్కాన్ పరీక్షలు ప్రారంభించారు. సుమారు 5వేల రూపాయలకు పైగా ఖర్చు అయ్యే ఈ పరీక్షలను ప్రతినెలా ఉచితంగా నిర్వహిస్తారు. ఈ పరీక్షలు కాలేయ సమస్యల తీవ్రతను తగ్గిస్తాయని డాక్టర్ విజయ్ కృష్ణ అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఇన్నర్ వీల్ అధ్యక్షురాలు తోటకూర రామ సీత మాట్లాడుతూ ఈ వ్యాధిపై ప్రజలలో అవగాహన కల్పించడానికి తమ శాయశక్తుల కృషి చేస్తామన్నారు . ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట ఇన్నర్ వీల్ క్లబ్ కోశాధికారి తియ్యగూర రమాదేవి , సభ్యురాలు ఎన్ పద్మ ,గోరంట్ల ప్రత్యూష, తోటకూర శ్రీహర్ష , రొటేరియన్ తోటకూర వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సాయి ఆలయంలో డిఎస్పీ దంపతుల ప్రత్యేక పూజలు



చిలకలూరిపేట, జూలై 2, ప్రభాతవార్త: చిలకలూరిపేట ఎన్టీఆర్ కాలనీలో సాయిబాబా గుడిలో నరసరావుపేట డిఎస్పి హనుమంతరావు సతి సమేతంగా వచ్చి ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ద్వారకామాయి ట్రస్ట్ చైర్మన్ చల్లా విజయ్ కుమార్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి రమేష్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బత్తినేని సుబ్బ నాయుడు పలువురి ఎస్సైలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాద్ స్వీకరించారు

## ఓటర్ల జాబితా సవరణ పనుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

చిలకలూరిపేట, జూలై 2, ప్రభాతవార్త: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమ పురోగతిపై స్థానిక కార్యాలయంలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్ఓ), మున్సిపల్ కమిషనర్, మండల రెవెన్యూ అధికారి (ఎంఆర్ఓ)ల సంయుక్త నేతృత్వంలో బి.ఎల్.ఓలు, సూపర్‌వైజర్లతో విస్తృత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈఆర్ఓ, కమిషనర్ మాట్లాడుతూ.. బి.ఎల్.ఓలు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పక్కాగా పరిశీలించాలని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు తప్పుల సవరణ, డబుల్ ఓట్లు, మరణించిన ఓటర్ల తొలగింపు ప్రక్రియను నిబంధనల ప్రకారం అత్యంత పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఎంఆర్ఓ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని, అర్హులైన ఏ ఒక్కరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా బి.ఎల్.ఓలు, సూపర్‌వైజర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఉన్నతాధికారులు నిర్దేశించిన గడువులోగా వంద శాతం పనులను పూర్తి చేయాలని, విధుల్లో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించినా సహించేది లేదని ఆయన తీవ్రంగా హెచ్చరించారు.

## పఠాన్ చిన్న సత్తార్ ఖాన్ ట్రస్ట్ సేవలు ఎనలేనివి: నవతరం పార్టీ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం



చిలకలూరిపేట, జూలై 2, ప్రభాతవార్త: చిలకలూరిపేట నియోజకవర్గం పరిసర ప్రాంతాల్లో పఠాన్ చిన్న సత్తార్ ఖాన్ ట్రస్ట్ ద్వారా బంగారు వ్యాపారి పఠాన్ యూసుఫ్ చేస్తున్న సేవలు అమూల్యం అని నవతరం పార్టీ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం అన్నారు. 02072026 గురువారం ఉదయం తొమ్మిది గంటలకు దాసరి సురేష్ అనే వికలాంగునికి మూడు చక్రాల సైకిల్ యూసుఫ్ ఆర్థిక సహాయంతో రావు సుబ్రహ్మణ్యం చేతులమీదగా అందించారు.కార్యక్రమంలో బీజేపీ నాయకులు వరికూటి నాగేశ్వరావు, పులుగుజ్జు మహేష్,జనసేన పార్టీ నాయకులు ముత్యాల బాబు ప్రముఖ న్యాయవాది సాపా ఆదినారాయణ,కాపుసంఘం నాయకులు అంకిరెడ్డి రమేష్, గట్టా మెడికల్స్ అధిపతి గట్టా రమేష్,తన్నీరు సురేష్, గంటా పాపారావు,రావు శ్రీకృష్ణ దేవరాయలు పాల్గొన్నారు.

## నాదెండ్ల పంట పొలాల్లో క్షుద్ర పూజల కలకలం



చిలకలూరిపేట, జూలై 2, ప్రభాతవార్త: నాదెండ్ల రెవిన్యూ గ్రామ పరిధిలో అర్ధరాత్రి క్షుద్ర పూజలు చేసిన దుండగులు. తూబాడు గ్రామ సమీపంలోని డ్రాగన్ పండ్ల తోట వద్ద క్షుద్ర పూజల గుర్తులు. గురువారం విధులకు వెళ్లిన రీసర్వే బృందానికి కనిపించిన పూజా సామాగ్రి. క్షుద్ర పూజల వ్యవహారంతో తీవ్ర భయాందోళనల్లో స్థానిక రైతులు, కూలీలు. పంట పొలాల్లో ఇలాంటి దుష్ట క్రియలకు పాల్పడటంపై రైతుల ఆగ్రహం. రాత్రి వేళల్లో గస్తీ పెంచి, నిందితులను పట్టుకోవాలని పోలీసులకు ప్రజల విజ్ఞప్తి. నాదెండ్ల పరిసర ప్రాంతాల్లో హాట్ టాపిక్‌గా మారిన క్షుద్ర పూజల కలకలం.

## మిరప నారు పెంపకంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ

సత్తెనపల్లి, జూలై 2, ప్రభాతవార్త: సత్తెనపల్లి మండలం, ధూళిపాళ్ల రైతు సేవా కేంద్రంలో సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్ పథకంలో లో భాగంగా మిరప నారు పెంపకంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు పి. ఎం. డి.యస్. పద్ధతుల గురించి శిక్షణా కార్యక్రమమును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా డాట్ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త మరియు డాట్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ నగేష్ గారు మరియు జిల్లా ఉద్యాన అధికారి ఐ. వెంకట్రావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్త నగేష్ గారు మాట్లాడుతూ ధూళిపాళ్ల మరియు కంకణాలపల్లి గ్రామాలలో ఉన్న నర్సరీలను పరిశీలించి నర్సరీ యజమానులకు మరియు మిరప రైతులకు మిర్చి నారు పెంపకంలో తీసుకోవాల్సిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి మరియు పి.ఎం. డి. యస్. పద్ధతి వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. జిల్లా ఉద్యాన అధికారి ఐ. వెంకట్రావు మాట్లాడుతూ నర్సరీ చట్టం 2010 గురించి నర్సరీ యజమానులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్క నర్సరీ లైసెన్స్ కలిగి ఉండాలని లైసెన్స్ లేని నర్సరీలు వెంటనే లైసెన్స్ కొరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నర్సరీ యజమానులు ఏడు రకాల రిజిస్టర్లు కలిగి ఉండాలని తెలియజేశారు. నర్సరీ చట్టాన్ని అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉద్యాన అధికారి ఎన్ సురేష్ ,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సైదయ్య,డ్రిప్ ఎంఐఓ నరేంద్ర , జిల్లా ఉద్యాన అధికారి ఐ వెంకట్రావు , డాట్ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త మరియు కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నగేష్ , ఉద్యాన అధికారి యన్. సురేష్ , ప్రకృతి వ్యవసాయ సిబ్బంది టి. సైదయ్య , కె.మధుబాబు , జి.నాగలక్ష్మి. డ్రిప్ ఏరియా ఆఫీసర్ కె .నరేంద్ర . గ్రామ నాయకులు కేదార్నాథ్ , బి. తిరుపతిరావు గ్రామ ఉద్యాన సహాయకులు కె.రామకోటిరెడ్డి గారు, కె.నరేష్ , షేక్. ఆరిఫ్ , నర్సరీ యజమానులు మరియు మిరప రైతులు పాల్గొన్నారు.



## క్రీడల్లో సత్తెనపల్లికి రాష్ట్ర స్థాయి గుర్తింపు

### పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం

**క్రీడల్లో స్వర్ణ, రజక, కాంస్య పతకాలు: విద్యలోనే కాదు క్రీడల్లో ను అద్భుత ప్రతిభ**




సత్తెనపల్లి, జూలై 2, ప్రభాతవార్త: పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం సత్తెనపల్లి క్రీడల్లో చరిత్ర సృష్టించింది. పాఠశాలలో పరిమిత వనరులు ఉన్నప్పటికీ దృఢ సంకల్పం, క్రమశిక్షణ, అంకితభావం ఉంటే విజయం తప్పకుండా సొంతమవుతుందని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం సత్తెనపల్లి మరోసారి నిరూపించింది. కేంద్రీయ విద్యాలయం తెనాలిలో జూన్ 27, 28తేదీలలో నిర్వహించిన అండర్ 17 బాలుర వాలీబాల్ జట్టు,29,30 తేదీలలో నిర్వహించిన పోటీల్లో అండర్17 బాలికల వాలీబాల్ జట్టు రెండూ స్వర్ణ పతకాలు సాధించారు. అలాగే కేంద్రీయ విద్యాలయం ఎయిర్ ఫోర్స్ హకింపేట లో జూన్ 29,30 తేదీలలో జరిగిన పోటీల్లో అండర్14 బాలికల వాలీబాల్ జట్టు రజత పతకం గెలుచుకుంది. కేంద్రీయ విద్యాలయ, వరంగల్ లో జూన్ 29,30 తేదీలలో జరిగిన టేబుల్ టెన్నిస్ పోటీల్లో అఖిలేష్ అండర్19 బాలుర విభాగంలో స్వర్ణ పతకం సాధించాడు. లిఖిత అండర్14 బాలికల విభాగంలో రజత పతకం, అదే విభాగంలో నమ్రత కాంస్య పతకం సాధించి విజేతలు గా నిలిచారు. అదే విధంగా ఏప్రిల్ 26,27 తేదీలలో జరిగిన టేబుల్ టెన్నిస్ విభాగంలో గిరిధర్ అండర్19 కాంస్య పతకం సాధించగా, కేంద్రీయ విద్యాలయం తిరుమలగిరిలో జరిగిన పోటీల్లో అండర్14 బాస్కెట్‌బాల్ జట్టు కాంస్య పతకం గెలుచుకుంది. ఈ అద్భుత విజయాల ఫలితంగా విద్యాలయానికి చెందిన పలువురు క్రీడాకారులు ఇప్పుడు కేంద్రీయ విద్యాలయం సత్తెనపల్లి విద్యార్థులు జాతీయ క్రీడా పోటీల్లో ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఇది విద్యాలయానికి అత్యంత గర్వకారణమైన విషయం. ఈ విజయాల వెనుక విద్యాలయ ఉపాధ్యాయులు కిరణ్ రెడ్డి నిరంతర కృషి, క్రమశిక్షణతో కూడిన శిక్షణ, అంకితభావం మరియు విద్యార్థులపై ఉన్న విశ్వాసం విద్యార్థుల విజయనికి కారణంగా నిలిచాయి. 2022 నుండి 2026 వరకు వరుసగా ప్రాంతీయ స్థాయిలో స్వర్ణ పతకాలు సాధించడం ఆయన ప్రతిభకు నిదర్శనం. రాబోయే రోజుల్లో ఈ విజయగాథ మరింత ఉన్నత శిఖరాలను అధిరోహిస్తుందనే నమ్మకం అందరిలో వ్యక్తమవుతోంది అని పేర్కొన్నారు..



03-7Pg5_03-7Pg5.qxd 02/Jul/26 10:27 PM Page 1



# న్యాయప్రక్రియలో ఎఐ అవసరమా?




## ఆగ్రహించిన సుప్రీం కోర్టు

### సమగ్ర అధ్యయనానికి నిపుణులతో కమిటీ

### ఎఐతో తయారు చేసిన తీర్పులపై కఠినచర్యలని హెచ్చరిక

**న్యూఢిల్లీ, జులై 2:** న్యాయ ప్రక్రియలో ఎఐ వినియోగించడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. ఒక ముఖ్యమైన పరిణామంలో, ఒక దివాలా వివాదాన్ని పరిష్కరించే క్రమంలో నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి), నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌ఎటి) రెండూ ఉనికిలో లేని, ఎఐ సృష్టించిన "భ్రమలతో కూడిన" న్యాయపరమైన తీర్పులపై ఆధారపడ్డాయని గుర్తించిన సుప్రీంకోర్టు, ఆ రెండు ఫోరమ్‌లు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేసింది. న్యాయవాద వృత్తిలో ఎఐ వల్ల ఎదురవుతున్న పెరుగుతున్న సవాళ్లను పరిష్కరించేందుకు, తీర్పు ప్రక్రియలో కృత్రిమ మేధస్సు వాడకం వల్ల తలెత్తే సమస్యలను పరిశీలించడానికి నిపుణులతో కూడిన ఒక కమిటీని ఏర్పాటు చేయాలని జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరధేలతో కూడిన ధర్మాసనం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఆదేశించింది. "ఈ సమస్యలను వివరంగా పరిశీలించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను కూడా ఆదేశించాము" అని కోర్టు పేర్కొంది. బార్ కౌన్సిల్ ఈ విషయాన్ని అత్యంత తీవ్రంగా పరిగణించి, శ్రద్ధగా చర్చించి, నిబంధనల ఉల్లంఘునపై తీసుకునే క్రమశిక్షణా చర్యలతో పాటు, ఇలాంటి సంఘటనలను నివారించడానికి ఒక మార్గదర్శక సూత్రాన్ని నిర్దేశించాలి. తీర్పు ప్రక్రియలో సహాయపడటానికి ఎఐని ఉపయోగించవచ్చుని, కానీ అది మానవ తార్కికతను ఎప్పటికీ భర్తీ చేయలేదని కోర్టు పేర్కొంది. తీర్పు ప్రక్రియ ప్రతి దశలోనూ మానవుల "సంపూర్ణ, పూర్తి నియంత్రణ' 'లోనే ఉండాలని నొక్కి చెప్పింది. "ట్రిబ్యునల్ తన తీర్పుకు మద్దతుగా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా సృష్టించబడిన, ఉనికిలో లేని నకిలీ, కల్పిత సమాచారాన్ని పూర్వతీర్పులుగా భావించి దానిపై ఆధారపడిన కేసు ఇది. కింద పేర్కొన్న కారణాల దృష్ట్యా, తీర్పు ప్రక్రియ, దాని సమగ్రతను ధ్రువీకరించడానికి, కాపాడటానికి, ఎన్‌సిఎల్‌టి తీర్పును, అలాగే అప్పీల్‌లోని తీర్పును కూడా రద్దు చేశాము" అని కోర్టు వ్యాఖ్యానించింది. వివాదాస్పద ఉత్తర్వులను రద్దు చేయడమే కాకుండా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పట్ల న్యాయవ్యవస్థ వైఖరిని నిర్వచించడానికి ఈ కేసు ఒక అవకాశాన్ని కల్పించిందని కోర్టు అభిప్రాయపడింది. "అటువంటి తీర్పును పక్కన పెట్టడం వల్ల కలిగే అనివార్య పరిణామం కంటే, మా నిర్ణయాలు తీసుకోవడంలో ముఖ్యమైన విషయం ఏమిటంటే, తీర్పుల ప్రక్రియలో సహాయపడటానికి కృత్రిమ మేధ సాంకేతికతను స్వీకరించాలనే మా సంకల్పం. అదే సమయంలో, ప్రతి దశలోనూ మానవ ప్రమేయంతో తీర్పులపై పూర్తి, సంపూర్ణ నియంత్రణను కలిగి ఉంటామని చెబుతున్నాము, ప్రకటిస్తున్నాము" అని ధర్మాసనం పేర్కొంది. కృత్రిమ మేథతో తయారు చేసిన తీర్పులను ఎవరైనా కోర్టుల్లో ప్రదర్శిస్తే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించఇంది. కోర్టు పూర్వ తీర్పు ఆదేశాలను వెరిఫికేషన్ లేకుండా గుడ్డిగా నమ్మరాదు అని ధర్మాసనం సూచించింది.



## తమిళనాట అన్నాడిఎంకెకు భారీ షాక్

### మాజీ మంత్రులుసహా 15 వేలమంది మద్దతుదారులు టివికెలో చేరిక

**చెన్నై, జులై 2:** తమిళనాడులో అన్నాడీఎంకేకు కోలుకోలేనివిధంగా షాక్ తగిలింది. పార్టీకి చెందిన కీలకనేతలు, మాజీ మంత్రులు డాక్టర్ సి. విజయ భాస్కర్, ఎంఆర్ విజయభాస్కర్ అధికార తమిళగ వెట్రి కళగం (టివికె) పార్టీలో చేరారు. వీరితో పాటు సుమారు 15వేల మంది మద్దతుదారులు కూడా పార్టీ మారడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశ మైంది. చెన్నై సమీపంలోని మామల్లపురంలో గల ఒక ప్రైవేట్ రిసార్టులో గురువారం ఈ భారీ చేరికల కార్యక్రమం జరిగింది. టివికె ప్రధాన కార్యదర్శి ఎన్. ఆనంద్ ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించారు. మంత్రి ఆధవ్ అర్జున కొత్తగా చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అన్నాడీఎంకే నాయకత్వంపై తీవ్ర అసంతృప్తితోనే తాము పార్టీ మారుతున్నట్లు మాజీ మంత్రులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సి. విజయ భాస్కర్ మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు మరియు తర్వాతకూడా టివికెతో పొత్తు పెట్టుకోవాలని తాము పార్టీ అధిష్ఠానానికి పలుమార్లు సూచించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంజిఆర్ సిద్ధాంతాలకు విరుద్ధంగా డిఎంకేతో పొత్తుకు ప్రయత్నిస్తుండటంతో తాము పార్టీలో ఇమడలేకపోయామని తెలిపారు. ప్రజల్లో అపారమైన విశ్వాసం నింపిన విజయ్ నాయకత్వంలోని టివికెలో చేరడమే సముచితమైన నిర్ణయమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల అనంతరం జరిగిన అతిపెద్ద చేరికల్లో ఇది ఒకటి. ఈ ఇద్దరు మాజీ మంత్రులతో పాటు మరో మాజీ మంత్రి ఎస్. వలర్మతి, ఎఎస్ఎం ఆనందన్, పలువురు మాజీఎమ్మెల్యేలు, 208 మంది యూనియన్ కార్యదర్శులు కూడా టీవీకేలో చేరారు. కరూర్, పుదుక్కోట్టై జిల్లాల నుంచి సుమారు 200 బస్సులు, 600 కార్లలో భారీ సంఖ్యలో మద్దతుదారులు ఈ కార్యక్రమానికి తరలివచ్చారు.



## 1500 అడుగుల ఎత్తులో పెళ్లికి ప్రపోజ్‌చేసిన ప్రియుడు

### కట్‌చేస్తే అదుపులోకి తీసుకుని అరెస్టుచేసిన పోలీసులు

**వాషింగ్టన్, జులై 2:** అమెరికాలోని ప్రముఖ ఎంపైర్ స్టేట్ భవనంపైకి ఎక్కిన రష్యాకు చెందిన ఓ జంట అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. 1,454 అడుగుల ఎత్తులో ఉన్న ట్రాన్స్‌మిషన్ టవర్ శిఖరానికి చేరుకున్న వారు ప్రపంచ శాంతిని కోరుతూ ఓ బ్యానర్‌ను ప్రదర్శించారు. అనంతరం యువకుడు యువతికి లవ్ ప్రపోజ్ చేయగా ఆమె అంగీకరించింది. ఇద్దరూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ముద్దు పెట్టుకున్నారు. అయితే ఈ సాహసం చివరకు వారి అరెస్ట్‌కు దారితీసింది. ఏంజెలా నికోలా, వాన్యా బీర్కస్ అనే ఈ జంట ముఖాలకు మాస్కులు ధరించి టవర్‌పైకి ఎక్కింది. అక్కడి నుంచి తమ సాహసాన్ని సోషల్ మీడియాలో ప్రత్యక్ష ప్రసారం చేశారు. అనంతరం టవర్ దిగువ ప్లాట్‌ఫామ్‌కు చేరుకున్న తర్వాత వాన్యా మోకాలిపై కూర్చుని ఏంజెలాకు ప్రపోజ్ చేశాడు. ఆమె అంగీకరించడంతో ఇద్దరూ తమ ఎంగేజ్‌మెంట్‌ను అక్కడే జరుపుకొన్నారు. ఈ ఘటనతో అప్రమత్తమైన పోలీసులు భవనం అబ్జర్వేషన్ డెక్‌ను ఖాళీ చేయించారు. పరిసర ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేశారు. అనంతరం ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. టవర్‌పైకి వారు ఎలా చేరుకున్నారనే దానిపై దర్యాప్తు కొనసాగుతోంది. అనుమతి లేకుండా ఇంత ప్రమాదకరమైన ప్రాంతంలోకి వెళ్లడం తీవ్రముప్పని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## బండరాళ్లుపడి ఎనిమిది మంది కూలీలు మృతి



**బెంగళూరు, జులై 2:** కర్ణాటకలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బెంగళూరు దక్షిణ తాలూకాలోని మడ పట్టణంలో గురువారం భారీ బండరాయి కార్మికులపై పడటంతో ఎనిమిదిమంది మృతిచెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. కావేరి స్టోన్ క్రషర్ కంపెనీలో కూలీలు పనులు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులను బీహార్‌కు చెందిన వలస కూలీలుగా పోలీసులు గుర్తించారు. ప్రమాదం జరిగిన సమయంలో క్వారీలో సుమారు 15 నుంచి 20 మంది కార్మికులు ఉన్నారని వారు తెలిపారు. కొత్త క్రషర్ యూనిట్ ఏర్పాటు కోసం దాదాపు 100 అడుగుల ఎత్తులో ఒక హిటాచీ యంత్రం పని చేస్తోందని పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఒక పెద్ద బండరాయి జారి కింద ఉన్న కార్మికులపై పడిందని పోలీసులు వివరించారు. దీంతో ఏడుగురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. క్షతగాత్రులను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. శిథిలాలను తొలగించి చిక్కుకుపోయిన కార్మికులను రక్షించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. మరోవైపు బాధిత కుటుంబాలకు సమాచారం అందించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. క్వారీలో నిర్లక్ష్యం లేదా భద్రతా నిబంధనల ఉల్లంఘన జరిగిందా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాదంపై కర్ణాటక సిఎం శివకుమార్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు ఈ దుఃఖాన్ని తట్టుకునే శక్తి లభించాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికుల భద్రత, రక్షణ అనేది క్వారీ యజమానుల బాధ్యత అని ముఖ్యమంత్రి నొక్కిచెప్పారు. భద్రతా నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు తేలిన క్వారీలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని సిఎం శివకుమార్ హెచ్చరించారు.

## ఉక్రెయిన్‌పై విరుచుకుపడిన రష్యా

### పేలుళ్ల శబ్దాలకు వణికిన జనం



**కీవ్, జులై 2:** రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మరోసారి తీవ్రరూపం దాల్చుతోంది. చమురుశుద్ధి కార్మాగారాలు లక్ష్యంగా ఉక్రెయిన్ దాడులు చేయడంతో రష్యాలో ఇంధన కొరత నెలకొన్న సంగతి తెలిసిందే. ఇందుకు ప్రతిస్పందనగా అర్ధరాత్రి ఉక్రెయిన్‌పై మాస్కో దళాలు విరుచుకుపడ్డాయి. కొన్ని గంటలపాటు క్షిపణులు, డ్రోన్ల వర్షం కురిపించాయి. రాజధాని నగరం కీవ్‌లో భారీ పేలుళ్లు వినిపించడంతో ప్రజలు వణికిపోయారు. ఈ దాడుల్లో నివాస భవనాలు ధ్వంసమయ్యాయి. ఈ దాడిలో రష్యా బాలిస్టిక్, క్రూజ్ క్షిపణులు ఉపయోగించింది. దీంతో నిప్రో నదికి ఇరువైపులా ఉన్న ప్రాంతాల్లో తీవ్రనష్టం వాటిల్లింది. ఆ దాడుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధ్యక్షుడు జెలెన్‌స్కీ హెచ్చరించడంతో.. పలువురు మెట్రో స్టేషన్లలో ఆశ్రయం పొందారు. ఇది భయంకరమైన శత్రుదాడి అని ఉక్రెయిన్ ప్రభుత్వం అభివర్ణించింది. ఇప్పటి వరకు ఒకరు మరణించారని, 11 మంది గాయపడ్డారని వెల్లడించింది. ఇదిలా ఉంటే.. కొన్ని రోజులుగా ఉక్రెయిన్ ప్రతి రోజూ వందల డ్రోన్లతో విరుచుకుపడటంతో రష్యా ఉక్కిరిబిక్కిరి అయింది. డ్రోన్లు, క్షిపణుల విడిభాగాలు తయారుచేసే కార్మాగారాలు సహా సైనిక, ఇంధన స్థావరాలపై దాడులు చేసింది. ఆ తర్వాత మాస్కోలో బ్లాక్ రెయిన్ కురిసినట్లు వార్తలు కూడా వచ్చాయి. ఈ దాడులతో ఇంధన కొరత ఏర్పడింది. ఈ విషయాన్ని రష్యా అధ్య క్షుడు పుతిన్ కూడా స్వయంగా అంగీకరించారు. ప్రస్తుతం బంకులవద్ద ప్రజలు బారులు తీరుతు న్నారు. పెట్రోలు ధరలు పెరిగాయి. ప్రభుత్వం ఇంధనాన్ని రేషన్ పద్ధతిలో అందిస్తోంది. ఈ కొరతను అధిగమించేందుకు భారత్ నుంచి రష్యా పెట్రోల్ దిగుమతి చేసుకుంటోందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.

## ఇండో-యుఎస్ వాణిజ్య ఒప్పందం 99% కొలిక్కి

### - కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్



**న్యూఢిల్లీ,జులై 2:** భారత్, అమెరికా మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చర్చలు తుది దశకు చేరుకున్నాయి. ఈ ఒప్పందానికి సంబంధించిన ప్రక్రియ దాదాపు 99 శాతం పూర్తయిందని, కేవలం ఒకే ఒక్క కీలక అంశంపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. ఈ ఒప్పందం ద్వారా అమెరికా మార్కెట్‌లో ప్రాంతీయ పోటీదారుల కంటే భారత్‌కు విశేష ప్రాధాన్యత లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో నిర్వహించిన ఇండోపాన్ స్ట్రాటజిక్ డైలాగ్ కార్యక్రమంలో పీయూష్ గోయల్ ప్రసంగించారు. ఈ ఒప్పందం ఇరు దేశాలకూ అత్యంత న్యాయబద్ధంగా, సమతుల్యంగా ఉంటుందని ఆయన అభివర్ణించారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో, భారత్‌కు సుంకాల పరంగా లబ్ధి చేకూర్చేందుకు అవసరమైన చట్టబద్ధమైన యంత్రాంగాన్ని రూపొందించడమే ప్రస్తుతం మిగిలి ఉన్న ఆ ఒక శాతం అడ్డంకి అని ఆయన వివరించారు. తయారీ రంగంలో ప్రధాన పోటీదారులైన చైనా, ఆగ్నేయాసియా దేశాల కంటే భారత్‌కు మెరుగైన ప్రాధాన్యత లభించాలని కోరుతున్నామని, దీనిపై అమెరికా సానుకూలంగా స్పందిస్తూ పరిష్కారం కోసం చురుగ్గా కృషి చేస్తోందని తెలిపారు. 2025 ప్రారంభంలో ఈ సమగ్ర ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు మొదలయ్యాయి.

ఈ యేడాది ఫిబ్రవరిలో మధ్యంతర ఒప్పందానికి సంబంధించిన ముసాయిదాను ఇరు దేశాలు ప్రకటించాయి. భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ సైతం ఈ ఒప్పందం తుది దశకు చేరుకుందని, కేవలం ఒక శాతం మాత్రమే పెండింగ్‌లో ఉందని ఇటీవల వ్యాఖ్యానించారు. జూలై 24న అమెరికా తాత్కాలిక టారిఫ్ చర్యల గడువు ముగియనున్న నేపథ్యంలో, ఆలోపే తొలి విడత ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## అయోధ్య రామమందిరం విరాళాల అక్రమాలపై కీలక భేటీ

### 6న ట్రస్ట్ అత్యవసర సమావేశం


**అయోధ్య, జులై 2:** రామమందిరంలో భక్తుల విరాళాల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ జూలై 6న కీలక సమావేశాన్ని నిర్వహించనుంది. ట్రస్ట్‌కు చెందిన అన్ని ట్రస్టీలతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ డాక్టర్ అనిల్ మిశ్రా సమర్పించిన రాజీనామాలపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం. విరాళాల దొంగతనం కేసు వెలుగులోకి వచ్చిన అనంతరం గత నెల 27న చంపత్ రాయ్, డాక్టర్ అనిల్ మిశ్రా తమ పదవులకు రాజీనామా చేశారు. ట్రస్ట్ నిబంధనల ప్రకారం వారి రాజీనామాలను ఆమోదించాలంటే సమావేశానికి హాజరయ్యే సభ్యుల్లో మూడింట రెండొంతుల మెజారిటీ మద్దతు అవసరం. ట్రస్ట్ నిబంధనల ప్రకారం పదవికి మాత్రమే రాజీనామా ఆమోదించబడుతుంది. అయితే ట్రస్టీ సభ్యత్వం మాత్రం కొనసాగుతుంది. దీంతో రాజీనామాలు ఆమోదమైనా చంపత్ రాయ్, అనిల్ మిశ్రా తమ అధికారిక బాధ్యతల నుంచి మాత్రమే తప్పుకుంటారు. ట్రస్ట్ జీవితకాల సభ్యులుగా మాత్రం కొనసాగుతారు.

ఇదే నిబంధన ఇతర పదాధికారులకు కూడా వర్తిస్తుంది. ప్రస్తుతం ట్రస్ట్‌లో మొత్తం 14 మంది సభ్యులు ఉండగా, ఇద్దరు రాజీనామా చేయడంతో మిగిలిన 12 మంది ట్రస్టీలు ఈ అంశంపై ఓటింగ్ ద్వారా తమ అభిప్రాయాన్ని వెల్లడించనున్నారు. ఇదిలా ఉండగా, ఈ వ్యవహారంలో మాజీ ట్రస్ట్ పదాధికారులపై న్యాయపరమైన ఒత్తిడి కూడా పెరుగుతోంది. ఫైజాబాద్ బార్ అసోసియేషన్ చంపత్ రాయ్, డాక్టర్ అనిల్ మిశ్రా, ఆలయ నిర్మాణ బాధ్యుడు గోపాల్ రావుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేసింది.

## కాంగ్రెస్‌లో విలీనం కానున్న శరద్‌పవార్ ఎన్సీపీ?

**ముంబయి, జులై 2:** మహారాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులకు దారితీసే ఒక సంచలన పరిణామం తెరపైకి వచ్చింది. సీనియర్ నేత శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ (ఎస్పీ శరద్ పవార్ శ్రేణి) పార్టీని, కాంగ్రెస్‌లో విలీనం చేసేదిశగా ఇరుపార్టీల మహారాష్ట్ర రాష్ట్రస్థాయి విభాగాలమధ్య అత్యంత రహస్యంగా చర్చలు జరుగుతున్నట్లు విశ్వసనీయసమాచారం వెలుగులోకి వచ్చింది. ఒకవేళ ఈ విలీనంగనుక సఫలమైతే, మహారాష్ట్ర ప్రతిపక్ష రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది. ప్రస్తుతం ఈ విలీన ప్రతిపాదనలపై రాష్ట్రస్థాయిలోనే ప్రాథమిక చర్చలు జరుగుతున్నాయి. ఎన్సీపీ (ఎస్పీ) తమ పార్టీ అంతర్గతంగా నేతలందరి మధ్య ఒక ఏకాభిప్రాయాన్నిసాధించిన తర్వాత, ఈ అంశాన్ని ఢిల్లీలోని కాంగ్రెస్ అధిష్ఠానం వద్దకు తీసుకెళ్లి తుది నిర్ణయం తీసుకోనున్నారు. నిజానికి, 2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఈ విలీన ఆలోచన వచ్చినప్పటికీ ఎన్నికల ప్రచారం, వ్యూహాల బిజీ వల్ల దీనిని తాత్కాలికంగా పక్కన పెట్టారు. ఇప్పుడు ఎన్నికలు ముగిసిన తర్వాత ఈ ప్రక్రియ మళ్లీ ఊపందుకుంది. ఈ విలీన వార్తలు మహా వికాస్ అఘాడీ (ఎంవిఎ కాంగ్రెస్, ఎన్సీపీ శరద్ పవార్, శివసేన ఉద్ధవ్ థాకరే) కూటమిలో తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఇటీవల ఉద్ధవ్ థాకరే వర్గంలో జరిగిన తిరుగుబాట్లు, అలాగే కూటమి ఐక్యతపై స్వయంగా ఉద్ధవ్ థాకరే బహిరంగంగానే అనుమానాలు వ్యక్తం చేయడంతో ఎంవిఎ భాగస్వామ్య పక్షాల మధ్య ఇప్పటికే తీవ్రమైన భేదాభిప్రాయాలు నడుస్తున్నాయి. ఈ తరుణంలో కాంగ్రెస్, ఎన్సీపి విలీన ప్రయత్నాలు కూటమి భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. 1999లో సోనియా గాంధీ విదేశీ మూలాల వివాదం నేపథ్యంలో శరద్ పవార్ కాంగ్రెస్ నుండి బయటకు వచ్చి నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)ని స్థాపించారు. సరిగ్గా 27 ఏళ్ల తర్వాత మళ్లీ అదే కాంగ్రెస్ గూటికి శరద్ పవార్ చేరబోతుండటం గమనార్హం. 2023లో ఆయన సోదరుడి కుమారుడు అజిత్ పవార్ సొంతంగా చీలిక తెచ్చి అధికార పక్షంతో చేతులు కలపడంవల్ల ఎన్సీపీ మరింత బలహీన పడింది. ఇటీవల అజిత్ పవార్ గ్రూపుతో విలీనాన్ని పూర్తిగా తోసిపుచ్చిన శరద్ పవార్.. ఇప్పుడు కాంగ్రెస్‌తో చేతులు కలిపేందుకు సిద్ధమవ్వడం మహారాష్ట్ర పాలిటిక్స్‌లో అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది.

## చేతన్, సియాలకు పాలిగ్రాఫ్ టెస్ట్ తప్పనిసరి



### కోర్టులో పిటిషన్ దాఖలుచేసిన పోలీసులు

### ఎవరు తోసివేసారనేందుకు ఆధారాలు లేవని వెల్లడి

**పూణె, జులై 2:** రియాల్టీ వ్యాపారి కేతన్ అగర్వాల్ హత్యకేసులో పోలీసులు నిందితురాలు సియా గోయల్, ఆమె ప్రియుడు చేతన్ చౌదరిలకు పాలిగ్రాఫ్ పరీక్ష నిర్వహించేందుకు అనుమతించాలంటూ కోర్టులో పిటిషన్ దాఖలుచేసారు. న్యాయపరమైన ప్రక్రియ అనుసరించేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పర్యవేక్షణలో ఈ పిటిషన్ దాఖలయింది. దర్యాప్తు అధికారులు ఇందుకు సంబంధించి విభిన్నరకాలుగా నిందితులు ఇచ్చిన వాంగ్మూలాలను పరిశీలించారు. అలాగే కేతన్‌ను లోయలోకి ఎవరు తోసివేసారనడానికి ఆధారాలు కూడా లేవని దర్యాప్తు అధికారులు కోర్టుకు నివేదించారు. ప్రస్తుతం నిందితులిద్దరూ శుక్రవారం వరకూ పోలీసుల కస్టడీలోనే ఉన్నారు. కేతన్ మొబైల్ ఫోన్ హత్యతర్వాత కొంతసేపటివరకూ సియావద్దనే ఉందని, ఆ తర్వాత ఆతని కుటుంబానికి అందచేసినట్లు గుర్తించారు. ఆ ఫోన్‌తో ఏంచేసారన్నదే ఇపుడు విచారణలో తేలాల్సి ఉందన్నారు. సియా, ఆమె బాయ్‌ఫ్రెండ్ చేతన్ ఇద్దరూ డేటాను ధ్వంసం చేసారనేందుకు ఆధారాలు లేవని అన్నారు. అయితే కీలకమైన సాక్ష్యం ఏదయినా తొలగించారా అన్నది పరిశీలిస్తున్నట్లు ఒక పోలీస్ అధికారి తెలిపారు. పూణె రూరల్ పోలీసులు క్రైమ్‌సీన్‌ను ఇప్పటికే రీకన్‌స్ట్రక్షన్ చేసారు. చేతన్ చౌదరిని కూడా తీసుకెళ్లి హత్యాస్థలంలో రీకన్‌స్ట్రక్షన్ చేసారు. ఈ సమయంలోనే ఒక డమ్మికేతన్ బొమ్మను సియా, కేతన్‌లతోనే లోయలోకి తోసివేయించి సంఘటన క్రమాన్ని నమోదుచేసుకున్నారు.


# సంక్షిప్త వార్తలు

## అరేబియా సముద్రంలో అమెరికా హెలికాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండింగ్: ఒకరు గల్లంతు



**వాషింగ్టన్, జులై 2:** అరేబియా సముద్రంలో గస్తీ కాస్తున్న అమెరికా ఎంహెచ్-60 ఎస్ సీహాక్ హెలికాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండ్ అయింది. ఈ ఘటనలో అందులోని సిబ్బంది ఒకరు గల్లంత య్యారు. ఈ విషయాన్ని అమెరికా నేవీ ఫిఫ్త్ ఫ్లీట్ కూడా ధ్రువీకరించింది. 'సముద్రంలో గల్లంతైన అమెరికా ఎయిర్ క్రూమెన్ కోసం మా దళాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. ఈ ఎమర్జెన్సీ ల్యాండింగ్‌పై దర్యాప్తు చేపట్టాము' అని ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రాంతంలోని అమెరికా విమానకవాహక నౌక యుఎస్ఎస్ జార్జ్ హెచ్‌డబ్ల్యు బుష్‌పై మోహరించిన హెలికాప్టర్ ఇది.

## కొత్త ఎయిర్‌ఫోర్స్‌వన్‌లో ప్రయాణించిన ట్రంప్



**నార్త్ డకోటా(యుఎస్),జూలై 2:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, సుమారు 37 యేళ్ల తర్వాత ఆధునికీకరించిన నూతన ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో తొలిసారిగా ప్రయాణించారు. నార్త్ డకోటాలో ఏర్పాటు చేసిన థియోడర్ రూజ్‌వెల్ట్ ప్రెసిడెన్షియల్ లైబ్రరీ ప్రారంభోత్సవానికి ఆయన ఈ కొత్త విమానంలోనే విచ్చేశారు. దాదాపు నాలుగు దశాబ్దాల విరామం అనంతరం అందుబాటులోకి వచ్చిన కొత్త అధ్యక్ష విమానంలో ఇదే తన తొలి ప్రయాణమని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. మెడోరాలో నిర్వహించిన కార్యక్రమంలో మద్దతుదారులను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగించారు.

## ఇస్రో చైర్మన్ కార్యాలయానికి బాంబు బెదరింపు

**బెంగళూరు,జులై 2:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రధాన కార్యాలయంలో గురువారం బాంబు బెదిరింపు కలకలం రేపింది. బెంగళూరులోని ఇస్రో కేంద్రానికి ఈమెయిల్ ద్వారా వచ్చిన ఈ బెదిరింపు నకిలీదని పోలీసులు నిర్ధారించారు. దీంతో అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ఇస్రో కేంద్రంలోని చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ కార్యాలయానికి ఈ బెదిరింపు మెయిల్ అందింది. వెంటనే అప్రమత్తమైన ఇస్రో సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ముందుజాగ్రత్త చర్యగా ప్రాంగణాన్ని ఖాళీచేయించి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు కానీ, అనుమానాస్పద వస్తువులు కానీ లభ్యం కాలేదని అధికారులు స్పష్టం చేశారు.

## అమర్‌నాథ్ యాత్రికుల తొలిబృందానికి ఘనస్వాగతం

**శ్రీనగర్,జూలై 2:** అమర్‌నాథ్ యాత్రకు సర్వం సిద్ధమైంది. ఈ యాత్రలో భాగంగా బల్తాల్ మార్గంలో బయల్దేరిన తొలి బృందం యాత్రికులకు నేడు ఘన స్వాగతం లభించింది. జమ్మూశ్రీనగర్ జాతీయ రహదారిపై ఉన్న రాంబన్ జిల్లాలోని చందర్‌కోట్ వద్ద ఏర్పాటు చేసిన లంగర్ (ఉచిత భోజనశాల) వద్ద అధికారులు, స్థానికులు యాత్రికులను సాదరంగా ఆహ్వానించారు. రాంబన్ జిల్లా యంత్రాంగం, పౌర సమాజ ప్రతినిధులు, పలు లంగర్ సంస్థలు కలిసి యాత్రికులకు శుభాకాంక్షలు తెలిపి, వారి యాత్ర ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు.

## మణిపూర్‌లో మళ్లీ హింస, 20 ఇళ్లకు నిప్పు

**ఇంఫాల్,జులై 2:** మణిపూర్ రాష్ట్రంలో హింస మళ్లీ ప్రజ్వరిల్లింది. భారత్‌మయన్మార్ సరిహద్దు సమీపంలోని కామ్‌జోంగ్ జిల్లాలో నాగా, కుకీ సామాజిక వర్గాల మధ్య సాయుధ ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఇరు వర్గాలకు చెందిన సాయుధ బృందాలు పరస్పరం దాడులు చేసుకోవడంతో పాటు గ్రామాల్లోని 20కి పైగా ఇళ్లకు నిప్పు పెట్టారు. ఉదయం వేళ ఒక కుకీ గ్రామం నుండి వచ్చిన సాయుధులు సమీపంలోని నాగా గ్రామంపై దాడి చేసి 10 ఇళ్లను తగలబెట్టడంతో ఈ హింస ప్రారంభమైంది. ఆ తర్వాత మధ్యాహ్నం దీనికి ప్రతికారంగా మరో వర్గం జరిపిన ఎదురు దాడుల్లో నాగా కమ్యూనిటీకి చెందిన ఇంకో 12 ఇళ్లు అగ్నికి ఆహుతయ్యాయి.

3-7Pg6exHMNWJQE_3-7Pg6exHMNWJQE.qxd 02/Jul/26 10:45 PM Page 1



## జగన్‌వి అనాలోచిత వ్యాఖ్యలు



**విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమరావతి పై అనాలోచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆరోపించారు. అమరావతి రాజధాని అభివృద్ధిని చూసి ఓర్వలేని స్థితికి దిగజారుతున్నారు. మూడు రాజధానుల పేరుతో ఎన్నికలకు వెళ్లే వైసిపికి 11 సీట్లు వచ్చాయన్నారు. ఇప్పుడు మాఫిగన్ అనే పిచ్చివేషంతో ఎన్నికలకు వెళ్తే సున్నాకే పరిమితం అవుతారంటూ వ్యాఖ్యానించారు. గురువారం టిడిపి కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేయాలనే లక్ష్యంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మూడు రాజధానుల పేరుతో ఒక్క ఇటుక కూడా పెట్టకుండా రూ.450 కోట్లు ఖర్చుపెట్టి తన కోసం ప్యాలెస్ నిర్మించుకున్నారని ఆరోపించారు. అమరావతి నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చూసి తట్టుకోలేని స్థితిలో జగన్ విషం కక్కారని మంత్రి వ్యాఖ్యానించారు. అమరావతిపై తనకు ఎటువంటి వ్యతిరేకతలేదని, 33వేల ఎకరాలు కావాలని చెప్పిన వ్యక్తి జగన్ అని గుర్తుచేశారు. అమరావతిలోనే ఇల్లు కట్టుకున్నానని ఆనాడు ప్రజల్ని నమ్మించారన్నారు. అందుకే ప్రజలు బుద్ధి చెప్పి వైసిపిని 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. జగన్ తన పతనాన్ని తానే కొనితెచ్చుకుంటున్నారన్నారు. అమరావతి రాజధాని నిర్మాణాన్ని ఆయన అడ్డుకోలేరని మంత్రి మండిపడ్డారు.

## రాజధానిపై జగన్‌ది పూటకో మాట



**విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర రాజధానిపై పూటకో మాట మారుస్తున్నారని మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎలా ముందుకు తీసుకెళ్లాలా అని చూస్తుంటే, జగన్ మాత్రం అభివృద్ధిని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చంద్రబాబు ముందుకెళ్తుంటే, జగన్ కుట్రపూరితంగా మాట్లాడుతున్నారని విరుచుకు పడ్డారు. సైకో ఆలోచనలు కలిగిన వ్యక్తి ఏ విధంగా ఉంటాడో దానికి జగన్ మాట్లాడిన మాటలే నిదర్శనమన్నారు. జగన్ కావాలంటే అమరావతే రాజధాని అని అంటారని.. మరికాసేపటికి, మా స్టాండ్ మాఫిగన్ అని మాట్లాడతారని ఎద్దేవా చేశారు. ఎవరైనా పవర్‌లో ఉంటే చూడలేని మనస్తత్వం ఉన్నవాడినే సైకో అంటారని పేర్కొన్నారు. ఏం మాట్లాడుతారో, ఏం చేస్తారో తెలియని పరిస్థితి జగన్‌దని ఎద్దేవా చేశారు. జగన్ మొన్న తన మనుషులను పంపించి రాజధానిలో సిఆర్‌డిఎ పరిధిలో కమిటీ పేరుతో కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. దీంతో అక్కడి రైతులు, ప్రజలు వారిని తరిమి కొట్టారని ఎద్దేవా చేశారు. ఇంకా ఈ దొంగ డ్రామాలు, నాటకాలు ఆడుతూ ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారని కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. కులాలు, మతాల మధ్య వైషమ్యాలు సృష్టించాలని కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రజలందరూ పరిస్థితిని దయచేసి గమనించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

## జగన్ అసెంబ్లీకి రారు, ప్రజల్లోకి రారు



**సచివాలయం, జులై 2 ప్రభాతవార్త:** "ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇప్పుడు మాటలు విని మారిపోరు, కళ్లముందు ఫలితాలను చూసే దశకు వచ్చారు. కాబట్టే ప్రజలు మిమ్మల్ని 151సీట్ల నుండి కేవలం 11స్థానాలకే పరిమితం చేసి బుద్ధి చెప్పారు" అని రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ, జగన్ అసెంబ్లీకి రారు, ప్రజల్లోకి రారు, అడిగిన దానికి జవాబు చెప్పరు, ఒక పక్క ఓట్లేసిన ప్రజలకు సొంత కార్యకర్తలకు సమాధానం చెప్పుకోలేని పరిస్థితి అని ఎద్దేవా చేశారు "గత ఐదేళ్లలో మూడు రాజధానులు అనే చిత్ర విచిత్ర వేషాలతో ఈ రాష్ట్రంలోని స్కూల్ పిల్లల్లో సైతం రాజధాని ఏదో తెలియని తీవ్ర అయోమయాన్ని సృష్టించారు. ఆ మూడు రాజధానుల్లో కనీసం ఒక్క ఇటుకైనా పెట్టారా? ఒక్క దోసెడు మట్టినైనా వేశారా? లేదు. కానీ ప్రజల రూ.500 కోట్లు తగలేసి రిషికొండకు గుండు గీసి ఒక లగ్జరీ ప్యాలెస్ నిర్మించుకున్నారు. మీ ప్యాలెస్ పిచ్చి రాష్ట్రానికి పెను ప్రమాదమని గ్రహించే ప్రజలు మిమ్మల్ని ఓడించారు" అని మంత్రి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తుందని, ప్రతిపక్షం ఇప్పటికైనా తన ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని మంత్రి హితవు పలికారు.

## అభివృద్ధికి, విధ్వంస రాజకీయాలకు మధ్యే పోటీ



**విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతిపై వైసిపి అధినేత జగన్ చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా గందరగోళంగా ఉన్నాయని మాజీ మంత్రి, టిడిపి సీనియర్ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ఒకప్పుడు అమరావతికి మద్దతు తెలిపిన జగన్, తర్వాత మూడు రాజధానుల ప్రతిపాదన తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు మాఫిగన్ పేరుతో మరో కొత్తనాటకం తీసుకురావడం ప్రజలను అయోమయంలోకి నెట్టే ప్రయత్నమేనని ఆరోపించారు. అభివృద్ధికి, విధ్వంస రాజకీయాలకు మధ్యే అసలు పోటీ జరుగుతోందన్నారు. అమరావతిలో ఇప్పటికే వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని సోమిరెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలతో పాటు జాతీయ బ్యాంకులు, విద్యాసంస్థలు, ప్రైవేట్ కంపెనీలు అక్కడ ఏర్పాటవుతున్నాయని చెప్పారు. క్వాంటమ్ వ్యాలీ, ఏఐ యూనివర్సిటీ, ఎన్ఐడీ, ఎయిమ్స్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు అమరావతికి వస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో రాజధానిపై అనిశ్చితి సృష్టించడం రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమన్నారు. ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిపైనే దృష్టి పెట్టిందని, ఆ లక్ష్యసాధన కోసం సిఎం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని, మంత్రి లోకేశ్ పెట్టుబడులు తీసుకురావడానికి ప్రపంచవ్యాప్తంగా పర్యటిస్తున్నారని వివరించారు. రాష్ట్ర భవిష్యత్తుతో రాజకీయాలు చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు.

# ప్రభుత్వ స్కూళ్లకు కార్పొరేట్ హంగులు

- విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు
- ఆర్ఎస్ఆర్ స్కూల్‌లో మంత్రి నారాయణ ఉన్నత స్థాయి సమీక్ష



**నెల్లూరు (వైద్యం), జులై 2, ప్రభాతవార్త:** నెల్లూరు ప్రభుత్వ స్కూళ్లకు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అమలు చేస్తున్న విద్యా విధానంతో కార్పొరేట్ హంగులు కనిపిస్తున్నాయని, ప్రభుత్వ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని రాష్ట్ర పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. గురువారం ఆర్.ఎస్.ఆర్ స్కూల్‌లో మంత్రి నారాయణ ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్య అందిస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్లా, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, పొంగూరు శరణిలతో కలిసి ఉపాధ్యాయులతో పాల్గొన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యా ప్రమాణాలపై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిరంతర సమీక్షలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. నగరంలోని 15 పాఠశాలలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని జెడ్పీ స్కూళ్లను కూడా మోడల్ స్కూల్స్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. నెల్లూరులోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి విద్యావ్యవస్థలో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతున్నట్లు మంత్రి తెలిపారు. గత ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురై మూతపడి ఉన్న వి.ఆర్ స్కూల్‌ను, కూటమి ప్రభుత్వం రాగానే ఇచ్చిన హామీ మేరకు వెంటనే పునఃప్రారంభించామని తెలిపారు. ఈ స్కూల్లో కేవలం 1,000 సీట్లు ఉంటే, రికార్డు స్థాయిలో 2,000 మందికి పైగా విద్యార్థులు అడ్మిషన్ల కోసం పోటీ పడటం ప్రభుత్వ పాఠశాలలపై పెరిగిన నమ్మకానికి నిదర్శనమన్నారు. ఇదే స్ఫూర్తితో నెల్లూరు నగరంలోని మరో 15 పాఠశాలలను దాతల సహకారంతో కార్పొరేట్ స్థాయిలో డెవలప్ చేయాలని నిర్ణయించామని, దాతలు దేవిరెడ్డి సుధాకర్ రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిల ఆర్థిక సహాయంతో నూతన భవనాలను నిర్మించామన్నారు. మౌలిక సదుపాయాలకే పరిమితం కాకుండా, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించేందుకు నారాయణ విద్యాసంస్థల ప్రతినిధి పొంగూరు శరణి నేతృత్వంలో ప్రత్యేక ఫౌండేషన్ కోర్సులు, స్టడీ మెటీరియల్, క్వశ్చన్ పేపర్లను ఉచితంగా అందజేస్తూ అండగా నిలుస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లలో ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు, కష్టపడే విద్యార్థులు ఉన్నారని, వారికి సరైన మార్గదర్శకత్వం అందిస్తే అద్భుతాలు సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, డిఈఓ బాలాజీరావు, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ, మాజీ జెడ్పిటిసి విజేతా రెడ్డి, కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి, హైస్కూల్స్ ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పలుగు చేత పట్టిన మంత్రి శ్రీనివాస్

- జిన్నాంలో విబి జి రామ్‌జి పనులు ప్రారంభం



**విజయనగరం, జులై 2 ప్రభాతవార్త:** విజయనగరం మండలం జిన్నాం గ్రామంలో విబి జి రామ్‌జి పథకం పనుల ప్రారంభ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పలుగు చేత పట్టారు. జిన్నాం గ్రామంలో తామర చెరువులో విబి జి రాంజీ పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విబి జి రామ్‌జి పథకంలో కేంద్ర ప్రభుత్వం వంద రోజుల నుంచి అదనంగా 25 రోజులు పాటు పెంచడంతో పాటు నూతనంగా తెచ్చిన పాలసీలు పేద ప్రజలకు రైతులకు ఎంతో మేలు చేసే విధంగా ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ అధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు చేపట్టి వేతనాలు పొందాలని సూచించారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఈ పథకంలో గత రెండు సంవత్సరాలుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో దేశంలో మూడవ స్థానంలో నిలవడం జరిగిందన్నారు. వేసవి సమయంలో పనులు లేనీ కారణంగా మన జిల్లా వాసులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లేవారని, ఉపాధి హామీ పనులు అటువంటి వారిని ఆదుకోవడం జరిగిందన్నారు. పేద ప్రజల ఉన్నతి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ పివి గోపాలరాజు, మక్కువ శ్రీధర్, బంగారు నాయుడు, చిన్నం నాయుడు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## విబిజి రాంజీ పథకం పేదలకు వరం

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**గాలివీడు. జులై 2 ప్రభాతవార్త:** ఎంజిఎన్‌ఆరఈజిఎస్ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న విబిజి రాంజీ పథకం పేద ప్రజలకు వరం లాంటిదని రాష్ట్ర రవాణా యువజన శాఖ మంత్రి మండి పల్లి రాంప్రసాద్ రెడ్డి కొనియాడారు. పేద ప్రజలకు ఉపాధి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచు కొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ఈ పథకాన్ని ఆయన గురు వారం మండలంలోని అరవిడి పంచాయితీలో కూలీలతో కలిసి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ లాంటి ప్రాంతాలలోని ప్రజలకు విబి జి రాంజీ పథకం ఎం తో ఉపయోగకరంగా ఉంటాదని తెలిపారు. ఈ పథకం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలు కూలీలకు ఆర్థిక భద్రతనుస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, నీటి భద్రత, జీవనోపాధి వనరులు, ఆస్తుల సృష్టి ద్వారా గ్రామీణ అభివృద్ధికి ఈ పథకం ఎంతో దోహదపడుతుందని కొనియాడారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలని ఈ సందర్భంగా అధికారులుకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు పురం హేమ్‌కుమార్ రెడ్డి, టిడిపి నాయకులు మందపాటి రవీంద్రబాబు, అధికారులు, ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

# సాక్ష్యాల నాశనానికి కుట్ర

- రికార్డులను తారుమారు చేస్తూ అడ్డంగా దొరికిపోయిన కార్యదర్శి
- పైడిభీమవరం పంచాయతీ నిధుల దుర్వినియోగం సర్వత్రా విమర్శలు

**రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), జులై 2 ప్రభాతవార్త:** ప్రజాధనానికి రక్షణగా నిలవాల్సిన అధికార యంత్రాంగమే అవినీతి ఊబిలో కూరుకుపోతే ఎలా ఉంటుందో చెప్పడానికి శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం, పైడిభీమవరం పంచాయతీ నిధుల గోల్‌మాల్ ఉదంతమే ప్రత్యక్ష నిదర్శనం. దాదాపు రూ.7.50కోట్లు సాధారణ నిధుల దుర్వినియోగంపై ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా తీవ్ర దుమారం రేగుతుండగా తాజాగా ఈ అవినీతి తిమింగలాలు తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు వేసిన మరో ముఠా వ్యూహం బయటపడింది. బాధ్యులైన అధికారులు, ప్రైవేటు వ్యక్తులు కలిసి పంచాయతీకి సంబంధించిన అధికారిక రికార్డులను పైడిభీమవరం పంచాయతీ కార్యదర్శి ఇంట్లో రహస్యంగా తారుమారు చేస్తున్నట్లు కొన్ని కీలకమైన ఫోటోలు లభించడం స్థానికంగా తీవ్ర సంచలనం రేకెత్తిస్తోంది.

**ఉన్నతాధికారుల విచారణకు ముందే రికార్డుల మాయం:** ఈ భారీ కుంభకోణం ఉన్నతాధికారులు ప్రత్యేక విచారణకు ఆదేశించే అవకాశం ఉందనే ముందస్తు సమాచారంతో అవినీతి సూత్రదారులు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ఎలాంటి తీర్మానాలు, ముందస్తు అనుమతులు లేకుండా కేవలం 10నెలల స్వల్ప కాలంలోనే రూ.7.50కోట్లను ప్రైవేటు వ్యక్తుల ఖాతాల్లోకి మళ్లించారు. ఇప్పుడు ఆపాపం ఎక్కడ పట్టుబడుతుందో అనే భయంతో రికార్డులను తారుమారు చేస్తూ దొరికిపోవడంతో నిందితుల్లో వణుకు మొదలైంది. ఈ కుంభకోణంలో బోగస్ బిల్లులు, నకిలీ వ్యయాల పేరిట సాగిన దోపిడి వివరాలు చూస్తే సామాన్యుడు సైతం ముక్కున వేలేసుకోవాల్సిందే.


**అడ్వాన్స్‌పేరుతో దోపిడి.. నిబంధలన్నీ బేఖాతరు:** కమీషన్ల కక్కుర్తితో సి.సి రోడ్డు, డ్రైనేజీ పనుల పేరు చెప్పి నిబంధనలను పూర్తిగా గాలి కొదిలేశారు. అసలు పనులు ఏ మేరకు జరిగాయనే కనీస పర్యవేక్షణ లేకుండానే రూ.2.52కోట్లు అడ్వాన్స్ పేమెంట్ల రూపంలో ప్రైవేటు వ్యక్తుల ఖాతాల్లోకి జమైపోవడం వెనుక కొందరి హస్తం ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

ప్రజలు ఆవేదన: పరిశ్రమల నుంచి ఏటా రూ.కోట్లు రూపాయలు పన్నుల రూపంలో నిధులు వస్తున్నప్పటికీ పంచాయతీలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించక పోవడం దారుణం. రూ.కోట్లు నిధులను కొందరు స్వార్ధపరుల జేబుల్లోకి వెళ్లడం దారుణమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బహిరంగ విచారణ చేపట్టాలి: నిధుల గోల్‌మాల్‌పై బహిరంగా విచారణ చేపట్టాలని ఇటు ప్రజలు, అటు ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ వ్యవహారంపై కేవలం కంటితుడుపు ప్రాథమిక విచారణలతో సరిపెడితే ఊరుకునేది లేదని ప్రజలు, ప్రతిపక్షాలు హెచ్చరిస్తున్నాయి.



## దుర్గమ్మ ఆలయానికి భక్తుల విరాళాలు

**ఇంద్రకీలాద్రి, జులై 2 ప్రభాతవార్త:** దుర్గమ్మ భక్తులు గురువారం విరాళాలు సమర్పించారు. నిత్యాన్న దాన పథకమునకు కరీంనగర్ జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన సింగీతం నాగమణి రూ.2లక్షల విరాళమును అందించారు. హైదరాబాద్ కు చెందిన మెరుగు గోపాల్ యాదవ్ కుటుంబ సభ్యులతో కలసి రూ.1లక్ష విరాళమును అందించారు. విజయవాడకు చెందిన ఉమ్మడిశెట్టి సీతా రామయ్య, వెంకటలక్ష్మి దంపతులు పరశురామయ్య పేరు మీద రూ.1లక్ష విరాళమును అందించారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.



## ప్రసవ సమయంలో అత్యవసర చికిత్సపై శిక్షణ



**విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** గర్భిణుల ప్రసవ సమయంలో అధిక రక్తస్రావం, అధిక రక్తపోటు (బిపి) వల్ల మూర్ఛ వంటి సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గైనకాలజిస్టులు, పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్ నర్సులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల (సిహెచ్)లకు శిక్షణ ఇప్పించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ నిర్ణయించింది. ఈ క్రమంలో స్వస్తి (ఎన్‌జిఒ), ఫెడరేషన్ ఆఫ్ అబెస్ట్రిక్ అండ్ గైనకాలజికల్ సొసైటీస్ ఆఫ్ ఇండియా (ఫాగ్సీ)ల నుంచి సాంకేతిక సహకారాన్ని తీసుకోవడం ప్రారంభించింది. రాష్ట్రంలో తొలివిడత కింద అనంతపురం, బాపట్ల జిల్లాల్లో పనిచేసే గైనకాలజిస్టులు, పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్ నర్సుల (సుమారు 75 మంది)కు మంగళగిరిలో రెండురోజుల శిక్షణ గురువారంతో ముగిసిందని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఇంఛార్జి కమిషనర్ చక్రధర్ బాబు వెల్లడించారు. దశలవారీగా మిగిలిన జిల్లాల్లోని వారికి శిక్షణ ఇస్తామని చెప్పారు.

## సమష్టి కృషితోనే పురస్కారం

- అభినందన సభలో ఆవుల చంద్రశేఖర్



**విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమిష్టికృషితోనే తనకు అంతర్జాతీయ అవార్డు దక్కిందని ఎపి ఔషధ, సుగంధ మొక్కల బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆవుల చంద్రశేఖర్ అన్నారు. లండన్ నగరంలోని బ్రిటన్ పార్లమెంట్ హాల్‌లో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అంతర్జాతీయ అవార్డును ఇటీవల అందుకుని గురువారం తొలిసారిగా కార్యాలయానికి విచ్చేసిన ఆయనకు ఘనస్వాగతం లభించింది. అనంతరం సంస్థ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సంయుక్తంగా సిఈఓ చంద్రశేఖర్ ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ, తన విజయం వెనక ఎందరో కృషి దాగి వుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో తనకు ఎంతగానో సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచ రికార్డు సాధించేలా ప్రోత్సహించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, ఆయుష్, రాష్ట్ర అటవీ శాఖ ఉన్నతాధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోని వివిధవిశ్వవిద్యాలయాలు, పరిశోధనాశాలలు, మార్కెటింగ్ సంస్థల సహకారం మరువలేనిదన్నారు. ప్రజారోగ్యం కోసం భారతీయ సనాతన వైద్యాన్ని ప్రోత్సహిస్తున్న ప్రతి ఒక్కరికి తన అవార్డు అంకితమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ ప్రదీప్, బోర్డు ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఆ కాలేజీల గుర్తింపు రద్దు చేయండి

- పిడిఎస్‌యు నేతలు ఎస్.ఎండి రఫీ, కిరణ్ కుమార్




**విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాల యాజమాన్యం ఐఐటి జెఇఇ మెయిన్స్, నీట్ పుస్తకాల పేర్లతో అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, తక్షణమే ఇంటర్మీడియట్ అధికారులు గుర్తింపు రద్దు చేయాలని పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎండి రఫీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్పొరేటు, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు విచ్చలవిడిగా విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వేలాది రూపాయలు అక్రమంగా పుస్తకాల పేరుతో ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు విధంగా పుస్తకాల వ్యాపారం చేయకూడదని ఉన్నప్పటికీ కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు వేల రూపాయలకు అమ్ముతున్నారని మండిపడ్డారు. ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, ఎంసెట్, నీట్, జెఇఇలకు అనుమతి లేకున్నా ఐఐటి, జెఇఇ మెయిన్స్, నీట్ అంటూ మోసం చేస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. ఇంటర్ బోర్డు నిబంధనలుకు విరుద్ధంగా నడుస్తున్న కళాశాలలను గుర్తించి గుర్తింపు రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు. కనీస వసతులు లేని ఇరుకు గదుల్లో విద్యార్థులను కూర్చోబెట్టి తరగతులు, హాస్టళ్ల నిర్వహిస్తూ వారి ప్రాణాలతో చెలగాట మాడుతున్నారని, ఇలాంటి గుర్తింపు లేని విద్యాసంస్థలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పిడిఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షులు భాను, రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్దు, రాష్ట్ర మావో, వేణు పిడిఎస్‌యు నాయకులు నవీన్, రూపా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎపిలో పోలీసు వ్యవస్థ అస్తవ్యస్తం

- మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్ర ఆరోపణలు
- క్రాంతికుమార్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా



**విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిలో పోలీసు వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన రెడ్డి ఆరోపించారు. పోలీసులను ప్రభుత్వ నేతలు స్వార్ధప్రయోజనాల కోసం వినియోగించుకుంటున్నారని ఆక్షేపించారు. విజయవాడలో ఆత్మహత్య చేసుకున్న టాక్సీ డ్రైవర్ క్రాంతి కుమార్ కుటుంబాన్ని జగన్మోహన రెడ్డి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ గత ఎనిమిదేళ్లుగా క్రాంతికుమార్ పై ఎలాంటి కేసులు లేవని, పాత కేసులను కోర్టు కొట్టివేసిందని గుర్తుచేశారు. గౌరవంగా టాక్సీ నడుపుకుంటూ జీవిస్తున్న వ్యక్తిని రోజూ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వేధింపులకు గురిచేశారని ధ్వజమెత్తారు. ఆ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ స్థాయికి పోలీస్ వ్యవస్థ దిగజారిపోయిందని ఆరోపించారు. పోలీస్ స్టేషన్‌లో భద్రంగా ఉండాల్సిన సిసిటివి ఫుటేజీని డిలీట్ చేశారని, నిబంధనలకు విరుద్ధంగా ఫుటేజీని ఎలా తొలగిస్తారని జగన్ ప్రశ్నించారు. మరణ వాంగ్మూలం ఆధారంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయలేదని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఎలాంటి పరిష్కారం చూపలేదని విమర్శించారు. క్రాంతికుమార్ కుటుంబానికి వైఎస్సార్సీపీ అన్ని విధాలా అండగా ఉంటుందని, న్యాయపరమైన పోరాటానికి పూర్తి సహాయసహకారాలు అందిస్తామని జగన్ భరోసా ఇచ్చారు.

## సిహెచ్ చంద్రశేఖర్ అరెస్టు అక్రమం: సిపిఎం

**విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి వస్తున్న సందర్భంగా తిరుపతి జిల్లా కోడూరులో ట్రేడ్ యూనియన్ నాయకులు సిహెచ్ చంద్రశేఖర్‌ను అక్రమంగా అరెస్టు చేయడాన్ని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. ప్రస్తుతం చిట్వేల్ పోలీసు స్టేషన్ నిర్బంధంలో ఉన్నాడు. అరెస్టు చేసిన చంద్రశేఖర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నది. ఉపాధిహామీ కొత్త పథకం ప్రారంభించడానికి కేంద్ర మంత్రి వస్తున్న సందర్భంగా నిరసనలు తెలియజేయాలని వ్యవసాయ కార్మిక సంఘాలు పిలుపు నిచ్చాయి. ప్రజలకు శాపంగా మారుతున్న ఈ తప్పుడు పథకాన్ని వెంటనే ఉపసంహరించుకోవడానికి బదులు ఆందోళన చేస్తున్న వారిని నిర్బంధించడం అప్రజాస్వామికం. గ్రామీణ పేదలకు మేలు చేసే (పాత) మహాత్మాగాంధీ ఉపాధిహామీ చట్టాన్ని కొనసాగించాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ కోరుతున్నది. ఈ మేరకు రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు.

# పులివెందులకు అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్

ప్రజల సహకారంతో భద్రతా వ్యవస్థ బలోపేతం: కర్నూల్ రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్



**పులివెందుల, జులై 2 ప్రభాతవార్త:** ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు పులివెందులలో అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ తెలిపారు. సాంకేతికతతో, సీసీ కెమెరాల ద్వారా ప్రజలకు మరింత జవాబు దారీతనంతో పోలీసు సేవలు అందించేలా వ్యవస్థను అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఐజీ మాట్లాడుతూ పట్టణంలోని రింగ్ రోడ్‌తో పాటు ప్రధాన కూడళ్లలో మున్సిపాలిటీ, వ్యాపారవేత్తలు, దాతల సహకారంతో రూ.32.62 లక్షల వ్యయంతో 120 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేరాల నివారణతో పాటు నేరస్థులను వేగంగా గుర్తించడంలో ఈ కెమెరాలు కీలకంగా ఉపయోగపడతాయని చెప్పారు. నియోజక వర్గంలోని అన్ని పోలీస్ స్టేషన్లకు డ్రోన్ కెమెరాలను అనుసంధానించి కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. పోలీసు సూపరింటెండెంట్ షెల్కే నచికేత్ విశ్వనాథ్ సూచనల మేరకు చేపట్టిన ఈ ప్రాజెక్టుకు పులివెందుల ప్రజలు, వ్యాపార సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు, మున్సిపాలిటీ సహకరించాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి సహకారంతో మున్సిపాలిటీ రూ.12 లక్షలు అందించిందని తెలిపారు. కమాండ్ కంట్రోల్ ఏర్పాటు శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం అర్బన్ స్టేషన్ నందు ఉన్న కంట్రోల్ కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కమాండింగ్ కంట్రోల్ కేంద్రంలో సీసీ కెమెరాల పనితీరును ఏ విధంగా నేరాలను గుర్తించడం జరుగుతుందో సాంకేతికత నాణ్యతను గురించి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి, డీఎస్పీ మురళి నాయక్, మున్సిపల్ కమిషనర్ మునికుమార్, అర్బన్ సీఐ శ్రీరామ్, రూరల్ సీఐ శాంతిలాల్, ట్రాఫిక్ సీఐ ప్రసాద్‌రావు, వేంపల్లి సీఐ నరసింహులు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది, దాతలు పాల్గొన్నారు.

mn 11 gnt vij_mn 11 gnt vij.qxd 03-07-2026 AM 01:18 Page 1



## జనగణన కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ప్రత్యేక అధికారి సలీం బాషా

తెనాలి మున్సిపాలిటీ జూలై2(ప్రభాతవార్త): జిల్లా విద్యాశాఖ అధికారి మరియు తెనాలి అర్బన్ ప్రత్యేక అధికారి ఎస్ కే సలీం భాషా , మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు గురువారం పట్టణంలో జరుగుతున్న సవివర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. పోలింగ్ బూత్ నెంబర్ 210 తదితర ప్రాంతాలలో పర్యటించి ఓటర్ల జాబితా సవరణలో ఎదురవుతున్న సమస్యలను



బిఎల్ఓ లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తెనాలి అర్బన్ ప్రత్యేక అధికారి సలీం భాష, మాట్లాడుతూ వేగవంతం చేయాలని, ఓటర్ల జాబితా ప్రకారం ఓటర్లను కలిసి వారి వద్ద నుండి అవసరమైన పత్రాలు సేకరించి ఆన్లైన్లో పొందుపరచాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ విషయంలో. బి ఎల్ వో లు అత్యంత వహించాలని అన్నారు. మున్సిపల్ కమిషనర్ రామ అప్పల నాయుడు మాట్లాడుతూ, బి ఎల్ ఓ లు సవివర ఓటర్ల జాబితా సవరణ త్వరగా పూర్తి చేసేందుకు బి ఎల్ వో లకు సహకారం అందించేందుకు నగర దీపికలు, ఆర్పీలు, అంగన్వాడీలు, అనుసంధానం చేసినట్లు వారి సహకారంతో ఓటర్ల జాబితా సవరణ ప్రణాళిక బద్ధంగా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఎల్వోలు సిబ్బంది పాల్గొన్నారు.

## జనగణనలో పొరపాట్లు కు తావివ్వొద్దు: మున్సిపల్ కమిషనర్

తెనాలి మున్సిపాలిటీ జూలై2(ప్రభాతవార్త): జనగణనలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు సూచించారు. గురువారం పురపాలక సంఘ కార్యాలయం కౌన్సిల్ హాలులో ప్రభుత్వ సవివర ఓటరు జాబితా సవరణ అంశంపై నగర దీపికలు, రిసోర్స్ పర్సన్స్ ,మెప్మా సిబ్బంది ,అంగన్వాడీ కార్యకర్తలకు సమావేశం ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు ఆయా పోలింగ్ బూతుల వారీగా ఎన్ని దరఖాస్తులు స్వీకరించినది, ఎన్ని ఆన్లైన్లో పొందుపరిచినది వివరాలను



అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ రామ అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి సవివర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు అందరూ బిఎల్ ఓ లకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. క్షేత్రస్థాయిలో నగర దీపికలు ,ఆర్పి లకు ,అంగనవాడి లకు ప్రజలతో మంచి సంబంధాలు ఉంటాయి కనుక అందరూ తమ పరిధిలో గల ఓటర్ లను గుర్తించి వారి వద్ద నుండి అవసరమైన పత్రాలు సేకరించి ఏ రోజుకు ఆ రోజు ఆన్లైన్ చేసేందుకు సహకరించాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ విషయంలో ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి ఉందని ఈ విషయాన్ని గమనించి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జయకర్ , శ్రీమతి వాణి , మెప్మా సీఎంఎం విజయ కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

# పార్టీ కోసం శ్రమించే జనసైనికులకు గుర్తింపు

● జనసైనికులు, వీరమహిళలతో మాట్లాడి, వారి సేవలను అడిగి తెలుసుకున్న మంత్రి దుర్గేష్



విజయవాడ పార్లమెంట్ జనసేన పరిశీలకులతో మంత్రి దుర్గేష్

**విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** జనసేన పార్టీ ఆశయం కేవలం అధికారం మాత్రమే కాదని, సమాజ సేవకు అంకితం కావడమేనని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. దరఖాస్తులు సమర్పించడానికి వస్తున్న ప్రతి ఒక్కరిలో ఆ ప్రజా సేవా సంకల్పం స్పష్టంగా కనిపిస్తోందని ఆయన కొనియాడారు. గురువారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు, మంత్రి కందుల దుర్గేష్ మరియు సమాచార సేకరణ కమిటీ ఆధ్వర్యంలో 4వ రోజు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం అత్యంత విజయవంతంగా జరిగింది. నిరంతరం పార్టీ అభ్యున్నతి కోసం పనిచేస్తూ, భవిష్యత్తులో కీలక బాధ్యతలు చేపట్టేందుకు ఉత్సాహం చూపిస్తున్న జనసైనికులు, వీరమహిళల నుంచి మంత్రి స్వయంగా దరఖాస్తులను స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను సులభతరం చేసేందుకు విజయవాడ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు విడివిడిగా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. "ఈ దరఖాస్తుల ప్రక్రియకు క్షేత్రస్థాయి నుంచి వస్తున్న విశేష స్పందనే జనసేన పార్టీపై, మా నాయకత్వంపై శ్రేణులకు ఉన్న నమ్మకానికి నిదర్శనం. పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగానే ఈ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. గ్రాస్ రూట్ లెవెల్ నుండి సమర్థులైన, నిబద్ధత కలిగిన నాయకత్వాన్ని గుర్తించి, పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఇవ్వడమే మా ముఖ్య ఉద్దేశ్యం. అలాంటి నిజాయితీ గల నాయకులను ఎంపిక చేసే ప్రక్రియలో నేను భాగస్వామ్యం కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఇక్కడ సేకరించిన దరఖాస్తులన్నింటినీ కూలంకషంగా పరిశీలించిన తర్వాత, తుది నిర్ణయాన్ని అధినేత పవన్ కళ్యాణ్ తీసుకుంటారు." అని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.

# ప్రశ్న రావణ్ పై కోడిగుడ్లతో దాడి

## తమకు అప్పగించాలంటూ సర్పవరం పిఎస్ ఎదుట జనసేన ఆందోళన



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 2 ప్రభాతవార్త:** జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై అరెస్ట్ అయిన యూట్యూబర్ ప్రశ్న రావణ్ పై జనసైనికులు కోడిగుడ్ల దాడిచేశారు. పిఠాపురంలో కేసు నమోదు కావడంతో అరెస్టు చేసిన రావణ్‌కు బెయిల్ రావడంతో మరొక కేసులో సర్పవరం పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా సర్పవరం పీఎస్ ఎదుట జనసేన నేతలు, వీర మహిళలు కోడిగుడ్లతో దాడికి ప్రయత్నించారు. దీంతో జిల్లా కేంద్రం కాకినాడ సర్పవరం పోలీస్ స్టేషన్ ఎదుట ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పవన్ కళ్యాణ్ పట్ల అభ్యంతరకరంగా మాట్లాడిన ప్రశ్న రావణ్‌ను చట్టపరంగా శిక్షి ంచాలని డిమాండ్ చేశారు. అలాగే తమకు అప్పగించాలంటూ జనసేన నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. సర్పవరం పోలీస్ స్టేషన్ నుంచి రావణ్ను వైద్య పరీక్షల కోసం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ప్రొటోకాల్ వాహనంకి అడ్డు తగిలారు. పోలీస్ వాహనాలకు అడ్డుపడుతూ రావణ్ను తమకు అప్పగించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అప్రమత్తమైన పోలీసులు ఆందోళనకారులను అడ్డుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం ప్రశ్న రావణ్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇప్పటికే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యాలయంలో సోషల్ మీడియా దుర్వినియోగానికి సంబంధించి ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగింది.

## విబి జిరామ్‌జితో శ్రమజీవులకు భరోసా



విబి జి రామ్‌జి పనులను ప్రారంభిస్తున్న కలెక్టర్ లక్ష్మీశా, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

**విజయవాడ, జులై 2 ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా కొత్తగా అమలులోకి వచ్చిన వీబి జీ రామ్‌జీ పథకంతో శ్రమజీవులకు ఆర్థిక భరోసా లభిస్తుందని ఎన్‌టిఆర్ కలెక్టర్ లక్ష్మీశా పేర్కొన్నారు. ఎన్‌టిఆం "జిల్లా జి.కొండూరు మండలం చెవుటూరులో గురువారం మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌తో కలిసి వీబీ జీ రామ్‌జీ పథకంలో భాగంగా బండ్లవాగు ఫీడర్ ఛానల్ పనులను ప్రారంభించారు. తిరుపతిజిల్లా ముక్కావారిపల్లెలో కేంద్రమంత్రి శివరాజ్ చౌహాన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొన్న కార్యాక్రమాని న్ లైవ్‌లో వీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈపథకం ద్వారా ఉపాధిహామీ పనిదినాలను 100 రోజుల నుండి 125రోజులకు పెంచటంతోపాటు, రోజువారి వేతనాన్ని రూ.307 నుండి రూ.312కు పెంచటం ద్వారా గ్రామీణ శ్రామికులకు అదనపు భరోసా కల్పిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధితోపాటు భూగర్భజలాల పెంపునకు కూడా ఈకార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఈపథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో డొంకరోడ్లు, కాలువలు, వర్షపునీటి సంరక్షణ, మొక్కల పెంపకం, వంటి పనులకు ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వాలు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి రాము, జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీకుమార్, యంపిపి లక్ష్మీతిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సందెపూడిలో ఘనంగా వైద్యుల దినోత్సవ వేడుకలు

పెదనందిపాడు జూలై 2 (ప్రభాతవార్త) ఇక్కడ సమీపంలోనిసందెపూడి గ్రామంలో బుధవారం రాత్రి జాతీయ వైద్యుల దినోత్సవాన్ని డాక్టర్ కె.వి. హనుమంతరావు అధ్యక్షతన, శ్రీ గుర్రం కుమారస్వామి-శ్రీమతి మంగమ్మ గార్ల సౌజన్యంతో ఘనంగా వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన



ప్రముఖ వైద్యులు, విద్యావేత్తలు, పీహెచ్.డి. పట్టభద్రులను కూడా గ్రామ ప్రజల సమక్షంలో ఘనంగా సన్మానించారు. తొలుత ప్రముఖ యూరాలజిస్టు స్వర్గీయ డాక్టర్ అలపర్తి లక్ష్మయ్య కు ఘన నివాళులు అర్పించారు. అనంతరం డాక్టర్ కె.వి. హనుమంతరావు జాతీయ వైద్యుల దినోత్సవ ప్రాముఖ్యతను వివరించి, వైద్య వృత్తి సేవాధర్మమని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ శ్రీ మద్దినేడి శివరామకృష్ణతో పాటు పలువురు ప్రముఖులు గ్రామం నుంచి ఉన్నత స్థానాలకు ఎదిగిన వారిని అభినందించారు. ముఖ్య అతిథులు డాక్టర్ దొంతినేని కృష్ణ చైతన్య, సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ కొండగుంట శ్రీనివాసరావు, ప్రొఫెసర్ డాక్టర్. గుర్రం వీర రాఘవయ్య, కెప్టెన్ ప్రొఫెసర్ డాక్టర్. ఆళ్ల శ్రీవాణి లు తమ అనుభవాలను పంచుకుంటూ, స్వగ్రామంలో లభించిన ఈ సన్మానం తమకు ఎంతో గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు. చివరగా అతిథులు, నిర్వాహకులు కలిసి సన్మాన గ్రహీతలను ఘనంగా సత్కరించి, జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలను అర్ధరాత్రి తో విజయవంతంగా ముగించారు.

# పిఎఫ్ విత్‌డ్రాకు కనీస నిల్వ తప్పనిసరి... 75% మాత్రమే విత్‌డ్రాకు వెసులుబాటు

**న్యూఢిల్లీ, జులై 2:** ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) పథకంలో కేంద్ర ప్రభుత్వం నిబంధనలు సవరించింది. పిఎఫ్ విత్‌డ్రా నిబంధనలను సవరిస్తూ ఉద్యోగుల భవిష్య నిధి పథకం, 2026ను నోటిఫై చేసింది. గతనెల 29 నుంచి అమల్లోకి వచ్చిన ఈ కొత్త నిబంధనల ప్రకారం, పీఎఫ్ ఖాతా నుంచి పాక్షికంగా డబ్బులు విత్‌డ్రా చేయాలంటే, ఖాతాలో కనీసం 25 శాతం బ్యాలెన్స్ ఉంచడం తప్పనిసరి. ఉద్యోగి, యాజమాన్యం వాటాలు రెండింటికీ ఈ నిబంధన వర్తిస్తుంది. విత్‌డ్రాకు అందుబాటులో ఉండే మొత్తాన్ని లెక్కించే ముందు ఈ కనీస బ్యాలెన్స్‌ను పక్కన పెట్టాల్సి ఉంటుంది. ఒకరి ఖాతాలో రూ.1 లక్ష అర్హత మొత్తం ఉంటే, అందులో రూ.25,000 కనీస బ్యాలెన్స్‌గా ఉంచి, మిగిలిన రూ.75,000 నుంచే పథకం నిబంధనలకు లోబడి విత్‌డ్రా చేసుకోవాల్సి ఉంటుంది. ఈ 25 శాతం తప్పనిసరి బ్యాలెన్స్‌ను తీసివేయగా మిగిలిన మొత్తాన్నే అర్హత ఉన్న సభ్యుని బ్యాలెన్స్‌గా ఈపీఎఫ్ఓ నిర్వచించింది. కొత్త పథకం కింద పాక్షిక విత్‌డ్రాలకు అనుమతించే కారణాల జాబితాను కూడా విస్తరించారు. గృహ సంబంధిత అవసరాలైన ఇల్లు లేదా ఫ్లాట్ కొనుగోలు, ఇంటి నిర్మాణానికి స్థలం కొనుగోలు, గృహ నిర్మాణం, గృహ రుణం తిరిగి చెల్లించడం, ఇంటి మరమ్మతులు లేదా ఆధునీకరణ వంటి వాటికి నిధులు డ్రా చేసుకోవచ్చు. వీటితో పాటు అనారోగ్యం, పిల్లల ఉన్నత విద్య, వివాహం వంటి ఖర్చుల కోసం అర్హత ఉన్న బ్యాలెన్స్‌లో 100 శాతం వరకు విత్‌డ్రా చేసుకునేందుకు అనుమతి ఇచ్చారు.

## రైతు గ్రూపులన్నింటిని ఆన్‌లైన్ చేయాలి

నిజాంపట్నం, జులై 2, ప్రభాతవార్తః మండలంలో ఉన్న అన్ని రైతు గ్రూపులన్నింటిని సిఆర్‌పిలు రివ్యూచేసి ఆన్‌లైన్ చేయాలని జిల్లా ఎఫ్‌పిఓ



అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ రాంబాబు అన్నారు. గురువారం స్థానిక మండల సమైక్య కార్యాలయంలో జరిగిన రివ్యూ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు సంబంధించి ఇన్పుట్స్, జీవనోపాదులకు సంబంధించి ఏమి కావాలో ప్రణాళికలు సిద్దం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం మస్తాన్‌రావు , ఎఫ్‌పిఓ సిఆర్‌పిలు, విఓఎలు, అకౌంటెంట్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పి.ఎ.ఎస్. కళాశాల హాస్టల్‌ను పరిశీలించిన పాలకవర్గ ప్రతినిధులు

పెదనందిపాడు జూలై 2 (ప్రభాతవార్త)

పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల హాస్టల్ ను గురువారం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ విజ్ఞాన సంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య . కళాశాల అధ్యక్షులు విశ్రాంత విజిలెన్స్ ఎస్పి కాళహస్తి సత్యనారాయణ లు పరిశీలించారు. అనంతరం డాక్టర్ లావు రత్తయ్య కళాశాల అధ్యక్షులు



కాళహస్తి సత్యనారాయణ లు కళాశాలలోని అధ్యాపకుల ను సమావేశపరిచి 202627 విద్యా సంవత్సరానికి అవలంబించవలసిన ప్రణాళిక గురించి చర్చించినారు. డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతిరోజు సాయంత్రం సమయంలో గేమ్స్ కొరకు కొంత సమయం కేటాయించవలసిందిగా సూచించారు తద్వారా విద్యార్థులకు ఒత్తిడిని అధిగమించి చదువులో ప్రతిభను కనబరుస్తారని తెలియజేసినారు. అధ్యక్షులు కాళహస్తి సత్యనారాయణ కళాశాల అభివృద్ధి గురించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి వీర రాఘవయ్య , అధ్యాపకులు మరియు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## భట్టిప్రోలు మెయిన్ డ్రెయిన్ రహదారి వంతెన నిర్మాణం ప్రారంభం

రేపల్లె, జూలై 2, ప్రభాతవార్త:రేపల్లె-భట్టి ప్రోలు రహదారి మార్గంలో పల్లెకోన వద్ద భట్టిప్రోలు మెయిన్ డ్రెయిన్‌పై రూ.5 కోట్ల వ్యయంతో



పూర్తిచేయాల్సిన అధునాతన రహదారి వంతెన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. బ్రిటీష్ కాలంనాటి రహదారి వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో వేమూరు నియోజకవర్గ శాసనసభ్యుడు నక్కా ఆనందబాబు చొరవ ఫలితంగా నిధులు సమకూరాయి. టెండర్లు పిలిచారు. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ రహదారి మార్గంలో రేపల్లె, చీరాల, తెనాలి, మచిలీపట్నం డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు, ఎల్‌కెజి నుండి ఇంజనీరింగ్ చదివే విద్యార్థుల వరకు రాకపోకలు సాగించే ప్రైవేటు విద్యా సంస్థల బస్సులు తిరుగుతున్నాయి. వీటి రవాణాకు ఇబ్బంది తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయ రహదారిని నిర్మించారు. శిథిలావస్థకు చేరిన రహదారి వంతెనను తొలగించారు. విశాలమైన వంతెన నిర్మాణ పనులు చేపట్టడంలో భాగంగా ఆ ప్రదేశాన్ని యంత్రాల సహాయంతో చదును చేస్తున్నారు. వంతెన రహదారి నిర్మాణ పనులను కేవలం ఒక నెల వ్యవధిలోనే పూర్తి చేయాలని నిర్ణయించారు. రేపల్లె-భట్టి ప్రోలు రహదారి మార్గం నేషనల్ హైవే అధికారుల ఆధీనంలో ఉన్నందున పల్లెకోన వద్ద భట్టి ప్రోలు డ్రెయిన్‌పై నిర్మిస్తున్న రహదారి వంతెన బాధ్యతలను పర్యవేక్షిస్తున్నారు. వర్షాలు కురిస్తే డ్రెయిన్‌లో మురుగునీరు ప్రవహించే ప్రమాదం ఉన్నందున వంతెన ప్రదేశానికి ఇరువైపులా అడ్డుగా కట్టలు ఏర్పాటు చేశారు. యుద్ధప్రాతిపదికన వంతెన రహదారి నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్ ఒక ప్రణాళిక ప్రకారం వ్యవహరిస్తున్నారు.

## అభియాన్ పథకంతో గ్రామీణాభివృద్ధి



రేపల్లె, జూలై 2, ప్రభాత వార్త:కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో అమలు చేస్తున్న వికసిత్ భారత్ గ్రామ అభియాన్ పథకాన్ని గురువారం భట్టి ప్రోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి ఎస్.వెంకటరమణ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ప్రారంభించారు. తొలుత గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. అర్హులైన గ్రామీణ కుటుంబాలకు సంవత్సరంలో 125 రోజుల ఉపాధి హామీ కల్పించడంతో పాటు గ్రామాన్ని ఆర్థిక స్వావలంబన దిశగా తీసుకువెళ్ళడమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన లక్ష్యమని వెంకటరమణ, సాయిబాబాలు వివరి ంచారు. గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పన, జీవనోపాధి అవకాశాల పెంపు, సంక్షేమ కార్యక్రమాల విస్తరణ, నీటి సంరక్షణ, గ్రామీణ రహదారుల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ వంటి అబివృద్ధి కార్యక్రమాల సాధనకు అభియాన్ దోహదపడుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సిబ్బంది ఎం.రవికుమార్, ఎ.తాండవకృష్ణ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఉపాధి శ్రామికునికి 125 రోజుల పని

నిజాంపట్నం, జులై 2, ప్రభాతవార్తః కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న విబిజి రామ్‌జి పథకం కూలీలకు ఎంతో మేలు చేస్తుందని ఎంపిడిఓ



నాగలక్ష్మీ అన్నారు. గురువారం మండల కేంద్రమైన నిజాంపట్నంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్‌గా ఉన్న పథకం పేరును మార్పు చేశారని ఆమె గుర్తు చేశారు. ఈ పథకంలో ప్రతి జాబ్‌కార్డుదారునికి 125 రోజులు పని కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కార్పోరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, ఎపిఓ జయచంద్ర, టిఎ జాఫర్, ఎఫ్ఎ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ వీసాలతో 20 మంది అరెస్టు

**శంషాబాద్ జులై 2, ప్రభాతవార్త :** నకిలీ వీసాలతో విదేశాలకు వెళ్లేందుకు ప్రయత్నించిన 20 మంది మహిళలను ఇమిగ్రేషన్ అధికారులు అరెస్ట్ చేశారు. గురువారం ఆంధ్రప్రదేశ్ తూర్పు గోదావరి జిల్లాకు చెందిన 20 మంది మహిళలు శంషా బాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానా శ్రయానికి చేరుకు న్నారు. అయితే ఇమ్మిగ్రేషన్ అధికారులు తని ఖీలు చేస్తుండగా వారు సమర్పించిన వీసాలు నకిలీ అన్ని తేలింది. మహిళ లంతా ఓమన్ ఎయిర్ వేస్ విమానంలో మస్కట్ వెళ్లేందుకు సిద్ధమవుతుండగా వారిని అరెస్టు చేసి ఎయిర్ పోర్ట్ క్రైమ్ అవుట్ పోస్ట్ పోలీసులకు అప్పగించారు.




**ఏజెంట్లను నమ్మి మోసపోవద్దు : ఎసిపి శ్రీకాంత్‌గౌడ్**

శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుండి నకిలీ వీసాలతో ఓమన్ వెళ్లుందుకు ప్రయత్నించిన మహిళలపై అనుమానం వచ్చి విచారణ చేయగా వర్క్ వీసాకు బదులుగా టూరిస్ట్ వీసాతో చిన్న స్టాంప్ వేసుకోని వెళ్లేందుకు సిద్ధమైనట్లు అధికారులు గుర్తించి 20 మంది మహిళలను అదుపులోకి తీసుకోవడం జరిగిందని ఎసిపి శ్రీకాంత్‌గౌడ్ వెల్లడించారు. మహిళలను విచారించగా చేసిన తప్పును ఒప్పుకున్నారని నకిలీ విసాలను స్వాధీనం చేసుకొని మహిళల స్టేట్‌మెంట్ ఆధారంగా కేసు నమోదు చేయడం జరిగిందని అయితే విచారణలో 19 సబ్ ఏజెంట్స్ పేర్లు బయటకు వచ్చాయని వారిపైన ఇక ఏ ఎజెన్సీలు ఉన్నాయో లోతుగా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఉపాధి కోసం తాము విదేశాలకు వెళ్లేందుకు ఒక ట్రావెల్ ఏజెంట్‌ను ఆశ్రయిం చామని, అతను అసలు వీసాలు అని చెప్పి తమవద్ద పెద్దమొత్తంలో డబ్బులు వసూలుచేసి నకిలీవీసాలు ఇచ్చి మోసం చేశాడని మహిళలు వాపోయారు.

## సాయి అన్నపూర్ణాలయంకు రూ.25,116 అందజేత

పెదనందిపాడు జులై 2(ప్రభాతవార్త) పెదనందిపాడు శిరిడి సాయి అన్నపూర్ణాలయంలో ప్రతి గురువారం క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న అన్నదానం కు తమ వంతు సహకారంగా. పెదనందిపాడు గ్రామానికి చెందిన



షేక్ సిద్దయ్య ఫాతిమాభి దంపతులు 25,116 రూపాయలు విరాళాన్ని. సాయి మందిర్ నిర్వహణ కమిటీ సభ్యులు దాసరి శేషగిరిరావు .డిఎల్ఎస్ఆర్ ప్రసాద్ . అరవపల్లి రామ సుబ్బారావు. గొల్లపూడి శ్రీనివాసరావు లకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను కమిటీ సభ్యులు పట్టు శాలువా మెమెంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తడవర్తి సురేష్ కుమార్. సకలా వీరేంద్ర గుప్తా. రావిపూడి అర్జున్ రావు. దాసరి కృష్ణ. కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతాంగానికి సొసైటీ కూడా రాయితీ ఇవ్వాలి

పెదనందిపాడు జూలై 2 (ప్రభాతవార్త)ఆంధ్రపదేశ్ లోని పలు జిల్లాలలో గల గ్రామీణ ప్రాంతాల్లోని లక్షలాదిమంది రైతులు అందు బాటులో ఉన్న



ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా వ్యవసాయం కోసం తీసుకున్న కోట్లాది రూపాయల రుణాలను. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు కోల్పోయి నష్టపోయిన రైతుల ఇబ్బందులను గుర్తించి. జాతీయ బ్యాంకుల వలే రుణాన్ని తగ్గించి ఒకేసారి చెల్లింపుల ద్వారా రుణ విముక్తులను చేయాలని నాగులపాడులోని సుభిక్ష సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు కొల్లా సీతారామయ్య కోరారు .ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంకు మేనేజింగ్ డైరక్టర్ కు రాష్ట్ర ఆర్థిక ప్రధాన కార్యదర్శికి రాష్ట్ర ఆర్థిక శాఖ మాత్యులు పయ్యావుల కేశవ్ మరియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కు వినతి పత్రాలు పంపినట్లు ఆయన తెలిపారు

# డీలిమిటేషన్ లక్ష్యంగా మోడీ వ్యూహం

### ఈ సమావేశాల్లోనే

### ఆమోదింపచేసేందుకు పక్కా కసరత్తు

**న్యూఢిల్లీ, జులై 2:** మోడీ 4.0 లక్ష్యంగా కొత్త వ్యూహాలు సిద్ధం అవుతున్నాయి. తాజా లెక్కలు తెర మీదకు వస్తున్నాయి. అందులో భాగంగా డీలిమిటేషన్ జమిలి నిర్వహణను ప్రధాని మోడీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. అమలు చేసి తీరాలని డిసైడ్ అయ్యారు. అందులో భాగంగా మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుకు వీలుగా జాతీయ రాజకీయాల్లో వేగంగా అడుగులు పడుతున్నాయి. పార్లమెంట్ లో వీగిన బిల్లును మరోసారి ప్రవేశ పెట్టి ఆమోదం పొందేలా వ్యూహాలు సిద్ధం చేస్తున్నారు. దీని ద్వారా జమిలి డీలిమిటేషన్ అమలు ముహూర్తం దాదాపు ఖరారైంది. అధికారిక ప్రక్రియ లాంఛనంగా మారనుంది. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కొత్త లెక్కలు సిద్ధం చేస్తోంది. లోక్‌సభలో ఇటీవల వీగిపోయిన డీలిమిటేషన్ మహిళా రిజర్వేషన్ బిల్లు ఎలాగైనా ఆమోదించుకునే వ్యూహాలను సిద్ధం చేసింది. అందులో భాగంగా తాజాగా ఎన్డీఏ వైపు టీఎంసీ, థాక్రే శివసేన ఎంపీలు మద్దతుగా నిలవటం తో ధీమా కనిపిస్తోంది. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే డీలిమిటేషన్ బిల్లు, ఒక దేశం, ఒక ఎన్నిక బిల్లు (జమిలి) రెండింటికీ పార్లమెంట్ ఆమోదం పొందాలని ప్రభుత్వం వ్యూహాత్మకంగా కార్యాచరణను సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. ఏప్రిల్‌లో డీలిమిటేషన్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టినపుడు టీఎంసీ నుంచి 29 మంది, డీఎంకే నుంచి 22 మంది ఎంపీలు బిల్లుకు వ్యతిరేకంగా ఓటేశారు. ఇండియా కూటమిలో ఉన్న టీఎంసీ, డీఎంకే పార్టీల ఆదేశాల ప్రకారం ఆయా ఎంపీలు ఇలా చేశారు. ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. టీఎంసీ నుంచి 20 మంది ఎన్డీఏ వైపు నిలుస్తున్నారు. నియోజకవర్గాల పునర్విభజన జరగాలంటే హాజరైన వారిలో మూడింట రెండు వంతుల మంది ఆ బిల్లుకు మద్దతు తెలపాల్సి ఉంటుంది. లోక్‌సభలో ఎన్డీయే కూటమికి 293 మంది (54 ) సభ్యుల మద్దతు ఉండగా, రాజ్యసభ లో ఎన్డీయేకు అనుకూలంగా 141 మంది (58 ) సభ్యుల మద్దతు మాత్రమే ఉంది. తాజా పరిణామా లతో టీఎంసీ (29 మంది ఎంపీలు), డీఎంకే (22 మంది ఎంపీలు) ఓటింగ్‌లో పాల్గొనకుండా గైర్హాజరైనా లేదా బిల్లుకు మద్దతు ప్రకటించినా డీలిమిటేషన్ బిల్లు లోక్‌సభలో గట్టెక్కే అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉంది. ఇండియా కూటమి నుంచి బయటకొచ్చిన ఆమ్ ఆద్మీపార్టీ (లోక్‌సభ లో ముగ్గురు ఎంపీలు), కాంగ్రెస్‌తో దూరాన్ని పాటిస్తున్న సమాజ్‌వాదీ పార్టీ (లోక్‌సభలో 37 మంది ఎంపీలు) ఒకవేళ మద్దతు ప్రకటిస్తే సునాయాసంగా లోక్‌సభలో డీలిమిటేషన్ బిల్లుకు ఆమోదం లభించవచ్చు. ఇక, రాజ్యసభలోనూ లెక్కలు మారిపోతున్నాయి. ఈ లెక్కలను విశ్లేషించిన తర్వాతే.. డీలిమిటేషన్ బిల్లును



పునఃప్రవేశపెట్టేందుకు కేంద్ర హోం శాఖ మళ్లీ ప్రయత్నాలు చేస్తోంది. 2029 ఎన్నికలే లక్ష్యంగా వీటి ఆమోదం అమలు దిశగా పక్కగా వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తోంది. దీంతో ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు రాజకీయంగా కీలకంగా మారనున్నాయి.

03-07pg10_03-07pg10.qxd 02/Jul/26 11:37 PM Page 1




సెనెగల్ విజయం ఆశలపై నీళ్లు చల్లిన యూరి టైల్ మన్స్


రెండు మెరుపు గోల్స్ చేసిన హ్యారీ కేన్



గోల్ కొట్టిన అమెరికా ఫార్వర్డ్ బలోగన్‌ను అభినందిస్తున్న సహచరులు

# సెనెగల్‌కు బెల్జియం షాక్ : ఇంగ్లాండ్ గట్టెక్కించిన హ్యారీ కేన్

**కాలిఫోర్నియా, జులై 2:** సాకర్ ప్రపంచకప్‌లో నరాలు తెగే ఉత్కంఠ మ్యాచ్‌లు కొనసాగుతున్నాయి. ఇంగ్లాండ్, బెల్జియం, అమెరికా తమ ప్రత్యర్థులపై గెలుపొంది ముందంజ వేశాయి. ఓటమి అంచుల నిలిచిన బెల్జియం చివర్లో చక్కగా పుంజుకుని సెనెగల్‌పై 3-2తో గెలుపొందగా.. కాంగోపై కూడా చివర్లో మెరుపు గోల్స్‌తో ఇంగ్లాండ్ గటెక్కింది. అతిథ్య అమెరికా 2-0 గోల్స్ తేడాతో బోస్నియా-హెర్జగోవినాపై విజయం సాధించింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో క్రొయేషియాతో పోర్చుగల్, స్విట్జర్లాండ్‌తో అల్జీరియా, ఈజిప్ట్‌తో ఆస్ట్రేలియా తలపడతాయి.

ఫిఫా ప్రపంచకప్ రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లో సెనెగల్‌తో తల పడిన బెల్జియం ఓటమి అంచుల నుంచి సంచలన కమ్ బ్యాక్ ఇచ్చింది. ఓ దశలో 0-2గోల్స్‌తో వెనుకబడిన బెల్జియం, అనూహ్యంగా పుంజుకుని 3-2 తేడాతో గెలిచి అందరినీ ఆశ్చర్యపర్చింది. మ్యాచ్ ముగియడానికి కొన్ని క్షణాల ముందు యూరి టైల్‌మన్స్ పెనాల్టీని గోల్‌గా మలిచి బెల్జియంకు అపురూప విజయాన్ని అందించాడు. ఈ గెలుపుతో బెల్జియం ప్రీక్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. అంతర్జాతీయ ఫుట్‌బాల్ హిస్టరీలో బెల్జియం, సెనెగల్ జట్లు తలపడటం ఇదే మొదటిసారి. మ్యాచ్ ప్రారంభమైన కొద్దిసేపటికే బెల్జియం తరఫున లియాండ్రో ట్రోసార్డ్ గోల్ చేయడానికి ప్రయత్నించినప్పటికీ, ఆ తర్వాత పూర్తి ఆధిపత్యం సెనెగల్‌దే అయ్యింది. సెనెగల్ ఆటగాళ్లు మైదానంలో చిరుతల్లా కదిలారు. ఇస్మాయిలా గోల్ చేయడానికి ప్రయత్నించగా, బంతి పోస్ట్‌కి తగిలి రీబౌండ్ అయింది. అయితే, అక్కడే ఉన్న సెనెగల్ యువ మిడ్‌ఫీల్డర్ హబీబ్ దియారా ఆ రీబౌండ్ బంతిని ఏమాత్రం ఆలస్యం చేయకుండా గోల్ పోస్ట్‌లోకి నెట్టాడు. దీంతో మ్యాచ్ మొదటి అర్ధభాగంలో సెనెగల్ 1-0 ఆధిక్యాన్ని సంపాదించింది.

రెండో అర్ధభాగం లోనూ సెనెగల్‌దే హవా నడిచింది. కేవలం ఆరు నిమిషాలకే లాంగ్ బాల్‌ను ఇస్మాయిలా గోల్‌గా మలిచాడు. దీంతో సెనెగల్ 20తో ఆధిక్యాన్ని సాధించింది. ఆట 70వ నిమిషం దాటిన తర్వాత బెల్జియం ఆటలో వేగం పెరిగింది. బెల్జియం స్టార్ స్ట్రైకర్ రోమేలు తనదైన శైలిలో గోల్ పోస్ట్ దగ్గర నుంచి నెట్‌లోకి పంపి బెల్జియం ఖాతా తెరిచాడు. కొద్దిసేపటికే ట్రోసార్డ్ అందించిన అద్భుతమైన పాస్‌ను యూరి టైల్‌మన్స్ గోల్‌గా మలిచాడు. దీనితో స్కోరు 2-2తో సమం చేశాడు. ఎక్స్‌ట్రా సమయంలో లభించిన పెనాల్టీ కిక్‌ను గోల్‌గా మలిచి బెల్జియంకు విజయం అందుకుంది.

**బోస్నియాపై అమెరికా విజయం**

ఆతిథ్య అమెరికా జట్టు ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. రౌండ్32 మ్యాచ్‌లో బోస్నియా అండ్ హెర్జెగొవినాపై 2-0 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించి టైటిల్ రేసులో నిలిచింది. ఈ మ్యాచ్‌లో అమెరికా కేవలం 10మంది ఆటగాళ్లతోనే పోరాటం చేసింది. 64వ నిమిషంలో స్టార్ ఫార్వర్డ్ ఫొలారిన్ బలోగన్ రెడ్ కార్డ్‌కు గురై మైదానాన్ని వీడాడు. బలోగన్ 45వ నిమిషంలో గోల్ చేసి అమెరికాకు ఆధిక్యం అందించాడు. ఈ టోర్నీలో అతనికి ఇది మూడో గోల్. బలోగన్ రెడ్ కార్డ్‌కు గురైనా అమెరికా 82వ నిమిషంలో మరో గోల్ చేసి ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. మలిక్ టిల్‌మ్యాన్ అద్భుతమైన ఫ్రీకిక్‌తో గోల్ చేసి అమెరికా విజయాన్ని ఖాయం చేశాడు. అమెరికా రౌండ్ ఆఫ్ 16కు చేరడం ఇది మూడో సారి. తదుపరి మ్యాచ్‌లో బెల్జియంతో తలపడనుంది.

**ఇంగ్లండ్‌ను గెలిపించిన హ్యారీ కేన్**

ఆరు దశాబ్దాల తర్వాత ఇంగ్లండ్ ఫుట్‌బాల్ జట్టు అద్భుతం చేసింది. ఆరంభంలో వెనుకబడినా చివరి నిమిషాల్లో గోల్స్‌తో కాంగోపై 2-1తో గెలుపొందింది. కెప్టెన్ హ్యారీ కేన్ 11 నిమిషాల వ్యవధిలో రెండు గోల్స్ చేసి ఇంగ్లండ్ జట్టును గెలిపించాడు. అంతకుముందు ఏడో నిమిషంలో బ్రియాన్ సిపెంగా గోల్‌తో కాంగో జట్టు 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత రక్షణాత్మక ఆట తీరుతో ఇంగ్లండ్ జట్టును నిలువరించి గెలుపొందాలని ప్రయత్నించింది. కానీ ఇంగ్లండ్ జట్టు అవకాశం దొరికినపుడల్లా స్కోరును సమం చేసేందుకు యత్నించింది. చివరకు 75వ నిమిషంలో సఫలమైంది. ఆంథోని గోర్డాన్ పాస్‌ను డి-ఏరియాలో అందుకున్న హ్యారీ కేన్ హెడర్ షాట్‌తో గోల్‌గా మలిచాడు. దాంతో ఇంగ్లండ్ 1-1తో స్కోరును సమం చేసింది. అనంతరం 86వ నిమిషంలో గోర్డాన్ అందించిన పాస్‌ను హ్యారీ కేన్ లక్ష్యానికి చేర్చడంతో ఇంగ్లండ్ 2-1తో విజయబావుటా ఎగురవేసింది.

# వింబుల్డన్‌లో సీడెడ్ల జోరు

## మూడో రౌండ్‌లో సిన్నర్, జొకోవిచ్; మిర్రాకు షాక్



**లండన్, జులై 2:** వింబుల్డన్‌లో సీడెడ్ ప్లేయర్లు జోరు కొనసాగుతోంది. పురుషుల సింగిల్స్‌లో ఏడుసార్లు ఛాంపియన్ నోవాక్ జొకోవిచ్, ప్రపంచ నెంబర్ వన్ జానిక్ సిన్నర్ వింబుల్డన్ మూడవ రౌండ్‌లోకి ప్రవేశించగా... మహిళల సింగిల్స్‌లో ఫ్రెంచ్ ఓపెనర్ ఛాంపియన్ మిర్రా ఆంధ్రీవాకు షాక్ తగిలింది. రెండో రౌండ్‌లోనే అనూహ్య ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించింది.

ఎనిమిదోసారి వింబుల్డన్ అందుకోవాలనే పట్టుదలతో బరిలోకి దిగిన నోవాక్ జొకోవిచ్.. రెండో రౌండ్‌లో గ్రీక్ ప్లేయర్ స్టెఫానోస్ సిట్సిపాస్‌ను చిత్తుగా ఓడించాడు. 98 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో జొకోవిచ్ 6-3, 6-4, 6-2తో వరుస సెట్లలో గెలుపొందాడు. ఈమ్యాచ్‌లో అతను ఏకంగా 33విన్నర్లు కొట్టాడు. 12 ఏస్‌లు సంధించాడు. రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్ స్లామ్ సింగిల్స్ టైటిల్ గెలిచి చరిత్ర సృష్టించాలన్న జొకోవిచ్ ప్రయత్నానికి తొలి రౌండ్‌లో గట్టిపోటీ ఎదురైనా.. ఈ రౌండ్‌లో మాత్రం అతని ధాటి ముందు స్టెఫానోస్ నిలువలేకపోయాడు. వింబుల్డన్‌లో జొకోవిచ్‌కు ఇది 104వ మ్యాచ్ విజయం. పురుషుల సింగిల్స్‌లో రోజర్ ఫెదరర్ ఓపెన్ ఎరా రికార్డుకు కేవలం ఒక విజయం వెనుక ఉన్నాడు. మూడో రౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన 25వ సీడ్ ఆర్థర్ రిండర్‌క్నెచ్‌తో తలపడతాడు. జొకోవిచ్ చివరిసారి వింబుల్డన్‌ను 2022లో నెగ్గాడు.



**చెమటోడ్చి నెగ్గిన సిన్నర్**

జొకోవిచ్‌కు భిన్నంగా వరల్డ్ నెంబర్ వన్ సిన్నర్... రెండోరౌండ్‌లో చెమటోడ్చా వచ్చింది. పోర్చుల్‌కు చెందిన పోర్చుగల్‌కు చెందిన నూనో బోర్జెస్ గట్టి పోటీ ఇచ్చాడు. తొలి రెండు సెట్లు టైబ్రేకర్ వరకు కొనసాగాయి. గెలుపు నీదా నాదా అన్నట్లుగా ఉత్కంఠగా సాగింది. ఇక్కడ అనుభవజ్ఞుడైన సిన్నరే పైచేయి అయింది. నూనో బెర్జెస్‌పై 7-6, 7-6, 6-4తో నెగ్గి సిన్నర్ ఊపిరిపీల్చుకున్నాడు. మూడో రౌండ్‌లో అమెరికాకు చెందిన ప్రపంచ 81వ ర్యాంకర్ జెన్సన్ బ్రూక్స్‌బైతో తలపడతాడు.

**మహిళల సింగిల్స్‌లో సంచలనం**

కాగా పారిస్‌లో తన తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గి భారీ ఆశలతో వింబుల్డన్ బరిలో దిగిన మిర్రా అంద్రీవా తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. ఈ రష్యా టీనేజర్ అంద్రీవాపై 4-6, 7-5, 6-4తో 30 ఏళ్ల చెకొస్లోవేకియా క్రీడాకారిణి బార్బొరా క్రెజిస్కి గెలుపొందింది. తొలి సెట్ నెగ్గి ఊపుమీద కనిపించిన అంద్రీవా.. రెండో సెట్‌లోనూ మ్యాచ్ పాయింట్ వరకు వచ్చి ఆ తర్వాత చేతులెత్తేసింది.

ఇక మహిళల వరల్డ్ నెంబర్ వన్ సబలెంకా, జపాన్‌కు చెందిన ఏడో సీడ్ నయోమి ఒసాకా, నాలుగో సీడ్ కొకా గాఫ్ విజయాలతో వింబుల్డన్‌లో ముందంజ వేశారు.

# శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్ : షెడ్యూల్ రిలీజ్

**కొలంబో, జులై 2:** ఇంగ్లండ్‌తో టీ20, వన్డేల సిరీస్ తర్వాత టీమిండియా...శ్రీలంకలో పర్యటించనుంది. భారత్‌తో జరిగే రెండు టెస్ట్‌ల సిరీస్ షెడ్యూల్‌ను శ్రీలంక క్రికెట్ బోర్డు ప్రకటించింది. ఈ సిరీస్‌లోని మొదటి టెస్టు మ్యాచ్ ఆగస్టు 15 నుండి 19 వరకు గాలే ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. రెండో టెస్టు మ్యాచ్ ఆగస్టు 23 నుండి 27వరకు కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ ఆతిథ్యమివ్వనుంది. ఈ రెండు మ్యాచ్‌ల సిరీస్ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో భాగంగా జరగనుంది. శ్రీలంకతో సిరీస్ టీమిండియాకు చాలా కీలకం. ఇప్పటి వరకు తొమ్మిది టెస్ట్‌లు ఆడగా, కేవలం నాలుగింటిలో మాత్రమే విజయం సాధించి పాయింట్ల పట్టికలో 5వ స్థానంలో నిలిచింది. డబ్ల్యూటీసీ ఫైనల్ ఆశలను గిల్ సేన సజీవంగా ఉంచుకోవాలంటే శ్రీలంక గడ్డపై ఖచ్చితంగా గెలవాల్సిందే. శ్రీలంక జట్టు గత కొంత కాలంగా సొంత గడ్డపై అద్భుత విజయాలతో దూసుకు



పోతోంది. కాగా 2017 తర్వాత టెస్టుల కోసం శ్రీలంక పర్యటనకు టీమిండియా వెళ్లనుండటం తొలిసారి కానుంది. అప్పట్లో విరాట్ కోహ్లీ సారథ్యంలో భారత్ 3-0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది.

# ప్రజ్ఞానంద గెలుపు బోణీ, గుకేష్ డ్రా



**జాగ్రెబ్(క్రొయేషియా). జులై 2:** నార్వే చెస్ టోర్నీ ఛాంపియన్ ప్రజ్ఞానంద జోరు కొనసాగుతోంది. క్రొయేషియా రాజధాని జాగ్రెబ్‌లో జరుగుతున్న చెస్ టోర్నీ ర్యాపిండ్ విభాగంలో ప్రజ్ఞానంద తొలిగేమ్‌లో జర్మనీ గ్రాండ్ మాస్టర్ విన్సెంట్ కీమర్‌పై గెలుపొంది శుభారంభం చేశాడు. కీమర్‌పై దూకుడుగా ఆడిన ప్రజ్ఞానంద, ప్రత్యర్థి రాజుపైకి తన పావులతో దాడిని సాగించి, కేవలం 26 ఎత్తులలోనే పూర్తి 2 పాయింట్లను సాధించాడు. మాగ్జిమి లాగ్రెవ్‌తో జరిగిన రెండో గేమ్‌ను డ్రాగా ముగించాడు. ఇక ప్రపంచ ఛాంపియన్ గుకేష్ ప్రారంభం మాత్రం నిరాశతో మొదలైంది. ఇవాన్ సరిక్‌తో గేమ్‌ను గుకేష్ డ్రాతో సరిపెట్టాడు. ఫ్రాన్స్ సంచలనం అలిరెజా ఫిరౌజా రెండు గేమ్‌ల్లో గెలుపు, ఓ గేమ్ డ్రాతో అయిదు పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

# రెండోరోజూ లాభాల్లోనే ముగిసిన స్టాక్ మార్కెట్లు

# గ్లోబల్ సానుకూలతలే సెన్సెక్స్, నిఫ్టీలకు దన్ను





**ముంబయి, జులై 2:** భారత స్టాక్ మార్కెట్ గురువారం భారీ లాభాల్లో ముగిశాయి. వరుసగా రెండోరోజు మార్కెట్ లాభాల్లో ముగియడం విశేషం. సెన్సెక్స్ 579 పాయింట్లు, నిఫ్టీ 169 పాయింట్లు లాభపడ్డాయి. ఉదయం 9.15 గంటలకు ట్రేడింగ్ లాభాల్లో ప్రారంభమైంది. బీఎస్ఈ సెన్సెక్స్ 200 పాయింట్లకు పైగా లాభంతో 77,100 వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 70 పాయింట్ల లాభంతో 24,100 వద్ద ప్రారంభమైంది. చివరకు ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 579 పాయింట్లు లాభంతో 77,502 వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 169 పాయింట్ల లాభంతో 24,175 వద్ద ముగిసింది.

పశ్చిమాసియా యుద్ధం నివారణ, అంతర్జాతీయంగా సానుకూల పరిస్థితులు, చమురు ధరలు తగ్గడం, ఇరాన్, అమెరికా శాంతి చర్చలు వంటివి మార్కెట్‌కు కలిసొచ్చాయి. అదే విధంగా ఐటీషేర్లలో కొనుగోళ్లకు మద్దతు లభించడంతో మార్కెట్ మరింత లాభపడింది. సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌సీఎల్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్ షేర్లు లాభాల్లో ముగిశాయి. మారుతి, ఎల్అండ్‌టి, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్, కోటక్ బ్యాంక్, బీఈఎల్ షేర్లు నష్టపోయాయి. ఇతర ఆసియా మార్కెట్లు నష్టాల్లోనే ముగిశాయి. దక్షిణ కొరియా కోస్పి ఐదు శాతం నష్టపోయింది. జపాన్ నిక్కీ కూడా నష్టాలతోనే ముగిసింది. అమెరికా మార్కెట్లు కూడా నష్టాల బాటలోనే సాగాయి.

అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధర భారీగా తగ్గింది. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 71 డాలర్లుగా ఉంది. డబ్ల్యూటీఐ బ్యారెల్ క్రూడాయిల్ ధర 68 డాలర్లుగా ఉంది. గత మార్చి తర్వాత ఈ స్థాయిలో ధరలు తగ్గడం ఇదే మొదటిసారి. బంగారం, వెండి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ఔన్స్ బంగారం ధర 4,063 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డాలర్‌తో రూపాయి విలువ 95.40 వద్ద కొనసాగుతోంది. బిఎస్ఇలో 2536 షేర్లు లాభాల్లో కొనసాగితే 1740 షేర్లు క్షీణించి 191 షేర్లు స్థిరంగా కొనసాగాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఆగస్టు 5 నాటిధరలు రూ.1,44,488గా కొనసాగాయి.

# ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణకు కేంద్రం మరో అడుగు

**న్యూఢిల్లీ, జులై 2:** ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ప్రక్రియలో కీలకమైన ఐడీబీఐ బ్యాంకు విక్రయ ప్రక్రియకు కేంద్ర ప్రభుత్వం మరోసారి వేగం పెంచింది. వ్యూహాత్మక విక్రయ ప్రక్రియను పునరుద్ధరించే క్రమంలో ఇప్పటికే షార్ట్‌లిస్ట్ చేసిన బిడ్డర్ల నుంచి తాజా ఆర్థిక బిడ్లను ఆహ్వానించినట్లు సమాచారం. వచ్చే ఆర్థిక సంవత్సరం 2026-27లోనే ఈ వాటాల విక్రయాన్ని పూర్తి చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లావాదేవీ ద్వారా సుమారు రూ.50 వేల కోట్ల నుంచి రూ.55 వేల కోట్ల వరకు ఆదాయం సమీకరించాలని ప్రభుత్వం భావిస్తున్నది. గతంలో వచ్చిన ఆర్థిక బిడ్లు ప్రభుత్వం నిర్ణయించిన కనీస విలువ కంటే తక్కువగా ఉండటంతో విక్రయ ప్రక్రియ ఆశించిన విధంగా ముందుకు సాగలేదు. అయితే కొత్తగా బిడ్లను ఆహ్వానించకుండా, ఇప్పటికే షార్ట్‌లిస్ట్ చేసిన సంస్థలకే తమ ఆర్థిక ప్రతిపాదనలను సవరించి మళ్లీ సమర్పించాల్సిందిగా కేంద్రం సూచించింది. ఈ వ్యూహాత్మక విక్రయంలో కేంద్ర ప్రభుత్వంతో పాటు ఎల్ఐసీకి చెందిన ఐడీబీఐబ్యాంకు యాజమాన్య నియంత్రణను కూడా బదిలీ చేయనున్నారు.



# ఆయిల్ కంపెనీలకు రూ.74,781 కోట్ల నష్టం

## పెట్రోడీజిల్ ధరల తగ్గింపుపై కేంద్ర మంత్రి హర్దీప్





**న్యూఢిల్లీ, జులై 2:** పశ్చిమాసియా సంక్షోభం కారణంగా గ్లోబల్ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరిగినా దేశీయంగా ధరలను పెంచకుండా ఉంచడం వల్ల ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు గతనెలాఖరుకు రూ.74,781 కోట్ల నష్టాన్ని చవిచూసినట్లు కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ తెలిపారు. అంతర్జాతీయంగా చమురు ధరలు పడిపోయినప్పటికీ పాత క్రూడాయిల్‌నే ఇప్పటికీ ప్రాసెస్ చేస్తున్నాయని, ధరలు తగ్గకపోవడానికి ఇదే కారణమని చెప్పారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరలపై వివరాలు వెల్లడించారు. పెట్రో ఉత్పత్తులను ప్రాసెసే చేసేందుకు 2 నెలల ముందే క్రూడ్ ఆయిల్‌ను చమురు మార్కెటింగ్ కంపెనీలు కొనుగోలు చేస్తాయి. 2నెలల ముందు నుంచి ఈ ప్రక్రియ మొదలవుతుంది. అంటే ఇప్పుడు ప్రాసెస్ చేస్తున్న ఆయిల్ ఏప్రిల్ లేదా మే నెలలో కొన్నది. అప్పట్లో గ్లోబల్ మార్కెట్ ధరలు అధికంగా ఉన్నాయి. అమెరికా ఇరాన్ మధ్య ఒప్పందం కుదిరాక ఆయిల్ ధరలు దిగివచ్చాయి. రాబోయే కొన్ని వారాల పాటు అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తక్కువగా ఉన్నప్పుడు ధరలు తగ్గించరా అని అడగడం సమంజసమైన ప్రశ్న అవుతుందంటూ దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు ఎప్పుడు తగ్గిస్తారు అని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 71.47 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఏప్రిల్ 29వ తేదీన బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 118 డాలర్ల గరిష్ఠ స్థాయిని తాకింది. దీంతో భారత్ భారీగా విదేశీ మారకం నిల్వలను వెచ్చించాల్సి వచ్చింది. దీంతో దేశీయంగా లీటర్ పెట్రోల్ ధరను రూ.7.50 మేర పెంచాల్సి వచ్చింది.

# బ్యాంకింగ్ రంగానికి అతిపెద్ద ముప్పు ఎఐ




**న్యూఢిల్లీ, జులై 2:** :దేశ ఆర్థిక వ్యవస్థకు సంప్రదాయముప్పులైన ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్ల కంటే వేగంగా విస్తరిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) సాంకేతికతే అత్యంత ప్రమాదకరంగా మారిందని భారతీయ రిజర్వ్ బ్యాంక్ హెచ్చరించింది. ఆర్‌బీఐ విడుదల చేసిన జూన్ 2026నాటి ఆర్థిక స్థిరత్వ నివేదికలో ఈ కీలక అంశాలను వెల్లడించింది. ఆర్థిక రంగంలో ఏఐ ప్రవేశంవల్ల పనితీరు మెరుగైనప్పటికీ, అదే స్థాయిలో వ్యవస్థ భద్రతకు ఇది ఒక పెద్ద సవాలుగా పరిణమించిందనిఆర్‌బీఐ ఆందోళన వ్యక్తంచేసింది. దేశంలోని ప్రముఖ బ్యాంకులు, ఆర్థిక సంస్థల అభిప్రాయాల ప్రకారం రాబోయే 12 నెలల్లో సంభవించే సైబర్ ముప్పులలో ఏఐ ఆధారిత సైబర్ దాడులే అత్యంత ప్రమాదకరమైనవిగా మొదటి స్థానంలో నిలిచాయి. హ్యాకింగ్, రాన్సమ్‌వేర్, ఫిషింగ్ దాడుల కంటే ఏఐ సాయంతో సైబర్ నేరగాళ్లు చేసే దాడులు అత్యంత వేగంగా, సమర్థంగా, ఊహించని స్థాయిలో వ్యవస్థలను అతలాకుతలం చేసేలా ఉంటాయని నివేదిక స్పష్టం చేసింది.

ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా కలకలం సృష్టించిన మైథోస్‌రాన్సమ్‌వేర్ దాడి ఇందుకు నిదర్శనమని పేర్కొంది. సైబర్ దాడులతో పాటు ఆర్‌బీఐ ఈ నివేదికలో మరికొన్ని ముఖ్యమైన లోపాలను ఎత్తిచూపింది. మెజారిటీ బ్యాంకులు కేవలం కొన్ని క్లౌడ్ ప్లాట్‌ఫారమ్‌లు లేదా ఏఐ టెక్నాలజీ ప్రొవైడర్లపైనే ఎక్కువగా ఆధారపడుతున్నాయి. అంతర్జాతీయ నియంత్రణ సంస్థల తరహాలోనే ఆర్‌బీఐ కూడా త్వరలోనే అత్యంత కఠినమైన ఏఐ గవర్నెన్స్ నియమాలను, సరికొత్త ఫైనాన్షియల్ సెక్టార్ సైబర్ సెక్యూరిటీ ప్రణాళికలకోసం రిజర్వ్ బ్యాంక్ కసరత్తులు చేస్తోంది.



# ఒక్కనెలలోనే రూ.49,340 కోట్లు ఎఫ్‌పిఐలు వెనక్కి!

**న్యూఢిల్లీ, జులై 2:** భారతీయ ఈక్విటీ మార్కెట్‌లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల అమ్మకాల ఒత్తిడి గత నెలలో కూడా కొనసాగింది. ఎఫ్‌పిఐలు రూ.49,340 కోట్లు (సుమారు 5.16 బిలియన్ డాలర్లు) విలువైన షేర్లను విక్రయించి మార్కెట్ నుంచి తమ షేర్లు విత్‌డ్రా చేసారు. నెల ప్రారంభంలో ప్రపంచ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, అభివృద్ధి చెందిన దేశాల మార్కెట్లపై పెట్టుబడిదారుల మొగ్గు, అమెరికా బాండ్ యీల్డ్‌ల పెరుగుదల, భారతీయ మార్కెట్‌లో అధిక విలువలు ఈ విక్రయాలకు ప్రధాన కారణాలుగా నిలిచాయి.

సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (ఇండియా) లిమిటెడ్ (సీడీఎస్ఎల్) గణాంకాల ప్రకారం, 2026లో ఇప్పటివరకు విదేశీ పెట్టుబడిదారులు భారత ఈక్విటీల నుంచి మొత్తం రూ.2.7 లక్షల కోట్లను వెనక్కి తీసుకున్నారు. ఇది 2025 మొత్తం ఏడాదిలో ఉపసంహరించుకున్న రూ.1.66 లక్షల కోట్ల కంటే ఎక్కువ. ఈ ఏడాదిలో ఫిబ్రవరి మినహా ప్రతి నెలలోనూ ఎఫ్‌పీఐలు నికర విక్రేతలుగానే వ్యవహరించారు. జనవరిలో రూ.35,962 కోట్లు ఉపసంహరించుకున్న ఎఫ్‌పిఐలు, ఫిబ్రవరిలో మాత్రం 22,615కోట్ల పెట్టుబడులు పెట్టారు. ఇది గత 17 నెలల్లో నమోదైన అత్యధిక నెలవారీ పెట్టుబడిగా నిలిచింది. మళ్లీ మార్చిలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఆ నెలలోనే రికార్డు స్థాయిలో రూ.1.17లక్షల కోట్లను విదేశీ ఇన్వెస్టర్లు వెనక్కి తీసుకున్నారు. ఏప్రిల్‌లో రూ.60,847 కోట్లు, మేలో రూ.32,963 కోట్లు, జూన్‌లో రూ.49,340కోట్ల నికర విత్‌డ్రాలు రికార్డయ్యాయి. జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వి.కె. విజయకుమార్ మాట్లాడుతూ, డాలర్‌తో పోలిస్తే రూపాయి స్థిరపడటం, కొంత బలపడటం, అలాగే దక్షిణ కొరియా, తైవాన్ మార్కెట్లలో అధిక ఒడిదుడుకుల నేపథ్యంలో విదేశీ ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం వల్ల ఎఫ్‌పీఐల విక్రయాల తీవ్రత కొంత తగ్గిందని పేర్కొన్నారు. విదేశీ పెట్టుబడులు దేశ కరెంట్ అకౌంట్ లోటును భర్తీ చేయడంలో, చెల్లింపుల సమతుల్యతను నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో, విదేశీ మూలధనాన్ని ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వం, భారతీయ రిజర్వ్ బ్యాంక్ జూన్‌లో పలు చర్యలను ప్రకటించాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14